

సూరత్తు వేణుగోపాలరావు
విడాకుల వింతనాటకం
బెర్లిన్-గోడ
ఆలుమగల పితలాటకం

డైవోర్స్-'70

గాలిపటాలు

సూరత్తు వేణుగోపాలరావు



156

యం. శేషాచలం అండ్ కంపెనీ

మచిలీపట్టణం - సికింద్రాబాద్ - మద్రాసు

DIVORCE – '70

GALI PATALU

Two Plays by

SURATTU VENUGOPALA RAO

First Edition :

January, 1977

Publishers :

M. SESHACHALAM & Co.,

Machilipatnam, Secunderabad, Madras.

Cover Design :

BAPU

Printers :

SRI KALA PRINTERS,

Madras–33.

Price : Rs. 3-50

REVISED PRICE Rs. 5-00

Distributors :

ANDHRA PRADESH BOOK DISTRIBUTORS,

Rashtrapathi Road, Secunderabad.

'ఇంటింటా స్వంత గ్రంథాలయం'

ప్రణాళిక చందాదారులకు

ప్రత్యేక ప్రచురణ

డివోర్స్ - '70

పాత్రలు


పురుషోత్తం	....	భూస్వామి
సావిత్రి	....	ఇల్లాలు
అరుణ	....	వాళ్ళ చిట్టితల్లి
వెంకటేసు	....	నౌకరు
ఈశ్వరయ్య	....	పావిత్రి మేనమామ
విశ్వం	....	ఈశ్వరయ్యగారి అబ్బాయి
మాలతి	....	విశ్వం ప్రేమించిన లైలా
వరహరి	....	ప్లీడరు
రంగనాధం	....	న్యాయమూర్తి
పింహాచలం	....	కోర్టు బంట్రోతు

నాటకంలో కనపడదు కాని ఫోనులో వినపడే పాత్ర రంగనాధం గారి భార్య. పేరేమైతేనేం?

2018

ఈ నాటికలు గురించి

ఇందులోని రెండు నాటికలూ వర్తమాన విషయాలకి సంబంధించినవి;మనస్తత్వ పరిశీలనాత్మకమైనవి.''డైవోర్స్-'70'' మూడంకాల వ్యంగ్య హాస్య నాటిక. ఆసమానతలను తొలగించడానికి జరుగుతున్న మార్పులతో, సంస్కరణలతో మన సమాజం ఒక వెల్లువలా ముందుకు సాగిపోతూంటే ఎదురీద చూసేవారిని అపహాస్యం చేసే రచన. ''గాలిపటాలు'' నగరాలలో బాలనేరస్థులరూపంలో ఎదురయే జటిల సమస్యను ఇతివృత్తంగా చేసుకున్న రెండంకాల సీరియస్ నాటిక. మురికివాడ నుంచి వచ్చిన తల్లిలేని కుర్ర వాడు, కొడుకును పోగొట్టుకొని కుములుతున్న కులీనురాలికి చేరువ కాగలడా? ఆమె గుండెకోత మాన్పగలడా? చిన్న కుర్ర వాళ్ళని నేరగాళ్లుగా మారుస్తున్న సామాజిక పరిస్థితులు ఈ నాటికలో చిత్రితమయాయి. గాలి పడగ మూలంగా ప్రాణం కోల్పోయిన గారాలకూచి, గాలిపటాల కోసం దొంగతనం చేసిన గాలికిపెరిగే కుర్రడు, ఇందులో 'డబుల్ రోల్' కథానాయకులు. న్యూ డిల్లీలో ఈ రెండు నాటికలు ప్రదర్శింపబడి, ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాయి. ''గాలిపటాలు'' తెలుగు స్కూలు సొసైటీవారు, ''డైవోర్స్-'70'' గోష్ఠి బృందం వారు ప్రదర్శించారు.



శిల్పి

రచయిత గురించి

ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాలో పని చేస్తూ, శ్రీ సూరత్తు వేణుగోపాలరావుగారు ఆంధ్రప్రదేశ్ నుంచి భారత ప్రభుత్వం పనుపున కేంద్ర కార్యరంగానికి న్యూఢిల్లీ వెళ్లారు. అక్కడ, "సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్" వారి రిసెర్చ్ డివిజన్ అధిపతిగాను, క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టరుగాను, పోలీస్ రిసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్ బ్యూరో డైరెక్టరుగాను ఉద్యోగాలు నిర్వహించి, ప్రస్తుతం సిమ్లాలోని "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డు స్టడీ"లో విజిటింగ్ ప్రొఫసరుగా ఉంటున్నారు. ఆయన వ్రాసిన అనేక కథానికలు, వ్యాసాలు, పరిశోధక వ్యాసాలు ప్రముఖ పత్రికలలో వెలువడ్డాయి. ప్రచురణమైన వారి ప్రధాన గ్రంధాలలో మూడు- "ఫాసిట్స్ ఆఫ్ క్రైమ్ యిన్ ఇండియా" (Facets of Crime in India), "మర్డర్. ఎ పైలట్ స్టడీ ఆఫ్ అర్బన్ పాటర్న్స్" (Murder; A Pilot Study of Urban Patterns), "జూవినైల్ డెలిన్‌క్వెంసీ" (Juvenile Delinquency). ఆయన ఇంగ్లీషులో "ది డార్క్‌లింగ్ ప్లెయిన్" అనే నాటిక కూడా వ్రాశారు. వారు సివిమాలోక చిత్రణగా వ్రాసిన, కడుపుబ్బ నవ్వుపుట్టించే హాస్యనాటిక "దాసోహం" ఇదివరకే పుస్తక రూపంలో వచ్చింది.

ప్రస్తావన

సూత్రధారుడు:- మేమాడే ఈ నాటకం విడాకుల వింత నాటకం! ఆలుమగల పిత్తలాటకం! అంతా ఒక బూటకం!

రేడియో:- ఆకాశవాణి! వార్తలు!

పత్రికలమ్మే పిల్లవాడు:- ఆంధ్ర పత్రిక! ఆంధ్ర పత్రిక! భూ పరిమితి చట్టం!

సూత్రధారుడు:- పురుషోత్తం, కింపురుషోత్తం, చేశావా విడాకుల కాయత్తం? అనుకున్నా విదొక పరిహాసం. చివరికి అంతా మోసం!

పురుషోత్తం:-బ్రహ్మాండమైన ఉపద్రవమే వచ్చి పడింది. ఈ భూ పరిమితి చట్టమే వస్తే నాకు మిగిలేదేమిటి?

సూత్రధారుడు:- అమ్మనే, అపర సావిత్రమ్మనే! ఈ పుణ్య భూమిలో పుట్టిన బొమ్మనే! ఇవ్వనన్నానే భూమిలో ఒక అంగుళం, పాడేశానే పెళ్ళికే మంగళం!

సావిత్రి:- మా నాన్నగారు పసుపు కుంకుమతో పెట్టిన పాతిశేకరాలూ, మామిడితోటా, పొగాకు మెట్టా లాక్కుంటారా? వీల్లేదు.

సూత్రధారుడు:- హరిహరి హరిహరి నరహరిగారూ
తికమక చకపెక లాయరుగారూ
పడ్డది గొంతులో పచ్చి వెలక్కాయ
చివరికి మిగిలింది నోట్లో కరక్కాయి!

నరహరి:- కటుకంతా యందులోనే వుంది! భార్యాభర్తలు లాంఛనంగా విడాకులు పుచ్చేసుకుంటే ఎవరి ఆస్తి వాళ్ళకి కొంతైనా దక్కుతుంది!

సూత్రధారుడు:- ఈశ్వరయ్యా, కోటీశ్వరయ్యా
కన్నుతెరిస్తే దూర్వాసయ్యా

ఈనాటి కొడుకులూ కోడళ్లు
నువ్వు మింగలేని రోకళ్లు!

ఈశ్వరయ్య:- విశ్వం నా కడుపున చెడబుట్టాడు. ఆ దిక్కు మాలిన పిల్లని తప్ప వేరే చేసుకోడట! చూస్తాగా!

సూత్రధారుడు:- విశ్వం, విశ్వం!
విశ్వమంతటా అభ్యుదయం
రానున్నది మహోదయం!
జరజర సాగా ప్రగతి
నిర్వహిస్తే దుర్గతి!

విశ్వం:-నాకూ ఆశలూ ఆశయాలూ ఉన్నాయి. వాటికోసం త్యాగం చెయ్యగల శక్తికూడా ఉంది.

సూత్రధారుడు:- మంచీ చెడ్డా చెప్పేవాళ్ళు
నీతి నిజాయితీ చాటేవాళ్లూ
జీవితపు విలువలు తెలిసినవాళ్లూ
లేకపోలేదు మన దేశంలో
చచ్చిపోలేదు మన వ్యవస్థలో!

వెంకటేసు:- నా పేరు ఎంకటేసు. సాయిక్రమ్మ తన విద్య ముఖమైనా సూసిందా!

అరుణ:- విడాకులు! విడాకులు!! ఏమిటా ఆకులు?

సూత్రధారుడు:- మేమాడే ఈ నాటకం
విడాకుల వింత నాటకం!
ఆలుమగల పితలాటకం
అంతా ఒక బూటకం!
జీవితపు నిత్య నాటకం
అంతులేని జగన్నాటకం!!

[తెర]

మొదటి అంకం

[పురుషోత్తం యింట్లో డ్రాయింగు రూమ్. చూడగానే గొప్పవాళ్ళ ఇల్లని తెలుస్తుంది. స్టేజికి మధ్యలో వెనకాతలే సింహద్వారం. బయట నుంచి వచ్చే వాళ్ళందరూ అందులో నుంచే రావటం, పోవటం. తలుపు తెరిచివున్నప్పుడు చూచాయగా చిన్న తోట కన బడుతూ వుంటుంది. లోపల హాలు చాలా చక్కగా నవీన పద్ధతిలో అలంకరించబడింది. పెద్ద కాశ్మీరు తివాసీ, దాని చుట్టూ ఖరీదైన సోఫాలూ, చిన్నచిన్న బల్లలు. మధ్య బల్లమీద కట్‌గ్లాసు, పళ్లెంలో ఇకబానీ శైలిలో పువ్వులు, జముళ్ళు. పెద్ద సోఫా ప్రక్కనే రేడియోగ్రాం. దానిమీద సెలిఫోను. రెండు ప్రక్కలా గదుల్లోకి వెళ్ళటానికి తలుపులు. ఒకటి పురుషోత్తం గదిలోకి; ఇంకొకటి వాళ్ళ అమ్మాయి అరుణ చదువుకునే గది. ఎడమవైపున వున్న తలుపు భోజనాల గదిలోకి వంటింటిలోకి దారి తీస్తుంది. తలుపులకీ, కిటికీలకీ అందమైన పరదాలు. గోడలకి అవసరమైనచోట ఆధునిక చిత్రాలు. అవి ఎవ్వరికీ అర్థం అయేట్లు వుండకూడదు. ఒక పుస్తకాల బీరువా, తగుమాత్రంగా ఫర్నిచర్ పెట్టుకోవచ్చు. తెర లేచే సమయానికి ఎవ్వరూ వుండరు. సమయం ఏడుగంట లౌతుంది. పురుషోత్తం అప్పుడే నిద్రలేచి కళ్ళు నులుముకుంటూ ఆవులిస్తూ వచ్చి రేడియో ప్రక్కన సోఫాలో కూర్చుంటాడు. పురుషోత్తం వయస్సు ముప్పై ఐదు. వడ్డూ, పొడుగూ, మంచి విగ్రహం. జుట్టు ఎత్తుగా వుంటుందికాని చెంపల దగ్గర కొంచెం తెల్లబడుతోంది. స్లీపింగ్ సూట్ మీద పిల్కా డ్రెస్సింగ్ గౌను వేసుకున్నాడు. నోట్లో పైప్.]

పురుషో త్తం: వెంక టేసూ, వెంక టేసూ, కాఫీ తీసుకురా. (పైము చూసుకుంటూ) అరే! వా ర్తలు రావాలే. (రేడియో వేస్తాడు.)

రేడియో: ఆకాశవాణి. వా ర్తలు. చదువుతున్నది అవసరాల ఆశీర్వాదం. భావిభారత పురోగమనం దృష్ట్యా సాంఘిక సంక్షేమ కార్య క్రమంలో ప్రాతిపదికగా భూస్వాముల అధీనంలో వున్న వ్యవసాయ క్షేత్ర లని పరిమితం చెయ్యడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విప్లవాత్మకమైన సంస్కరణ చేయడానికి వీలుగా తగిన చట్టం వస్తుందని అభిజ్ఞ వర్గాల ద్వారా తెలుస్తోంది—

వెంక టేసు: (లోపలినుంచి కాఫీ తీసుకొచ్చి ప్రక్క బల్లమీద పెడ తాడు. వెంక టేసు అరవయ్యోపడిలో వున్నాడు. పూ ర్తిగా నెరిసిన జుట్టు, చప్పిదవడలు. చాలా నమ్మకస్తుడు. మాటల్లో కొంచెం గ్రామీణపు యాస.) అయ్యా, కాఫీ.

పురుషో త్తం: (కోపంగా రేడియో ఆపేసి) అవునవును! అ త్త సొమ్ము అల్లుడు దానం చేశాట్ట!

వెంక టేసు: అదేంటి బాబూ!

(నేపధ్యంలో) పేపరు సార్. (వీధి గుమ్మంలో పేపరు పడుతుంది. వెంక టేసు అది తీసి పురుషో త్తాని కిచ్చి లోపలకి వెళ్ళిపోతాడు.)

పురుషో త్తం: (తాపీగా కూర్చుని, మధ్య మధ్య కాఫీ తీసుకుంటూ చదవటానికి ఉపక్రమిస్తాడు.) న్యూఢిల్లీ. ఇవాళ ఉదయం జరిగిన చర్చలని బట్టి తేలిన విషయమేమిటంటే, భూపరిమితి చట్టం రావడం తథ్యమేకాని, చట్టాని కొక విశిష్ట రూపం రాలేదని మా ప్రత్యేక విలేఖరి వ్రాస్తున్నాడు. ఒకే సంసారంలో నాలుగై దు భాగాలు పంచేసి తగు జాగ్ర త్తపడ్డ దూర దృష్టిగల ఆసాముల ఆటకట్టించడం ఎలా అన్న సమస్యమీద తర్జనభర్జన లయ్యాయి. స్త్రీ ధనం విషయంలో కూడా అభిప్రాయ భేదాలు వున్నట్లు వినికిడి. భార్యాభ ర్తల సంగతి....

(లోపలినుంచి సావిత్రి వస్తుంది. వయస్సు రమారమి ముప్పై. చాలా చక్కనిది. తెల్లటి తెలుపు. కోటేరేపిన ముక్కు. విశాలమైన నేత్రాల్లో కొంచెం చిలిపితనం కనబడుతోంది.)

సావిత్రి: అదేమి టండోయి, భార్యాభర్తల సంగతంటున్నారు; చిలకా గోరింకల్లా వుండవలసిన భార్యాభర్తలూ పేపరెందుకెక్కారూ?

పురుషోత్తం: అబ్బబ్బ! బ్రహ్మాండమైన ఉపద్రవం విరుచుకు పడుతూ వుందని నేను తల్లడిల్లి పోతూవుంటే నువ్వు చిలకలనీ, గోరింకలనీ కలలు కంటున్నావు!

సావిత్రి: (కొంచెం ఆదుర్దాగా) ప్రొద్దుట లేచీలేవడంతోనే అంత బెదద ఏమిటొచ్చి పడిందండీ?

పురుషోత్తం: ప్రారబ్ధం! ప్రభుత్వం తీసుకొచ్చే చట్టం ప్రకారం మన యిద్దరికీ ముప్పై ఎకరాల కంటే ఎక్కువ ఉండకూడదు. వంశ పారంపర్యంగా నాకు సంక్రమించిన వంద ఎకరాలూ గవర్నమెంటు కైంకర్యమే!

సావిత్రి: ఆ! ఏమిటీ!! మా నాన్నగారు పసుపుకుంకుమ క్రింద నా కిచ్చింది కూడా ఊడలాక్కుంటారా? చూస్తాగా! ఇది నా ఆస్తి. రిజిస్టరులో ఎప్పుడో నమోదయిపోయింది. (నవ్వుతూ) ఈమాత్రందానికి గాబరా పడి పోయారా!

పురుషోత్తం: సావిత్రీ, ఇది పురాణకాలం కాదు. అప్పుడు నీ పేరిటిదే ఒక సాధ్వీమణి నాలుగు చరణాలు కాంభోజీ రాగంలో పాడేసి యమధర్మరాజులాంటి వాణ్ణి దిక్కరించడమే కాకుండా, చిత్రగుప్తుని చిట్టా ఆవర్జాలన్నీ తారుమారు చేసేసింది. ఇది కలికాలం. నువ్వు ప్లేటు మార్చి నాలుగు కదు - నలభై చరణాలు పాడినా వినే నాధుడు లేడు.

సావిత్రి: (దిగాలుగా) మరి మన ఆస్తిపాస్తులన్నిటికీ తిలోదకాలు వదులుకోవలసిందే? ఎంత అన్యాయం! ఎక్కడ చూచినా సీలింగే. చివరికి రెండు లక్షలు పెట్టి కట్టిన ఈ యిల్లు కూడా లాక్కుంటారా? ఏమిటీ? అప్పుడు మన గతి ఏం గాను? మన అమ్మాయి పెళ్ళి ఎలా చేస్తాం?

పురుషోత్తం: (చిరాకుగా) అరుణ సంగతా? ఎనిమిదేళ్ళ పిల్ల — దాని పెళ్ళి మాట యిప్పుడెందుకూ?

సావిత్రి: బాగానే వుంది! ఇప్పటినుంచీ మన ప్రయత్నంలో మనం వుండకపోతే ఆనాటికి ఆస్తులు ఎక్కడనుంచి వూడిపడతాయి? ఇప్పుడే కట్నాలు ధరలతో పాటు ఆకాశం అందుకుంటుంటే అరుణ పెండ్లీడు

కొచ్చేటప్పటికి ఎలా వుంటుందో ఆలోచించారా? పిల్లకోసం మనం వెనక వేసుకునే ఆస్తి కాస్తా ప్రభుత్వం అమాంతంగా కబళించేస్తే దాని గతేం కాను?....

పురుషోత్తం: అమ్మమ్మ! ఇప్పుడర్థమయిందా? ఈ చట్టం నిజంగా మన ప్రాణాల మీదకే వచ్చింది.

సావిత్రి: (కొంచెం ధైర్యంగా) మీరు మీరికే కంగారు పడకండి. చట్టాలు వచ్చినంత మాత్రాన మనం ఆస్తి వదులుకుంటామా? అవి రాసే వాళ్ళకి మాత్రం ఆస్తులు పాస్తులు వుండవా?

పురుషోత్తం: నీ చాదస్తం! బుంగమీసాలు పెంచుకుని ఏనుగు అంబారీలమీద తిరిగిన మహా రాజాధిరాజులే కిక్కురుమనకుండా మాయమై పోయారు. మనమెంత?

సావిత్రి: ఆ! చట్టాలకేం తక్కువ? కూర్చుంచే ఒకటి, లేస్తే ఒకటి! కట్నాలు తీసుకోకూడదన్నారుకాని కట్నం లేకుండా ఏ పెళ్ళయినా జరుగుతోందా?

పురుషోత్తం: కట్నం అంటే ఒక రకమైన నల్లధనం. అలాంటి వాటిని హరిహర బ్రహ్మాదులు కూడా పట్టుకోలేరు. ఈ సీలింగు చట్టం అలాంటిది కాదుగా? మనకున్న ఆస్తి వివరాలంతా రిజిష్టర్లలో కరణాల చిట్టాల్లోనూ ఎక్కి కూర్చుంది. ఆవులిస్తే ప్రభుత్వం అంగుళాలతో సహా లెక్క పెట్టేస్తుంది. (కొంచెం ఆలోచించి) ఉండు, ఒక చిన్న ప్లాను. (గట్టిగా) వెంకటేసూ, వెంకటేసూ!

వెంకటేసు: (ప్రవేశిస్తూ) ఏంది బాబయ్యా?

పురుషోత్తం: వెంకటేసూ, నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి—ఆస్తి విషయం.

వెంకటేసు: బికారి ముండావాణ్ణి, ఆస్తి సంగతి నాకెందుకు బాబూ? పాతికో పరకో వున్న నేల మీమామగారికే తాకట్టు పెట్టేశాను గదండీ!

పురుషోత్తం: అలా అనబోకు. కాలం మారిపోతోంది. ఎవరు చూశారు? నువ్వు రేపు లక్షాధికారై పోవచ్చు.

వెంకటేసు: మీకంతా ఏటాకోశం బాబూ! ఇవాళో రేపో కన్ను

మూసేవాడిని. నాకెందుకు ఆస్తి? చిన్నప్పటినుంచీ సాయిత్రమ్మని నా కళ్ళల్లో పెట్టుకు పెంచాను. ఈ ఇల్లు వాకిలీ కళకళ లాడుతుంటే, నాకదే చాలు.

పురుషోత్తం: నువ్వంత మంచివాడివి కాబట్టే నా ఆస్తిలో కొంత భాగం నీ పేర రాసేద్దామనుకుంటున్నాను.

సావిత్రి: (నిర్ఘాంత పోయి) ఆఁ ఆస్తి వెంకటేసుకి రాసి యిస్తారా?

పురుషోత్తం: (కొంచెం తెలివిగా) వెంకటేసుకి మాత్రం తెలీదూ? ఆస్తంతా ప్రభుత్వం పాలు చేసేబదులు వెంకటేసుకి కొంచెం యిస్తే వాడూ బాగుపడతాడు, మన ఆస్తీ పరులపాల పడకుండా వుంటుంది.

సావిత్రి: ఓహో! ఏమిటో అనుకున్నాను. మీకు కూడా అప్పుడప్పుడు మంచి ఆలోచనలే వస్తుంటయన్నమాట.

వెంకటేసు: (గాబరాగా) నాకేమీ అర్థం కావడం లేదు బాబూ. నిక్షేపంలాంటి ఆస్తి నాకరోడికి రాయటవేఁమిటీ?

పురుషోత్తం: ఎవరిదగ్గిరా అనకు, ఇదొక చిన్న ప్లాను. ప్రభుత్వం ఎవరికీ పదిహేను ఎకరాల కంటే ఎక్కువ వుండకూడదని ఆలోచిస్తున్నదట. ఆ చట్టం నిజంగా వచ్చిందంటే మనకి చేతికి చిప్ప! ముందుగా జాగ్రత్త పడటం మంచిది. వీలాంటి నమ్మకస్తుల్ని చూచి ఆస్తిని వీపరం చేస్తే, అది మన అధీనంలో వున్నట్లేగా!

వెంకటేసు: అదెలా బాబూ. నాకు రాస్తే మీ అధీనంలో ఎలా వుంటుందీ?

పురుషోత్తం: అదేగదోయి! చెప్పేదీ! ఏదారిన పోయేవాడికో ఇస్తామా? నువ్వెన్నటికీ ద్రోహం చెయ్యవని నాకు బాగా తెలుసు. అందుకే విన్ను సెలక్టు చేశాను.

వెంకటేసు: (తబ్బిబ్బుగా) ద్రోహమా? ఎంత మాటన్నారు? నా గొంతులో ప్రాణం వున్నంత కాలం మీకు ద్రోహం చెయ్యడమే!

సావిత్రి: (పురుషోత్తంతో) మీరు తొందర పడకండి. వెంకటేసు వ్యవహారంగా మంచివాడే, కాని డబ్బు పాపిష్టిది.

పురుషోత్తం: నేను చెప్పేది పూర్తిగా విను. వెంకటేసూ, ఆస్తి రాసిచ్చేముందు మనం ఒక చిన్న ఒప్పందం చేసుకోవాలి. అంతే.

వెంకటేసు: అయ్యా, మీ ఆస్తి వద్దు, ఒప్పందమూ వద్దు. నన్నిలా బ్రతకనియ్యండి.

పురుషోత్తం: ఉండవోయి, అంత భయపడి పోతావేం? ఆస్తి నీ పేర రాసినంత మాత్రాన నీకు పూర్తిగా కట్టబెట్టేస్తానా? తగు మాత్రంగా కమీషను ముట్టచెప్తానులే.

వెంకటేసు: అది మోసం కాదా బాబూ?....తమ రంబోళ్ళు పెయ్యొచ్చా?

సావిత్రి: ఇందులో మోసమేముంది వెంకటేసూ?—మన స్వాధీన మయిన భూమిని ప్రభుత్వం లాక్కొని ఎల్లయ్యకూ, పుల్లయ్యకూ పంచి పేయటం న్యాయమేనా?—నువ్వు నన్ను పెంచావు. ఇప్పుడు అరుణని ఆ చేతుల్తోనే పెంచుతున్నావు. ఉన్న ఆస్తి అంతా గవర్నమెంటు ఊడ లాక్కొంటే, రేపు దాన్ని ఏ అయ్య చేతుల్లోనో పెట్టాలా?

వెంకటేసు: సాయిత్రమ్మా, నువ్వు పట్టణం వచ్చాక శానా మారి పోయావు. ఆస్తికోసం దొంగరాతలు రాయించుకోమంటావా? మసిపూసి మారేడుకాయ చేద్దామనుకుంటే పెబుత్వం ఊరుకుంటుందమ్మా? వద్దమ్మా, వద్దు....

పురుషోత్తం: ఆలావాదేవీలన్నీ నేను చూచుకుంటాగా? నువ్వు 'సరే' అను—మన నరహరిని పిలిపించి ఇవాళే వ్యవహారం పైసలు చేయిస్తా.

వెంకటేసు: అదేంటి బాబూ....తెలియక ఆమె ఏదన్నా అన్నా మీరుకూడా, తొందర పడతారా? ఆస్తి చేతిలోకొచ్చాక మీకు పంగనామాలు పెట్టేస్తే ఏం చేస్తారు బాబూ? సాయిత్రమ్మ అన్నట్లు నేనూ మామూలు మనిషినే....ఏ పాడుబుద్ధి పుడుతుందో....

పురుషోత్తం: నువ్వలా ఎన్నటికీ చెయ్యవని నాకు పూర్తిగా నమ్మకం వుంది.

వెంకటేసు: పోనీలెండి. నేను సెయ్యక పోవచ్చు. నాబిడ్డ లూరు కుంటారా? మా పెద్దోడు-అసలే మొండివాడు. ప్రతి ఎలక్షనులోనూ ఆడే-మనం నోరెత్తితేచాలు భూస్వాములు నశించాలని గావుకేక వేస్తాడు. నాకు

మీరు ఆస్తి రాపిచ్చారని ఆడికి తెలిస్తే నా గొంతు పిసికి లాక్కుంటాడు. (లోపలికి వెళ్ళిపోతాడు.)

సావిత్రి: మా వెంకటేసు ఎంత నిక్కచ్చి మనిషో చూశారా? పైగా మొండిఘటం.

పురుషోత్తం: వాడు మొండిఘటమో కాదో గాని, నువ్వు మాత్రం అయోమయం. నేను వెంకటేసుని దెప్పి చెయ్యడానికి అన్నాను గాని, ఆస్తి ధారపోయటానికి బలిచక్రవర్తినా ఏమిటి? ఒకసారి చెయ్యిజారిపోతే, కాంతా, కనకం మళ్ళీ దొరకవంటారు.

సావిత్రి: (చిలిపిగా) నేను మీ చెయ్యి జారిపోనులెండి. ఆ భయం మీకేమీ అక్కర్లేదు. ముందు ఆ కనకాన్ని కాపాడుకోండి.

పురుషోత్తం: (ఆదుర్దాగా) ఏ కనకం?....

(బయటనుంచి....పురుషోత్తంగారూ)

పురుషోత్తం: ఓహో! నరహరిగారేనా?....రాండి.

(నరహరి ప్రవేశిస్తాడు. వయస్సు నలభై. ప్లీడరు దుస్తులా.... కొంచెం లావుగా పొట్టిగా వుంటాడు. బట్టతల, కళ్ళద్దాలు.) ఏమిటి సంగతి? ప్రొద్దుటే బయలుదేరారు? (సావిత్రితో) నరహరిగారికి కాఫీ తీసుకురా....

సావిత్రి: అలాగే - ప్లీడరుగారు సమయానికే వచ్చారు. ఆయన్ని సంప్రతించకూడదూ?....(లోపలికి వెళ్తుంది.)

నరహరి: మీ ఆవిడ ఏదో మాట్లాడాలంటున్నారు. అర్జెంటుగా ఒక కేసుమీద వెళ్తున్నాను....దారేకడా మిమల్ని చూచిపోదామని వచ్చాను.

పురుషోత్తం: డైవోర్సా! (గొంతు తగ్గించి) మనకు తెలిసినవాళ్ళు కారుగదా!—

నరహరి: క్లయింట్ల సంగతి ఇతరులకి చెప్పకూడదనుకోండి.... కాని, (నెమ్మదిగా) నోరు విప్పి అడిగారా—చెప్పకపోతే ఏమనుకుంటారో! ఎవరో ఏమిటి? —మీ ప్రక్కింటివాళ్ళే....

పురుషోత్తం: (ఆశ్చర్యంగా) ఆ! ఏమిటీ! మా ప్రక్కింటి పరంధామయ్య పెళ్ళాన్ని డైవోర్సు చేస్తున్నాడా?

నరహరి: వాడి మొఖం? వాడు డైవోర్సు చేయటమేమిటి? ఆయన

భార్య పారిజాతం ఇక పరంధామయ్యతో కాపరం చెయ్యనని భీష్మించుకూర్చుంది—

సావిత్రి: (కాఫీ తీసుకొస్తూ) ఏమిటేమిటీ? పారిజాతం పరంధామయ్యతో కాపరం చెయ్యదా?

పురుషోత్తం: (గతుక్కుమని) పడింది, నీ చెవుల్లో పడిందీ! ఇక కొంపలంటుకున్నట్లే!

నరహరి: పరవాలేదులెండి. సావిత్రమ్మ తొందరపడి ఎక్కడా అనే మనిషి కాదు....

పురుషోత్తం: (హాస్యంగా) మా ఆవిడ సంగతి నాకంటే మీకే బాగా తెలిసినట్లుందే?

సావిత్రి: చెప్పారులెండి, పెద్ద రహస్యం! ఆ యింట్లో సంగతులు వాడవాడలా తెలుసు.... ఇలాంటిదేదో భాగవతం జరుగుతుందని మన పని మనిషి రవణమ్మ నాకెప్పుడో చెప్పింది....

పురుషోత్తం: ఇంతకీ నరహరిగారూ, నిజంగా కాలవై పరిత్యమవే చెప్పాలి. లేకపోతే ఈ విడాకులేమిటీ? రామ! రామ!....పూర్వం మూడు ముళ్లూ ఒకసారి పడితే యిక జన్మ జన్మలకీ ఆ భర్తే లభించాలని కోరుకున్న మహాపతివ్రతల దేశం యిది....

సావిత్రి: బాగానేవుంది!....ఆనాడు వాళ్ళలా అనుకునేవాళ్ళు కాబోలు ....ఈనాడు పారిజాతానికి ఈ జన్మలోనే పరంధామయ్య తోరుకొట్టివుంటాడు. ఎవరి ఇష్టం వాళ్ళది!

నరహరి: మాంచి లాపాయింటే ...మనలో మాట.... చచ్చిపోతూ మా అమ్మ చెప్పిన ప్రకారం మా ఆవిడని చేసుకున్నాను. స్వీ లోకంలో రత్నం అంటే నమ్మండి. వంకాయ పుల్లగూర. ఇంగువ పోపువేసిన పప్పు చారూ చెయ్యటంలో అఖండురాలు. అంతమాత్రాన వచ్చే జన్మలో కూడా ఆవిడే నాకు భార్య కావాలనుకునే చవటనటండీ!—

సావిత్రి: మీరే అలా అనుకుంటే, మీ ఆవిడేమనుకోవాలి? సాధక బాధకాలు యిద్దరికీ వుంటాయి....(పురుషోత్తంతో)....మీరు నరహరిగార్ని సంహా అడుతానగున్నారుగా....కొంచెం కనుక్కోండి.

పురుషోత్తం: (కొంచెం చిరాగ్గా) ప్లీడరుగారు తొందరగా వెళ్ళాలట. మరోసారి....

నరహరి: (ఆశగా) వ్యవహారమేమైనా వుందా.... అడిగెయ్యండి.... నేనెలాగో సర్దుకుంటాను. మీకంటే పరంధామయ్యగారు ఎక్కువటండీ.... యింతకాలంగా స్నేహితులుగా వున్నాం నేనంటే ఆమాత్రం నమ్మకంలేదా.

పురుషోత్తం: (నసుగుతూ) అసలు సంగతి చెప్పాలంటే నోరు రావడంలేదు.... విషయం అటువంటిది....

నరహరి: అబ్బెబ్బే! నేను పరాయివాడినటండీ.... మీ విషయంలో అటు సూర్యుడిటు పొడిచినా యింకొకడికి తెలియనిస్తానా?

సావిత్రి: నరహరిగారింత నిక్కచ్చిగా చెప్తుంటే యింకా నీళ్ళు నములుతారేమిటండీ?

పురుషోత్తం: నరహరిగారూ, రాబోయే భూసంస్కరణ చట్టం మమ్మల్ని చాలా యిరుకున పెట్టేసింది. పెద్దలు సంపాదించిన వంద ఎకరాల మాగాణీ, మా ఆవిడకి పసువుకుంకం క్రింద యిచ్చిన పాతిక ఎకరాలూ, గవర్నమెంటు కైంకర్యమే నంటారా? ఏదో ఒక దారి వుంటుందిలే, వూరికే బెంబేలు పడొద్దని మా ఆవిడకి ఎంత నచ్చచెప్పినా, అదే మనసులో పెట్టుకొని బాధ పడతావుంది.

నరహరి: శ్రీరంగనాధా! ఇంత ఆలస్యం చేశారేమిటండీ! ఐదారు నెలల క్రిందట నాచెవిలోవేస్తే అంతా పకడ్బందీగా చేసేసేవాడిని. అందుకే, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నారు పెద్దలు.

సావిత్రి: మా ఆయన వట్టి సత్యకాలపు మనిషండీ. అయినా ఏమను కొని ఏం లాభం? మనకెలా రాసుందో అలా జరుగుతూంది. (కొంచెం బాధగా) మా జీవితాలు ఎలాగో వెళ్ళిపోతాయి. కాని మా అరుణ సంగతే నాకు పెద్ద సమస్యయిపోయింది.

పురుషోత్తం: ఇంతకీ నరహరిగారూ, ఈ సమస్యకేమీ పరిష్కారం లేదంటారు! అస్తికి తిలోదకాలే?

నరహరి: అబ్బే! నేనలా అన్నానేటండీ! చక్కని రాజమార్గం లేక పోయినా ఏవో దొంకతిరుగుళ్ళు లేకపోతయ్యా? 'లా'లో వున్న గొప్పతనమే అది! అయితే తమలాంటి పెద్దవాళ్ళకి చెప్పటానికి సంకోచంగా వుంది.

సావిత్రి: ఉన్నపళంగా ఉపద్రవం వచ్చిపడుతూ వుంటే సంకోచిస్తా రేమిటి? పరవాలేదు, చెప్పండి.

నరహరి: (నసుగుతూ) మరి.... మీరేమీ....అనుకోరుగదా!

పురుషోత్తం : అనుకునేట్లయితే నీ సలహా కోసం ఇంత ప్రాధేయ పడడ మెందుకూ? ఊ!

నరహరి: (బెదురుగా) ఈ పరిస్థితుల్లో ఒక్కటే ఉపాయం వుంది. చట్ట ప్రకారం ఆస్తి భార్యా భర్త లిద్దరికీ కలిపి పరమితం చేస్తున్నారుకదా! కిటుకంతా అందులోనే వుంది. భార్యాభర్తలు కనక వేరైతే—

సావిత్రి: (కంగారుగా) ఏమిటంటున్నారు? మేము వేరై పోవాలా? సలహా ఇవ్వమంటే మీరు చెప్పేదిదా? భలే ప్లీడరువయ్యా!

నరహరి: చెప్పనో దేవుడా అంటే ఏమీ పరవాలేదని గొందుమీద కూర్చున్నారు. తీరా చెప్పిన తర్వాత నానా మాటలూ అంటున్నారు. మా కున్న బాధలే యివి. నేను విడిపొమ్మన్నానా! అలాంటి దురుద్దేశం ఉంటే ఈ నరహరికి నరకం తప్ప వేరేలేదు. పోనీలెండి, వస్తా. (లేవబోతాడు)

పురుషోత్తం: నరహరిగారూ, కూర్చోండి. మా ఆవిడ స్వతహాగా తొందర మనిషి. ఇలాంటి విషయాలు నిదానంగా ఆలోచించాలి. ఇంతకీ మీరు చెప్పే సలహా—?

సావిత్రి: బోడి సలహా! ప్రొద్దున్నే వచ్చి మనల్ని వేరై పొమ్మం టున్నాడు!

పురుషోత్తం: కొంచెం (విసుగ్గా) నువ్వు కాస్సేపు ఊరుకొందూ, ఆయన్ని పూర్తిగా చెప్పనీ.

నరహరి: ఈ బెడద తప్పించుకోడానికి కొంత లాంఛనప్రాయంగా విడాకులు పుచ్చుకుంటున్నారు. అలా అయితే ఎవరి ఆస్తి వాళ్ళకి ఉంటుంది.

పురుషోత్తం: ఆస్తి కోసమని విడాకులు తీసుకుని ఊళ్ళో బ్రతక గలమండీ?

నరహరి: అవ్వా కావాలి, బువ్వా కావాలంటే ఎలా కుదురుతుంది? మీరు ముందుగానే మేలుకొనివుంటే, ఏ బావమరిదికో, ఎప్పుడో పుట్టబోయే మనవడికో పంచేసి రాజాలాగ కాలుమీద కాలు వేసుకుని కూర్చుండేవారు.

అలా చేపిన వాళ్ళంతా దూర సంథాగ్రాహులు. మీ విషయం వేరు. అటో ఇటో మీరే తేల్చుకోవాలి.

సావిత్రి: ఆలోచిస్తుంటే నరహరిగారు చెప్పేదికూడా సబబుగా ఉన్నట్టే వుంది.

పురుషోత్తం: (నిర్ఘాంతపోయి) నువ్వు క్షణ క్షణానికీ ప్లేటు మార్చేస్తుంటావు. కొంపతీసి నాకు విడాకు లిచ్చేస్తావా ఏమిటి?

సావిత్రి: నిజంగా విడాకులు కావుగదండీ!

నరహరి: బాగా చెప్పావమ్మా. అసలు పాయింటే అది! గిరీశం గారు ఎప్పుడో చెప్పినట్లు మనం సమయానుకూలంగా ఎత్తులు వెయ్యకపోతే నెభాయించుకురాలేంగా!

పురుషోత్తం: యింతకీ మేము విడాకులు తీసుకోవాలంటారు. అందులో ఎన్ని చీకాకులున్నాయో గమనించారా? అసలు సంగతి—మా ఆవిణ్ణి విడిచి నేనొక్క నిమిషం వుండలేను.

సావిత్రి: నిజమే! నేనుమాత్రం వుండగలనా?

నరహరి: అంతదాకా రానిస్తే నేనెందుకూ అంట! ఈ విడాకులు చట్టంకోసమేగా! వాటి దారిన అవి, మీదారిన మీరూ వుంటారు.

సావిత్రి: (గాభరాగా) అమ్మబాబోయ్! నేను చచ్చినా వేరుగా వుండలేనండీ. (అనుమానిస్తూ) మాఆయన స్వతహాగా మంచివారే.... కాని ఎంత మంచివాళ్ళయినా భార్య దగ్గరగా లేకుంటే బుద్ధి పెడదార్లు పడుతుంటుంది.

పురుషోత్తం: చాలుచాల్లే! ఇన్నేళ్ళొచ్చినా నీకీ అనుమాన పిశాచం వదల్లేదు. (కోపంగా) ఇంట్లోకి పో!

సావిత్రి: (రెచ్చిపోయి) పోవాలిట! యీ పుణ్యభారత భూమిలో భర్త పొమ్మంటే పోవాలి, రమ్మంటే రావాలి....? సరే, పోతాను. కాని ఒక్క సంగతి చెప్పండి. నేను మా వూరు వెళ్ళినప్పుడు పని కట్టుకుని ఆ పంతులమ్మ యింటికి పదే పదే వెళ్ళవలసిన అవసరం ఏమిటీ అంట!

నరహరి: సావిత్రమ్మా. ఎంతమాట! పురుషోత్తంగారు అపర శ్రీరామచంద్రుడు. మన వ్యవస్థలో ఆడోళ్ళతో మాట్లాడితేనే ఏదో అంట

గట్టెస్తారు. మొన్నటికి మొన్న పనిపిల్లతో కాఫీ తెప్పించుకున్నానని మా ఆవిడ రెండురోజులు పెద్ద దుమారం లేపింది.

సావిత్రి: (ఎగిరిపడుతూ) చల్లేవయ్యా, నువ్వూ నీ పనిమనిషీ!— ఎవరికి తెలియదంట! పేటంతా కోడై కూస్తుంటే, చెప్పొచ్చావు శ్రీరంగ నీతులు! (విసురుగా వెళ్ళిపోతుంది)

నరహరి: ఎంతమాట! ఎంతమాట!! భగవంతుడా! ఈ విషయం సావిత్రమ్మదాకా వచ్చిందీ! ఇదంతా మా యింటి పిశాచం చేసే రభస. పేటంతా డప్పు తీసుకుని చాటుతూవుంది కాబోలు!....అయినా, ఇవాళపని సామరస్యంగా జరిగేటట్లులేదు. ఆ పరంధామయ్య యింటికే వెళ్ళివుంటే సరిపోయేది. (లేవబోతాడు.)

పురుషోత్తం: మీరు కాస్త కూర్చోండి. సర్దేస్తాను. ఆడవాళ్ళ పిచ్చి అనుమానాలకి భయపడిపోతామా?—సావిత్రీ. సావిత్రీ....

సావిత్రి: (ప్రవేశిస్తూ) ఈ ఊబిలోకి నన్ను మళ్ళీ ఎందుకు లాగుతారు? వున్నమాటంటే అందరికీ ఉలుకే!

పురుషోత్తం: అందరూ అంటున్నదే నువ్వూ అన్నావు. నువ్వీ మాట నరహరిగారి చెవిలో వేసినందుకాయన చాలా కృతజ్ఞుడుగా వుండాలి. శ్రేయస్సు కోరే నీలాంటివాళ్ళు ముఖాముఖీ చెప్పేస్తారు. ముఖస్తుతి పరాయణులు నిజం దాచిపెట్టి చెయ్యి దాటిపోయాం తరువాత తాటాకులు కడతారు. అంతేనా, నరహరిగారూ?

నరహరి: అంతగాక మరేమిటండీ? సావిత్రమ్మ నికార్సైన మనిషి కాబట్టి కుండ బ్రద్దలుగొట్టినట్లు చెప్పేసి నాకు మహోపకారం చేశారు. మనం ఎంత మంచివాళ్ళమైనా ఇలాంటి విషయాల్లో లోకం ఏ మనుకుంటుందో తెలిసి ఉండటం మంచిది.

సావిత్రి: పాపం, మిమ్మల్ని అనవసరంగా బాధ పెట్టాను.

పురుషోత్తం: ఇంతకీ, మన వ్యవహారం?—

నరహరి: ఆస్తిలో కొంచెమైనా మిగుల్చుకోవాలనుకుంటే, నేను చెప్పిన దొకటే దారి. మిమ్మల్ని మించిన జేజమ్మలుకూడా ఈ దారే త్రొక్కారు.

(బయటనుంచి విసురుగా ఈశ్వరయ్య వస్తాడు. యాభై యో

పడిలోవున్నాడు. కొంచెం నెరసిన తల. బుంగమీసాలు. పొందూరు ఖద్దరు పంచ, పిల్కా లాల్చీ, జరీ ఉత్తరీయం, చాలా కోపంగా వున్నట్లు జేవురించిన ముఖమే చెబుతుంది.)

ఈశ్వరయ్య: (హడావుడిగా) సావిత్రీ, సావిత్రీ....(నరహరిని చూచి కొంచెం గతుక్కుమని) ప్రొద్దున్నే ఇక్కడ దాపరించావటయ్యా!

నరహరి: (కొంచెం భయంగా) అబ్బెబ్బే! ఏదో సలహా కావాలంటే వచ్చాను.

సావిత్రి: ఏం మావయ్యా, చాలా కోపంగా వున్నావు?

ఈశ్వరయ్య: (ఉగ్రంగా) కోపమా! వెధవని ఏం చేసినా పాపం లేదు. ఎంతపని చేశాడు!

నరహరి: (అదిరిపోయి) నేనా! నేనేం చేశానండి?

సావిత్రి: ఎవరి సంగతి మామయ్యా?

నరహరి: ఓహో! నేను కాదన్నమాట. ఇదేదో సంసార విషయం. మధ్యన నేనెందుకు? (లేస్తూ) పురుషోత్తంగారూ, మనం మరో రోజు తాపీగా మాట్లాడు కుందాంలెండి.

ఈశ్వరయ్య: (విసుగ్గా) వుండవయ్యా ఎక్కడి కెళ్తావు? అసలిది ప్లీడరు వ్యవహారం.

నరహరి: (సంతోషంగా) అలాగన్నారు. బాగుంది!

సావిత్రి: మామయ్యా సంగతేమిటో చెప్పావు కాదు.

ఈశ్వరయ్య: ఏం చెప్పేది, నా బొంద! అంతా చెయ్యిజారి పోయింది. నాలుగు ముక్కలు చదివి డిగ్రీ ఒకటి తగిలించుకోగానే తనం తటివాడు లేడని మిరిసిపడుతున్నాడు. దొంగ రాస్కెల్! నా కడుపున చెడపుట్టాడు.

సావిత్రి: (ఆశ్చర్యంగా) ఎవరూ? విశ్వమా?

ఈశ్వరయ్య: వాడే! కళ్ళు నెత్తిమీద కొచ్చాయి. ఎవతెనో ప్రేమించాడట. దాన్నితప్ప ఇంకెవరినీ పెండ్లి చేసుకోడంట. పెంచి పెద్దచేసి ఒక్కడే కొడుకని గారాబాలు చేసినందుకు నాకు తగిన శాస్తి చేశాడు.

పురుషోత్తం: బాబాయిగారు చాలా బాధ పడుతున్నారు. కాని యీ రోజుల్లో ఇది మామూలేగా.

నరహరి: (వెటకారంగా) మీరు భలేవాళ్ళండీ! పిల్లలకి మరీ చనువిచ్చేస్తే తర్వాత బాధపడవలసిన వాళ్ళం మనమే. దేనికైనా ఒక హద్దూ పద్దూ వుండాలి!

ఈశ్వరయ్య: ప్లీడరువైనా బాగా చెప్పావు. ఈ ఈశ్వరయ్య ఇంకా బ్రతికేవున్నాడు. నా కంఠంలో ప్రాణం వుండగా అలా జరగడానికి వీల్లేదని ఘంటాపథంగా చెప్పాను. ధవశేశ్వంతో ఇరవై ఐదు ఎకరాలు కట్నంతో లక్ష్మీదేవిలాంటి పిల్లనిచూచి తీర్మానం చేసుకువచ్చాక వీడు నాకెదురు తిరుగుతాడా? నా పరువు ప్రతిష్ఠ లేమైపోతవో కొంచెమైనా ఆలోచించాడా?

సావిత్రి: ఇంతకీ పిల్ల ఎవరూ?

ఈశ్వరయ్య: ఎవరై తేనేం? మనవాడిని కాస్తా బుట్టలో వేసేసింది. వాడి క్లాసుమేటట.

సావిత్రి: తొందరపడకు మామయ్యా. విశ్వం చాలా మంచివాడు. నువ్వంటే ఎంతో గౌరవం భయంకూడా వున్నాయి. ఆ అమ్మాయిని ప్రేమించాడు కాబోలు— మనమే సర్దుకుపోతే అందరికీ గౌరవంగా వుంటుంది.

ఈశ్వరయ్య: చాలు చాల్లే! గొప్పగా చెప్పొచ్చావు. సినిమాలు చూసి చెట్టు చుట్టూ పుట్ట చుట్టూ పరిగెత్తి ప్రేమ ప్రేమని పెద్ద నాటకం ఆడుతున్నారు. ఏమైనాసరే, నేను మాత్రం వొప్పుకోను.

పురుషోత్తం: మరి విశ్వం సంగతి?

ఈశ్వరయ్య: పొగరుమోతు వెధవ! ఒప్పుకుంటే వొప్పుకోండి లేకపోతేలేదు—నేనా పిల్లని చేసుకోవల్సిందే అని పట్టుపట్టాడు.

సావిత్రి: అంతదాకా వచ్చాక మనం చూపి చూడనట్లు పోతే మంచిది. అనవసరంగా పట్టుదలలకి పోతే సంసారంలో చాలా చీకాకులు వస్తాయి. పాపం! అత్తయ్య విశ్వంమీద పంచప్రాణాలు పెట్టుకుంది.

ఈశ్వరయ్య: ఆహా! విశ్వం వకాల్తా నీవు పుచ్చుకున్నావా ఏమిటి? వాడొచ్చి నీతో ఏమైనా మొరపెట్టుకున్నాడా?

సావిత్రి: రామ! రామ! ఈ సంగతే నాకు తెలియదు. ఈనాడు పిల్లల పోకడలే వేరు. అన్నీ తెలిసినవాళ్ళం మనమే సరిపెట్టు కోవాలిగాని వైషమ్యాలు పెంచుకోవడం మంచిదికాదు.

ఈశ్వరయ్య: అవునవును. చెప్పటం తేలికే. తండ్రి అనేవాడికి ఎంత బాధ వుంటుందో నీకెలా తెలుస్తుంది?

సావిత్రి: మామయ్యా నా మాట విందూ. తెలిసో తెలియకో తొందరపడ్డాడే అనుకో. నువ్వుకూడా తొందరపడితే ఎట్లా? వీ చేతుల మీదుగానే ఆ పెండ్లి చేసేస్తే అందరికీ ముచ్చటగా ఉంటుంది. ఆత్తయ్య ముఖమైనా చూద్దూ.

ఈశ్వయ్య: (కోపంతో) ముఖాలు చూచి అవమానాలు దిగమింగ టానికి నేను అల్లాటప్పా మనిషి ననుకుంటున్నావు కాబోలు. ఒకప్పుడు నా పేరు చెపితే పేటంతా గజగజలాడిపోయేది. పిట్టంతలేడు, నన్నెదిరించి పెండ్లి చేసుకుంటాడా? అదీ చూస్తాను.

పురుషోత్తం: ఇంతకీ ఏం చెయ్యాలని మీ ఉద్దేశ్యం?

ఈశ్వరయ్య: చెయ్యడమేమిటీ? చేసేశాను. ఇంట్లోనుంచి బైటికి నడవమన్నాను. నా ఆస్తితో చిల్లిగవ్వకూడా ముట్టద్దని ఖచ్చితంగా చెప్పేశాను.

సావిత్రి: (ఆవేదనగా) అయ్యయ్యో! పిల్లవాడికి నయానో భయానో చెప్పి చేతనైతే మనసు మార్పించుకోవాలిగాని కటీపిటీగా తెగ తెంపులు చేసుకుంటారా? పాపం! వున్నట్లుండి గడప త్రొక్కద్దంటే ఎక్కడికి పోతాడు?

ఈశ్వరయ్య: ఎక్కడికి పోతేనేం? గంగలో దూకమను.

పురుషోత్తం: సావిత్రి చెప్పినట్లు ఇలాంటి విషయాల్లో తొందపాటు పనికిరాదు బాబాయి. ఎంతైనా విశ్వం కొడుకు.

ఈశ్వశయ్య: (ఎగిరిపడుతూ) నువ్వుకూడా వాణ్ణి పెనవేసు కొస్తున్నావా? మీ మద్దతు ఏదో లేకపోతే వాడిలా చేస్తాడా? నాకంతా అర్థమయింది. దగ్గిరవాళ్ళని వస్తే నాకే ఎవరు పెడుతున్నారు. (నరహరితో) ఏమయ్యా ప్లీడరూ, నీకు కొంచెం తీరిక చిక్కగానే కనబడు. అ మొండి

వెధవకి నా అ స్తిలో దమ్మిడీకూడా ముట్టకుండా వీలునామా రాసేస్తాను. (లేస్తాడు.)

సావిత్రి: (ఆదుర్దాగా) వుండు మామయ్యా వుండు. విశ్వానికి కబురుచేసి తాపీగా మాట్లాడుకుందాం!

ఈశ్వరయ్య: (మరింత కోపంగా) తాపీగా మాట్లాడాలంటే నువ్వూ నీ మొగుడూ మాట్లాడుకోండి, నేను మాత్రం వాడి మొఖం చూడ దల్చుకోలేదు. పిల్లలమీద ఆపేక్షలూ, మమకారాలూ పెంచుకుంటే వాళ్ళు తల్లి దండ్రులకి చివరకి చేసే ఉపకారం ఇదే. (విసురుగా వెళ్ళిపోతాడు.)

పురుషో త్తం: మనకున్న సమస్యల మధ్యలో ఇదొకటి వచ్చి పడింది. ఎంతైనా తండ్రీ కొడుకులు.

సావిత్రి: మామయ్యకి ఎంత తొస్తే అంతే. పోనీ ఆ విశ్వానికైనా నచ్చచెపుదామంటే వాడు తండ్రిని మించిన గడుగ్గాయి. ఆ స్తన్నా వదులుకుంటాడుగాని ఆ అమ్మాయిని మాత్రం వదులుకునే రకం కాదు. నాకు బాగా తెలుసు.

నరహరి: (నసుగుతూ) నాకు భైమై పోతోంది. తమ వ్యవహారం—

పురుషో త్తం: అవునవును. విశ్వం గొడవలో మనసంగతి అడుగున పడిపోయింది. ఆ స్తి అక్కరలేదని త్రోసివెయ్యటం అంత చులకనైన విషయమా? చిన్నతనంలో ఇలాంటి త్యాగాలు చేసి తర్వాత పశ్చాత్తాప పడిన వాళ్ళు చాలామంది వున్నారు. ఇంతకి సావిత్రీ,నరహరిగారు చెప్పినట్లు మనం లాంచన ప్రాయంగా విడాకులు పుచ్చేసుకుంటే బాగుంటుందనుకుంటాను. ఏమంటావ్?

సావిత్రి: (బెదురుగా) ఏమో బాబూ, ఇది నరహరిగారు చెప్పినంత తేలిగ్గా కనబడటంలేదు. ఇందులో ఎన్ని తికమకలున్నయ్యో!

పురుషో త్తం: అరుణకోసం ఏమైనాచేస్తానని ఇంతకుముందేగా అన్నావు! అప్పుడే మర్చిపోయావా!

సావిత్రి: (దీనంగా) ఎలా మర్చిపోతాను? దానిసంగతి తలుచుకుంటే నా గుండెలు బ్రద్దలై పోతున్నాయి. అరుణ భవిష్యత్తుకోసం ఏ మాటలైనా పడాల్సిందే (దృఢంగా) సరే అలాగే పడతాను.

నరహరి: అలా గన్నారు బాగుంది! ధైర్యే సాహసే లక్ష్మి! ఇక కార్యరంగంలో దూకి నాటకం చకాపికీ నడిపించేస్తాను. చూస్తారుగా!

(విశ్వం ప్రవేశిస్తాడు. పాతికేళ్ళుంటాయి. కొంచెం హిప్పీ వైఖరి. జులపాలు. సైడ్‌బర్న్స్, బిగుతైన బెరిలిన్ లాగూ, పువ్వుల బుష్‌షర్టు వేసుకున్నాడు. స్ఫురద్రూపి, చక్కనివాడే గాని, ముఖంలో ఉద్వేగం, విచారం గోచరిస్తున్నాయి.)

విశ్వం: ఏమిటో నాటకం అంటున్నారే?

సావిత్రి: సమయానికేవచ్చావు. నువ్వే పెద్ద ప్రేమనాటకం ఆడుతూ ఏమిటని అడుగుతున్నావే? అదిగో, అప్పుడే దేవదాసుపోజు పెట్టేశావు!

విశ్వం: (కూర్చుంటూ) నాన్నగారు ఇక్కడికి వచ్చారుటగా?

సావిత్రి: రావడమేమిటి? తుఫానులాగా వచ్చాడు, నువ్వందరికీ పెద్ద సమస్యే తెచ్చావు. ముందుగా నాకన్నా చెప్పావా?

విశ్వం: నాన్న ఇంత కఠినంగా ప్రవర్తిస్తాడని నేను కలలో కూడా అనుకోలేదు.

పురుషోత్తం: మీ నాయన సంగతి నీకే తెలియదంటే ఆశ్చర్యంగా ఉంది. పోనీలే. నెమ్మదిమీద ఆయనే సర్దుకుంటాడు.

విశ్వం: ఆ స్టేజి దాటిపోయిందన్నయ్యగారూ! మా అమ్మ కాళ్ళా వేళ్ళా బడి ఏడుస్తున్నా కట్టుగుడ్డలతోటి నడవమన్నారు. అలాగే అని వచ్చేశాను. నాది తప్పంటారా?

సావిత్రి: ఇందులో తప్పొప్పులు ఎందుకు? పోనీ నువ్వైనా పెద్దాయన మనస్సు నొప్పించటం బాగుందా? ఆ అమ్మాయికి వివరంగా పరిస్థితులు చెప్పి నీ మీద ఆశ పెట్టుకోవద్దని తేల్చేస్తే అందరికీ శ్రేయస్కరం.

విశ్వం: ఇదా, నీ సలహా? నేనుమాత్రం నాన్న కడుపున పుట్టలేదూ? అ అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటానని వాగ్దానచేశాను. ఇవాళ నాన్న ఇంట్లోంచి గెంటేశాడని, ఇస్తిలో చల్లిగవ్వయినా ఇవ్వనని బెదిరిస్తున్నాడని లొంగిపోయే వాజమ్మని కాను. నాకూ ఆశలూ, ఆశయాలు వున్నాయి. వాటికోసం త్యాగం చెయ్యగల శక్తికూడా వుంది.

సావిత్రి: (నిర్ఘాంతపోయి) మామయ్య నిన్ను ఇంట్లోంచి నిజంగానే పొమ్మన్నాడా? ఊరికే భయపెడుతున్నాడేమో అనుకున్నాను.

నిశ్వం: అంతా అయిపోయింది. కట్టుబట్టలతో వచ్చేశాను, ఈ విశాల ప్రపంచంలో నాకు నీడ లేకుండా పోతుందా?

సావిత్రి: అదేం మాట? నీకు నీడ లేకపోవడ మేమిటి? మేమంతా ఏమైపోయాం? నిక్షేపంలా ఇక్కడుండు.

విశ్వం: ఇక్కడా?

పురుషో త్తం: ఏం? మేం పరాయివాళ్ళమా? నువ్వేమీ సందేహించకు. మీ నాయనకి డబ్బుదాహం పట్టింది. కట్నంకోసం అలా గింజుకు పోవడ యేమిటి? పిల్లవాడిని వున్నఫళంగా తరిమివేస్తాడా? వయస్సు ముదిరినకొలనీ బుద్ధి వక్రిస్తుందంటారు. ఆస్తులు పాస్తులూ, మనతో తీసుకుపోతా మనుకుంటున్నారు కాబోలు. విశ్వం, నువ్వేమీ భయపడకు. నీ కాళ్ళమీద నిలబడేదాకా ఇక్కడే వుండు.

సావిత్రి: అవును, ఏ మాత్రం సంకోచించకు....ఇంతకీ అమ్మా యెవరు?

విశ్వం; నెమ్మదిమీద నీకే తెలుస్తుందిగా—నేను వచ్చేముందు మీ రేదో సంప్రదించుకుంటున్నట్లున్నారు. మధ్యలో నేనెందుకు?(లేవబోతాడు)

సావిత్రి: కాస్సేపు కూర్చో. ఒక ముఖ్య విషయం నిన్నడగాలి.

విశ్వం నన్నా?

పురుషో త్తం: అవును విశ్వం. ఆస్తంతా తృణప్రాయంగా త్యజించి సర్వసంగ పరిత్యాగం చెయ్యడానికి నువ్వు సిద్ధపడ్డావు. కాని మేము మానవ మాత్రులం. పెద్దలిచ్చిన ఆస్తి కాస్తా ప్రభుత్వం ఊడపెరుక్కుంటుందేమోనని మా బాధ.

సావిత్రి: చాలా అవస్థలో పడిపోయాం.

విశ్వం: (నవ్వుతూ) మీకా? అవస్థలా? దేశమంతా మారిపోతున్నా మీ కేమున్నా తెలుస్తావుందా? భూములమీద మక్తా తీసుకుంటూ కాలిమీద కాలు వేసుకుని పట్నంలో రాజాలాగా వున్నారు. మీ క్లబ్బులూ, రమ్మీ పార్టీలు, విస్కీబుడ్లూ జోరుగా సాగుతున్నాయిగా ఇంకేం బాధలు.

సావిత్రి: ఎవరికుండే బాధలు వాళ్ళకుంటాయి. ఏదో చట్టం వస్తున్నదటగా? దానిప్రకారం మా భూములు కాస్తా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అంటున్నారు. నిజమేనా?

విశ్వం: ఓహో! భూ పరిమితి చట్టమా? నిజంగా చెప్పు, వదినా! ఒకళ్ళకి వందల ఎకరాల కొద్ది భూమి! ఇంకొకరికి తినడానికి తిండి, నిలవడానికి నీడలేని వ్యవస్థ ఎంత నీచమైనదో ఆలోచించావా?

సావిత్రి: సరేలే, నువ్వూ నీ రాజకీయాలూ! ఒకరినోరు కొట్టకుండా, ఒకరిజోలికి పోకుండా బ్రతుకుతున్నాం! ఇప్పుడు ఈ శాసనం మామీద బ్రహ్మరాక్షసిలా విరుచుకుపడ్డది. ఈ ఆపదలోంచి ఎలా తప్పించుకోడమాని విన్నప్పటినుంచీ సతమతమైపోతున్నాం.

విశ్వం: సతమతమై మీరు చేసేదేముంది.అందరితోపాటు మీరూనూ.

నరహరి: (అందుకుని) అలా అనుకుని బంగారలాంటి భూమి వదులుకుంటామటండీ? ఏదో ఉపాయం చూడాలి.

విశ్వం: (వెగటుగా) ప్లీడరు మహాశయా, మీ తెలివితేటలు వంకర టింకర సందుల్లో అతివేగంగా పరుగెత్తుతున్నాయి. అమాయకుడు మా పురుషోత్తం అన్నయ్యని ఏమైనా పితలాటకంలో పెడుతున్నావా ఏమిటి? జాగ్రత్త!

నరహరి: (భయపడిపోయి) బాబోయ్! నా కెందుకొచ్చిన బెడద! ఈ వ్యవహారం శ్రుతిమించి రాగాన్న పడుతోంది. ఇక వస్తా (మళ్ళీ లేవ బోతాడు)

పురుషోత్తం: ఉండవయ్యా, అంత బెదిరిబోతావేమిటి? నీలాగే విశ్వంకూడా మాకు చాలా ఆప్తుడు, అతనిసలహా కూడా తీసుకోవాలిగా!

విశ్వం: ఇంతకీ ప్లీడరుగారి సలహా ఏమిటో?

పురుషోత్తం: ఏముందిలే—లాంఛనప్రాయంగా కోర్టులో విడాకులు పుచ్చేసుకుంటే కొంతఆస్తయినా దక్కుతుందని అనుకుంటున్నాం, ఇలా చాలా మంది చేశారటగా.

విశ్వం: (నిర్ఘాంతపోయి) ఏమిటీ? వదినకూడా ఒప్పుకుందా?

సావిత్రి: నాకు నిజంగా ఇష్టంలేదు విశ్వం. అరుణకోసం సరే అన్నాను. ఆస్తులు మనతో వచ్చేవికావని నాకూ తెలుసు. కాని దానిగతి ఏమిటి? ఇంత ఐశ్వర్యంలో పుట్టి గారాబంగా పెరిగి చివరికి బికారిపిల్ల అవటం మాత్రం నేను సహించను.

విశ్వం: హర! హర!! ఎంతలేసి మాటలు పినాల్సి వచ్చింది. వెధవాస్తి! ఇవాళ వుంటుంది, రేపు పోతుంది. దానికోసం ఇంత జారిపోతారాఁఛీ!

నరహరి: దిగజారట మేమిటండీ? విడాకు లిచ్చినంతమాత్రాన దంపతులు వేరై పోతారా? ప్రేమాభిమానాలు ఎక్కడికి పోతాయి? ఆ కృష్ణమూర్తి గారిని చూడండి చక్కగా విడాకులిచ్చి ఆస్తి దక్కించుకున్నాడు. వాళ్ళకేం తక్కువయిందిఁ భార్యా భర్తలు చిలకా గోరింకల్లాగా కాపరం చేస్తున్నారు. మీకు తెలుసో లేదో, ఆ కేసు నేనే చేశాను.

విశ్వం: (కోపంగా) ఆఘోరించలేకబోయావ్?

నరహరి: (బిగువుగా) మాటలు కొంచెం జాగ్రత్తగా రానియ్యండి. అతిగాపోతే పరువునష్టం దావా తేవాల్సి వుంటుంది.

విశ్వం: (నరహరి మీదకి వస్తూ) దావా వేస్తావటరా, దొంగ రాస్కెల్! నిన్నేం చేసినా పాపంలేదు. (చెయ్యి చేసుకోబోతాడు)

పురుషోత్తం: (అడ్డువచ్చి) సలహా అడిగితే చెప్పాడు. నువ్వు ఆయనమీద చెయ్యి చేసుకోబోటం ఏమీ బాగోలేదు.

విశ్వం: (తగ్గి) ఇంతకీ మీ రిద్దరూ ఆయన చెప్పినట్లే చెయ్యడానికి తీర్మానించుకొన్నారన్న మాట. ఇక నా సలహా ఎందుకుఁ ఇంత బ్రతుకూ బ్రతికి ఈ నీచానికి వడిగట్టుకుంటున్నారా!

పురుషోత్తం: (చిరుకోపంతో) నీచం నీచమని చూలాగ్గా అనేస్తున్నావుఁ నీచ మెక్కడలేదు. మనం ఒక్కళ్ళం మడికట్టుకుంటే చివరికి మన్నే మిగిలేది. మీరు తెచ్చే చట్టాలు శాసనాలు కాకుల్ని కొట్టి గ్రద్దలకు వేస్తున్నయి.

విశ్వం: సంస్కారం, సంప్రదాయం ఉన్నవాళ్ళు కాబట్టి నాకు తోచింది చెప్పాను. భారతదేశంలో పౌరుడుగా నీకూ కొన్ని బాధ్యతలున్నయన్న సంగతి మర్చిపోవద్దు. శతాబ్దాలుగా పాతుకుపోయిన దారిద్ర్యాన్ని తొలగించటానికి విప్లవాత్మకమైన సంస్కరణలు చేయవలసిన తరుణం వచ్చింది. ఇది మనం జారవిడుచుకుంటే మహా ప్రళయమే రావచ్చు.

సావిత్రి: మంచి ఉపన్యాసమే ఇచ్చావు. నీ సిద్ధాంతాలు తెలిసికూడా నిన్ను సలహా అడగటం తప్పైపోయింది.

విశ్వం: నా అభిమానంకొద్దీ చెప్పాను.మీరిలా అపార్థం చేసుకుంటా రనుకోలేదు. ఇక నేనేమీ చెప్పను. చెప్పనసరమూ లేదు. కాని ఒక విషయం మాత్రం మనస్సులో వుంచుకోండి. ఈ బోడిప్లీడరుగాడి సలహా విని పిచ్చి వేషాలు వేస్తే ప్రభుత్వం ఊరుకుంటుందా? (విసురుగా వెళ్ళిపోతాడు.)

సావిత్రి: విశ్వం మళ్ళీ వస్తావుకదూ. నీకోసం వేరే గది ఏర్పాటు చేస్తాను. ఇవన్నీ మనసులో పెట్టుకోవద్దు సుమా!

విశ్వం: ఆ, దానికేముంది. అలాగే. (వెళ్ళిపోతాడు.)

నరహరి: అబ్బబ్బ! ఎంత ఉద్రేకం! ఎంత కోపం! నేను గజగజ లాడిపోయాను సుమండీ! నిజంగా చెయ్యి చేసుకున్నాడే అనుకున్నా.

పురుషోత్తం: మా విశ్వం అంతేలెండి. సామ్యవాద సిద్ధాంతాలు అతనిలో పూర్తిగా జీర్ణించుకుపోయాయి. ఆస్తులన్నీ ప్రభుత్వానికి ధారా దత్తం చేయమని ఎంత చక్కగా చెప్పాడు! ఆ ఈశ్వరయ్య భూములన్నీ అటూ ఇటూ పంచేసి ఆ డబ్బుతో వ్యాపారాలు పెట్టి లక్ష లార్జిస్తున్నాడు. నిజంగా ఆస్తిమీద ఆశలేనివాడు తండ్రి బయటికి పొమ్మనగానే అంత నీరుకారిపోవడ మెందుకు? ఏదో సామెత చెప్పినట్లు తనది కాకపోతే కాశీదాకా దేకమన్నాట్ట....మరి విడాకులకి తగిన కారణాలు, బలమైన సాక్ష్యం లేకుండా కోర్టువారు నొప్పుకుంటారా?

నరహరి: (హుషారుగా) మన దేశంలో సాక్ష్యానికేం కొదవ? ఇలా పుట్టించేస్తాం. ఇక కారణాలంటారా? పంతొమ్మిది వందల యాభై ఐదు హిందూ వివాహ చట్టంలో బోలెడన్ని కారణాలు పడివున్నాయి. మనకేది అనుకూలంగా వుంటుందో అదే తీసుకోవచ్చు....

సావిత్రి: అలా వీళ్ళు నములుతారేం? నివరంగా చెప్పకూడదూ.

నరహరి: చట్టమంతా కూలంకషంగా చెప్పాలంటే చేటభారతం అవుతుంది. సెక్షన్ పదమూడులో మనకి చక్కగా పనికొచ్చేవి రెండు మూడున్నాయి. మొదటిది మీలో ఒకరికి సరైన నిజాయితీ లేకపోవడం.

సావిత్రి: (అదిరిపడి) ఛీ! ఛీ! ఎంతమాటన్నావు?

నరహరి: పోనీ, ఇంకో మతమైనా పుచ్చుకోవాలి. అది కాకపోతే

మీలో ఒకరికి మతి చలించిందనో, సన్యాసం పుచ్చుకున్నారనో, పెట్టి కోవాలి.

పురుషోత్తం; జబ్బులు గిబ్బులు అంటే డాక్టర్ల సర్టిఫికేట్లు కావాలిగా।

నరహరి: అందుకే సబ్ సెక్షన్ ఒకటే బాగుందన్నాను.

సావిత్రి: (చాలా కోపంగా) చాలుచాల్లే, నీవు నీ సబ్ సెక్షనూ। నాకు నీతీ నిజాయితీ లేవని కోర్టులో చెప్పమంటారా।

నరహరి: అబ్బెబ్బే। అంత మాట మీకు చెప్తానా। (కొంచెం నసుగుతూ) మన పురుషోత్తంగారూ—

పురుషోత్తం: ఆ। నేనా।

సావిత్రి: నరహరిగారి సలహా దివ్యంగా వుంది. మగ మహారాజులు మీకేం ఒరిగిపోయింది। అటువంటి పేరు వుంటే గర్వపడేవాళ్ళుకూడా లేకపోలేదు.

పురుషోత్తం: ఏమిటా వెకిలిమాటలు। నా కలాంటి దగుల్బాజీ బుద్ధులు ఇంటా వంటా లేవు.

సావిత్రి: (వెటకారంగా) అవునవును। నే నెప్పుడూ ఒక కంట కనిపెట్టుకుని వున్నాను కాబట్టి ఇలా ఆగారుకాని కొంచెం ఏమారానంటే పూరుకునే రకమా। ఆ పంతులమ్మ కనకం ఇంటికి పదే పదే పని కల్పించుకుని వెళ్ళటం దేనికీ అంట।

నరహరి: (లౌక్యంగా) ఆ సంగతులన్నీ ఇప్పుడెందుకులెండి। కోర్టుకి వెళ్తున్నాం కాబట్టి ఇలాంటి దొకటి పెట్టుకోవాలి. పురుషోత్తం గారూ, మీరు కాస్త 'ఊ' అందురూ. గుట్టు చప్పుడు కాకుండా కథ నడిపించేస్తాను.

పురుషోత్తం: ఇంతకంటే గత్యంతరం లేకపోతే అలాగే కానివ్వండి.

నరహరి: అలాగన్నారు బాగుంది। విడాకులు—

(లోపలనుంచి అరుణ వస్తుంది)

అరుణ: (నరహరిని వెక్కిరిస్తూ) విడాకులు, విడాకులు। అమ్మా, ఏమిటా ఆకులు।

సావిత్రి: అరుణా, నువ్వు లోపలికి వెళ్ళు. పెద్దవాళ్ళని ఎక్కిరించొద్దని ఎన్నిసార్లు చెప్పాలి.

అరుణ (దీనంగా) నాన్నగారూ నేనేమన్నా తప్పన్నానా! విడాకులంటే ఏమిటి నాన్నగారూ?

పురుషోత్తం: నీకు తర్వాత చెప్తానులే. వెంకటేసూ, అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళు. (వెంకటేసు వచ్చి అరుణని లోపలికి తీసుకెళ్ళిపోతాడు.)

నరహరి: అందరూ మీలాగే ఒక నిర్ణయానికి టపీమని వచ్చేస్తే మా పని చాలా తేలికపడుతుంది. మీ ప్రక్కింటి పరందామయ్య అలా కాదుగా! నాన్చి నాన్చి, ఇదుగో, అదుగో, అని తిప్పుతున్నాడు.

సావిత్రి: ఉండండి. విడాకులు తీసుకుంటే వేరుగా వుండాలన్నారు. అదెలా సాధ్యం?

నరహరి: ఓస్! ఇంతేనా? ఈ యిల్లు మీ యిద్దరి పేరా ఉందికదా! మధ్యలో ఒక చిన్న గోడ పెట్టేస్తే సరిపోతుంది. కోర్టువారు అంతకంటే ఎక్కువ చూడరులెండి. ఈ విషయాలన్నీ నా కొదిలెయ్యమంటున్నాగా.... వస్తా!

(నరహరి వెళ్ళిపోతాడు. వెంకటేసు ఆదుర్దాగా ప్రవేశం!)

వెంకటేసు: సాయిత్రమ్మా, అరుణమ్మ నెప్పేది నిజమేనా?

సావిత్రి: (బింకంగా) ఏం చెప్పింది?

వెంకటేసు: ఇంకేం చెప్పాలి? ఇడాకులు తీసుకుంటున్నా వంటగా! ఆస్తికోసం ఎంత పని కొడిగట్టావమ్మా! ఇది మనకి తగిన పనికాదు.

సావిత్రి: వెంకటేసూ, నువ్వెవరివో, నీ తాహతేమిటో మరిచిపోతున్నావు. నీకు సంబంధం లేని విషయాల్లో కల్పించుకోవటం ఏమీ బాగోలేదు. ఈ సంగతి మళ్ళీ నా దగ్గర ఎత్తావంటే ఊరుకోను....(చాలా కోపంగా) పో, లోపలికి పో!

వెంకటేసు: నువ్వు చాలా మారి పోయావమ్మా. పొమ్మంటున్నావా? లోపలి కెందుకు, బయటికే పోతా! ముప్పయ్ ఏళ్ళు నీకు సేవ చేసినందుకు ఎంత మాటన్నావు? పోనీలే, ఒకప్పుడైనా ఈ ముసలిపీనుగ చెప్పినమాటలు గుర్తుకు రాకపోతయ్యా? (ఏదో జ్ఞప్తికిరాగా) అరుణమ్మా,

నే నెల్లిపోతుండా....అరుణమ్మా.... (చాలా బాధగా) బంగారు తల్లి. ఈ నాటితో నా ఋణం తీరిపోయిందమ్మా!

అరుణ: (లోపలినుంచి పరుగెత్తుకు వస్తూ) తాతా, తాతా! నువ్వెళ్ళొద్దు తాతా....

సావిత్రి: (అడ్డు వచ్చి) ఆగు! పోతే పోనీ!....

(వెంకటేసు బయటికి వెళ్ళిపోతాడు. పురుషోత్తం నిర్ఘాంతపోయి చూస్తుంటే తెర.)

రెండో అంకం

(జడ్జిగారి ప్రైవేటు రూము. మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. కోర్టు ప్రక్కనే వున్న గదిలో ఒక బల్ల. దానివెనుక ఒక కుర్చీ. బల్లమీద లావుపాటి లా పుస్తకాలూ, నాలుగైదు పైళ్ళూ చిందర వందరగా పడి వుంటాయి. ఇంకో ప్రక్కన చిన్న బల్లమీద జడ్జిగారు అప్పుడే భోంచేసిన పళ్ళెం, గ్లాసూ, టిఫిన్ కారియరూ, వేరే పైపున పుస్తకాల బీరువా రెండు కుర్చీలు, కిటికీకి నలిగి మాసిపోయిన కర్టెను. బీరువామీద టెలిఫోను. తెర తీస్తుంటే జడ్జి రంగనాధం చెయ్యి కడుక్కుని వచ్చి, చిన్న టవల్‌తో తుడుచుకుంటూ కుర్చీలో కూర్చుంటాడు. కోర్టు బంట్రోతు సింహాచలం టిఫిన్ కేరియరూ, ప్లేటూ తీసుకుపోవటానికి వస్తాడు.)

సింహాచలం: అయ్యగోరూ, భోజనమైపోయినట్టే గదండీ!

రంగనాధం: అయిపోయిందిలే. ఆ ప్లేటూ గట్రా తీసెయ్. ఇవాళ చేంబర్సులో డైవోర్సు కేసుంది.

సింహాచలం: అలాగే సార్! (కొంచెం ఆగి) ఇయ్యాళ మనింటో వంటాయన రాలేదుగదండీ.అందుకని వంటంతా అమ్మగారే స్వయంగా చేసారంట. కూరలు ఎలాగున్నాయో కనుక్కుని సెప్పరా, సింహాచలం అన్నారు.

రంగనాధం: నీముఖంలాగే ఉన్నాయి! వంకాయబజ్జీలో ఉప్పులేదు. ములక్కాయల సాంబారులో యింగువ గరళకంఠుడు మింగినా గజగజలాడిపోవలిసిందే. ప్రక్కన అయ్యరు హోటలునుంచి ఏ యిడ్లీ ముక్కో తెప్పించుకుంటే సరిపోయేది.

సింహాచలం: (ఖాళీగా వున్న టిఫిన్ కారియరు ఊపుతూ) పాపం! అయ్యగోరేమీ భోంచెయ్య లేదన్నమాట! అమ్మగారికి కూరలు బాగాలేవని చెప్పమంటారా?

రంగనాధం: (అదిరిపడి) అరే! అంతపని మాత్రం చెయ్యకు.... అయినా, నీకెందుకీ అధిక ప్రసంగం? పోయి పార్టీలని పిల్చుకురా.

సింహాచలం: ఆ నరహరి కేసాండీ?

రంగనాధం: నరహరి కేసేమిటి, నీ ముఖం! సావిత్రమ్మ వెర్సెస్ పురుషోత్తం. డైవోర్సు కేసు. భార్యాభర్తలు ఏ అరమరికలు లేకుండా చక్కగా కాపరం చెయ్యడానికి బదులు కోర్టులకి ఎక్కడం ఏమిటి? ఇది మన సంస్కారానికే దెబ్బ! (మళ్ళీ ఏదో జ్ఞాపకం రాగా) ఊరుకుంటున్నాను గదా అని ప్రతిదాంట్లో వున్నానంటావు! నోరు మూసుకొని పార్టీలని పిలు! (పైలు తీసుకుని కాగితాలు చూసుకుంటూ వుంటాడు. సింహాచలం తలుపు దగ్గిరసా వెళ్ళి 'నరహరిగారూ' అని పిలుస్తాడు.

నరహరి: (ప్రవేశిస్తూ) యిక్కడే వున్నానులే! (రహస్యంగా) జడ్జిగారు మంచి మూడ్‌లో వున్నారా? లేకపోతే యింకోరోజుకి వాయిదా అడుగుదాం.

సింహాచలం: (నెమ్మదిగా) అయ్యగోరు సుష్టుగా భోంచేసి మంచి హుషారుగానే వున్నారు పరవాలేదు.

రంగనాధం: సింహాచలం! త్వరగా పార్టీలని పిలవమంటే అక్కడ తర్జనభర్జన లేమిటి? (నరహరిని చూసి) ఈ కేసు మీరే చేస్తున్నారుగా!

నరహరి: (అతి వినయంగా) అవునండీ. ప్రొద్దుట సెషన్సులో మర్డరు కేసు. మధ్యాహ్నం మేస్ట్రీటు కోర్టులో పదహారు ఇడల్టరీ కేసులు.

రంగనాధం: (అదిరిపడి) ఏమిటేమిటీ! పదహారు ఎడల్టరీ కేసులా?

నరహరి: (నర్దుకుని) అవేనండీ, ఎడల్టరేషన్ కేసులు. దేశంలో ఎక్కడ చూసినా కల్తీయేగా! బియ్యంలో రాళ్ళు. గోధుమపిండిలో రంపపు పొట్టు, పెన్సిలిన్ గొట్టాల్లో మురికినీళ్ళు....రామ రామ! నాకీ కేసులతోనే తీరుబడిలేక చస్తున్నానమ్మా అంటే, కాదూ, కూడదని సావిత్రమ్మ ప్రాధేయపడితే వచ్చాను....మీకూ చాలా పైలుందికాబోలు! త్వరగానే ముగించేస్తానులెండి.

రంగనాధం: సింహాచలం అలా బెల్లంకొట్టిన రాయిలా నిలబడి పోయావేం? పార్టీలని పిలవమంటూంటే—

సింహాచలం: సావిత్రమ్మా, పురుషోత్తం భార్య సావిత్రమ్మా? పురుషోత్తం సావిత్రమ్మ భర్త పురుషోత్తం!....

నరహరి: సింహాచలం, అంత గట్టిగా ఎందుకూ? ప్రపంచమంతా తెలియాలా?

(సావిత్రి, ఆమె వెనకాలే పురుషోత్తం వస్తారు.)

రంగనాధం: మీరు కూర్చోండి. (ఒక్క క్షణం పైలు చూచి సావిత్రమ్మతో) మీరు పెట్టుకున్న అర్జీ ప్రకారం చెప్పిన అంశాలు ఏమిటంటే—మీరు అగ్నిసాక్షిగా వివాహమాడిన పురుషోత్తం అనే వ్యక్తి—వయస్సు ముప్పైఐదు—చెడు సహవాసాలుచేసి, అహోరాత్రుళ్ళూ క్లబ్బుల్లో పేకాటలాడుతూ, పైగా పరస్త్రీ వ్యామోహంలో పడిపోయి, అసలు ఇంటిముఖమే చూడటంలేదనీ, అడపాతడపా ఇంటికి వచ్చినా, మిమ్మల్ని నానా హింసలు పెడుతున్నాడనీ, అందుచేత విడాకులు యిప్పించమని కోరుతున్నారు. ఇదంతా నిజమేనా?

సావిత్రి (తల వూపుతూ) అక్షరాలా నిజమేనండి. ఇలాంటి దుర్భరమైన బ్రతుకు బ్రతికేకంటే, ఏ నూతిలోనో, గోతిలోనో దూకి జీవితమే చాలించుకుంటే మంచిదని అ స్తమానం ఏడుస్తున్నానండి.

రంగనాధం: పురుషోత్తంగారూ, ఈ కేసులో మీరు ప్రతివాది. మరి మీ తరపున వాదించడానికి ఎవరూ లేరా?

పురుషోత్తం: నేనే చూసుకుంటానులెండి.

రంగనాధం: (నిర్ఘాంతపోయి) అదేమిటయ్యా? లాయరు లేకుండా మీరు వాదించగలరా? కేసంటే అల్లాటప్పా వ్యాపార మనుకుంటున్నారా? ఇందులో ఏమీ లాలూచీ లేదుకదా!

నరహరి:. అబ్బెబ్బే! ఎంతమాటన్నారు? పాపం శమించుగాక! కోర్టులు మనం పూజించే దేవాలయాల్లాటివి, అటువంటి పవిత్ర స్థలాల్లో లాలూచీచేస్తే పుట్టగతులుంటాయండి?

సింహాచలం: అబ్బో! మన కోర్టుల్లో అందరూ నిజంతప్ప అబద్ధం చెప్పరు. ప్రమాణాల్లేవూ?

రంగనాధం: (చిరాగ్గా) నోర్ముయ్.

నరహరి: అబ్బెబ్బే! నేనేం అనలేదండి. నన్ను అపార్థం చేసుకుంటున్నారు.

రంగనాధం: (విసుగ్గా)నేనన్నది నిన్నుకాదు. ప్రక్కన లాయరు లేకుండా అసలైన న్యాయం ఎలా జరుగుతుందీ! ఎన్నో కష్టమయిన లా పాయింట్సు వస్తాయి. అలాంటివన్నీ ప్రతివాది ఎలా నిభాయించుకొస్తాడో నాకు తెలియటంలేదు.

నరహరి: అన్నీ తెలిసిన తమబోంట్లే యిలా శలవిస్తే ఎలా? యిద్దరు పార్టీలు లాయరు ద్వారానే వాదించాలని ఎక్కడైనా రూలింగు ఉందా? వాది ప్రతివాదులు యిష్టమైతే లాయర్లని పెట్టుకుంటారు. లేకపోతే లేదు.

రంగనాధం: అదీ నిజమే! (సైము చూస్తూ నరహరితో) సరే మీరు మొదలుపెట్టండి.

నరహరి: యువర్ ఆనర్....సావిత్రమ్మ పల్లెటూళ్ళో జన్మించింది. ఆమె తల్లిదండ్రులు మంచి సంప్రదాయం కలవాళ్ళు. ఒక్కగానొక్క బిడ్డ కాబట్టి చాలా గారాబంగా పెరిగింది. అన్నెమూ పున్యేమూ తెలియని అమాయకురాలు. ఇక పురుషోత్తం అంటారా? పట్నవాసాల్లో పెరిగి అన్నీ చవిచూచిన రసికాగ్రేసర చక్రవర్తి. కాలేజీలో చదువుకునేప్పుడే నాటు బీరకాయలు అవలీలగా మింగేసేవాడనీ—

రంగనాధం: ఆర్టర్, ఆర్డర్? బీరకాయలు మింగడమేమిటి? ఆర్గుమెంట్సులో అతిశయోక్తులకి తావులేదు.

నరహరి: అవేనండీ, బీరు బుడ్లు....ఆ రోజుల్లో పురుషోత్తంగారిది కడుపా, గంగాళమా అని విద్యార్థిలోకమంతా నివ్వెరపోయేవారని చెప్పే క్లాసుమేట్సు ముగ్గురు ఇప్పటికిప్పుడు వాజ్ఞ్మూలాలు ఇవ్వడానికి తయారుగా వున్నారు.

పురుషోత్తం: అబద్ధం. అంతా పచ్చి అబద్ధం!.... కాలేజీలో వున్నప్పుడు నాకు బీరంటేనే పరమ అసహ్యం. ఒక్కసారి మా స్నేహితులు బలవంతం చేస్తే పుచ్చుకున్నమాట నిజమే. అంతమాత్రాన గంగాళాలు ఊదేస్తానని అనటం ఏమాత్రం సవ్యంకాదు.

సావిత్రి: జడ్జిగారూ, అదంతా మీరు నమ్మకండి. ఇప్పటికిప్పుడు మా ఇంటికి వస్తే ఎన్ని ఖాళీ బుడ్లు పడి దొర్లుతున్నాయో ప్రత్యక్షంగా చూపిస్తాను. సొసైటీలో ఫేషన్‌గా ఒకటో రెండో పెగ్గులు పుచ్చుకోవడం తప్పులేదు. కాని అహర్నిశలూ త్రాగి బుడ్లు దొర్లిస్తే ఏ భార్య వూరుకుంటుందండీ!

పురుషోత్తం: అసలు మాఆవిడ యింట్లోకి ఒక చుక్కయినా రానీయదండీ. (సావిత్రితో) నీ కథాడీవాళ్ళ దగ్గరైనా తీసుకుని ఇంట్లో సాక్ష్యం తయారు చేశావా ఏమిటి?

రంగనాధం: (బల్లగుద్దుతూ) ఆర్డర్, ఆర్డర్! వాది ప్రతివాదుల కీచులాటలు నేను సహించేది లేదు. నరహరిగారూ కానివ్వండి.

నరహరి: యువర్ అనర్, ప్రతివాది పురుషోత్తం మధ్యపానానికి దాసుడే కాకుండా కాలేజిలో చదువుకునే రోజుల్లో చాలా అల్లాటప్పాగా వుండేవాడనీ, ఇంపుగాకనబడే అమ్మాయిలచుట్టూ తిరిగేవాడనీ ప్రసిద్ధి పొందాడు. ప్రపంచలో వుండే లోతుపాతులు తెలియని సావిత్రమ్మ తల్లిదండ్రులు పురుషోత్తం డబ్బు చూసి ఆయనకి కట్టబెట్టారు. వివాహమయిన తర్వాతనైనా సావిత్రిమ్మలాంటి పరమ సాధ్వియొక్క ప్రభావంవల్ల బాగుపడతాడనీ, పెద్దమనిషిగా మారుతాడనీ అనుకున్నారు. కాని వాళ్ళ ఆశలు—పాపం! అడియాశలై పోయాయి.

రంగనాధం: సావిత్రమ్మా, మీ భర్త లోపాలు మీకు ముందుగానే తెలుసన్నమాట.

సావిత్రి: అయ్యయ్యో! ఇలాంటి విషయాలు ముందే తెలిస్తే వివాహం చేసుకుంటానా? అసలు మా నాయన ఆ రంగనాధంగారికి ఇవ్వాలనుకున్నారు. మా నాయన మాట విననందుకు బాగా శాస్తి అయింది.

రంగనాధం (ఉలిక్కిపడి) ఏమిటేమిటీ? రంగనాధమా? నేనా? అయితే ఈ కేసు తీసుకోడానికి వీలులేదు.

నరహరి: జడ్జిగారు ఏదో తప్పు విన్నట్లున్నారు? ఆయన వేరే రంగనాధం. జి. రంగనాధం. ఇప్పుడాయన....

పురుషోత్తం: (కోపంగా) ఇప్పుడా సంగతు లెందుకు?

రంగనాధం: (కోపంగా) ఇదిగో, మళ్ళీ ఇంకొకసారి మధ్యలో

వచ్చావంటే బాగుండదు. కోర్టనుకుంటున్నారా? ఇల్లనుకుంటున్నారా? (విసుగ్గా) నరహరిగారూ, మీరు తొందరగా ముగించండి. పైన పోలెడంత పని వుంది.

నరహరి: యువర్ ఆనర్, ఇందాక చెప్పిన ఆర్గుమెంట్లులో ప్రతివాది యొక్క మనస్తత్వం పూర్తిగా విశదీకరించాను. జులాయి, త్రాగుబోతు, జూదరియైన పురుషోత్తంతో సావిత్రమ్మ యింతకాలం ఎలాగో నెట్టుకొచ్చింది. అభమూ శుభమూ తెలియని వాళ్ళ చిట్టితల్లి అరుణ కోసం ఏ అగచాట్లు యినా పడాలనీ, జీవితమే ధారపోయాలనీ, నిశ్చయం చేసుకుంది. కాని పురుషోత్తం వూరుకుంటాడా? ఆమెని దారుణంగా హింసించేస్తున్నాడు. ఎన్నోసార్లు తప్పత్రాగి అతి సుకుమారమైన ఆమె శరీరంమీద చెయ్యికూడా చేసుకున్నాడు.

పురుషోత్తం: చాలు చాల్లే! వకాల్తా పుచ్చుకున్నందుకు యిష్టం వచ్చినట్లు వాగేస్తున్నావు!

నరహరి: చూశారా! చూశారా! యువర్ అనర్! ప్రతివాది ఎంత కైనా తెగించాడు. ఇటువంటి కిరాతకుడైన భర్తతో నేనింక కాపరం చెయ్యలేను....చెయ్యను, చెయ్యను!!

రంగనాధం: నువ్వు కాపురం చెయ్యడ మేమిటయ్యా.

నరహరి: తమరికన్నీ తెలుసు. వాళ్ళ యింటితరపున మాట్లాడుతున్నప్పుడు ఆమె నేనే, నేను ఆమే!

పురుషోత్తం; ఆరి పిడుగా! సర్వాంతర్యామివి—నువ్వేమైనా అవుతావు.

రంగనాధం: ఆఖరుసారి చెబుతున్నాను. ప్రతివాది అనవసరంగా జోక్యం చేసుకుని మాట్లాడితే కోర్టు ధిక్కారం క్రింద చర్య తీసుకోవలసి వస్తుంది.

పురుషోత్తం: క్షమించండి. తప్పైపోయింది.

రంగనాధం: సావిత్రమ్మా, నీతరపున చెప్పిందంతా నిజమేనా? తగిన సాక్ష్యంలేక ఆబద్ధపు పిటిషన్ దాఖలు చేశారని రుజువైతే చాలా కష్టాల్లో పడతారు.

సావిత్రి: ప్రాణంమీదికి వస్తేకాని, ఏ భార్య భర్తని వదులుకోవా

లనుకుంటుందిఁ మన సంప్రదాయంలో ఉన్న నీతి నియమాలూ, వివాహ బంధంలో వున్న పనిత్రతా, తెలిసికూడా ఇవాళ నేను కోర్టుకి రావలసి వచ్చిందంటే, నా హృదయం ఎంత క్షోభిస్తున్నదో భగవంతుకే తెలుసు. కాని గౌరవంగా తెగతెంపులు చేసుకోకపోతే ఏ ప్రమాదం వస్తుందో, ఎంతెంత ఘోరాలు జరుగవచ్చో తమరే ఆలోచించండి. (ఏడుస్తూ) నాజీవిత మెలాగూ నాశనమైపోయింది. ఆ ముక్కుపచ్చలారని బిడ్డ ముఖమైనా చూసి నాకు న్యాయం చేయమని అడుగుతున్నాను.

నరహరి: (జడ్జితో) వాది స్త్రీ కాబట్టి చెప్పవలసిన కొన్ని విషయాలు తన నోటితో చెప్పటానికి సంకోచపడుతూ వుంది. గత నాలుగైదేళ్ళుగా ఆమెకు సంసార సుఖం అంటే ఏమిటో తెలియదని మనవి చేస్తున్నాను. పండువెన్నెలలాంటి ప్రాయంలో, తీరని కోరికలతో, అంతులేని నిరాశలో కృంగి కృశించిపోతోంది. దానిమీద పులిమీద పుట్రలా, భర్త పరస్త్రీ వ్యామోహంలో పడి ఆస్తంతా గుల్లచేయటమే కాకుండా హింసాపూరితంగా ప్రవర్తిస్తున్నాడు. కోర్టువారు ఈ సంగతులన్నీ సమగ్రంగా ఆవగాహన చేసుకుని సరైన ఆర్డరు జారీ చేయకపోతే విపరీతమైన పరిణామాలకి బాధ్యులౌతారు.

రంగనాధం: వాది తరపున పిటిషన్ విన్నాను. ప్రతివాది చెప్పవలసిన దేమైనా వుందాఁ

పురుషోత్తం: లేకేమండిఁ బోలెడంత వుంది. ఇదంతా పెద్ద నాటకం సార్ఁ ఉద్ద అబద్దంఁ

రంగనాధం: ఇది కోర్టని మీ కెన్నిసార్లు చెప్పాలిఁ ఇక్కడ కొన్ని సభ్యతలు పాటించాలి.

పురుషోత్తం: యువరానరూ, నేను అబద్ధం చెప్పడం లేధండి. మా ఆవిడ వేసిన పిటిషన్లో చాలా అవకతవకలూ, అబద్ధాలూ ఉన్నాయనే మనవి చేసుకుంటున్నానండి. నన్ను త్రాగుబోతన్నారు. ఈ రోజుల్లో తాగని వాళ్ళెవరుసార్ఁ అది లేకుండా ఒక్క పనైనా జరుగుతుందా చెప్పండి. పగలంతా ఆఫీసుల్లో పనిచేసి అలసి సొలసిపోయే పెద్ద పెద్ద అధికారులూ, లక్షలార్జించే పారిశ్రామిక వేత్తలూ, గ్రామ గ్రామలూ పర్యటనలు చేసి గుక్క తిప్పుకోకుండా ఉపన్యాసాలిచ్చే రాజకీయ దురంధరులూ, చివరకి

గౌరవనీయులైన న్యాయమూర్తులు కూడా, సాయంత్రం ఒకటో రెండో చుక్కలు వేస్తేనేకాని మర్నాటికి మళ్ళీ తేరుకోలేరు. తమరుకూడా—

రంగనాధం: ఏమండోయ్....

పురుషోత్తం: క్షమించండి. మాటవరసకి అనబోయాను గాని తమవంటి పెద్దవాళ్ళకీ చెడ్డ అలవాట్లుంటాయా?

రంగనాధం: సరే, కానీయవయ్యా—

పురుషోత్తం: అయ్యా, నేను మా గ్రామం గొల్లపాలెంలో ప్రశాంతంగా జీవించాలనీ, దాన్ని సర్వాముఖంగా వృద్ధిలోకి తేవాలనీ సంకల్పించుకున్నాను. కాని పెళ్ళయి పట్టుమని పదిరోజులు కాకుండానే మా ఆవిడ పల్లెటూర్లో కాపరమేటని పట్నవాసంలో పెట్టించింది. దాంతో ఊరుకుందా? అన్ని క్లబ్బుల్లోనూ మనమే వుండాలనీ, పెద్ద పెద్ద ఉద్యోగస్థులందరితో పూసుకు పూసుకు తిరగాలనీ గోలచేసేసింది. పగలూ రాత్రీ అనే భేధం లేకుండా పాయింటు రూపాయిపెట్టి జోకరురమ్మీ ఆడుతుందండీ....ఏమన్నా అంటే సినిమాలో సూర్యకాంతమే అనుకోండి! ఏం చెప్పమంటారు నా బాధలు?

సావిత్రి: నేను రమ్మీ ఆడినంత మాత్రాన అంత ఉడుకుమోతుతనం ఎందుకు? సర్వేళలూ వంటింట్లో చాకిరీ చేసుకుంటూ పడివుంటాని కిది పురాణకాలం కాదు.

రంగనాధం: నాకు తెలియక అడుగుతాను—ఆడవాళ్ళకి ఇల్లు ముఖ్యమా? క్లబ్బు ముఖ్యమా? సంసారమన్న తర్వాత, కొంచెం భర్తనికూడా గమనించుకో వద్దూ?

సావిత్రి: ఆహా! క్లబ్బులో రమ్మీ ఆడేది నేనొక్కదాన్నేనా? కలెక్టరుగారి భార్య, సూపరెంటుగారి సతీమణి, మీఆవిడ—

రంగనాధం: అదిగో! ఏమో అనుకున్నాను....నరహరిగారూ, మీ క్లయింటుని కొంచెం అదుపులో పెట్టుకోండి....

నరహరి: (గబుక్కున) కోర్టువారు మమ్మల్ని క్షమించాలి మీఆవిడ సంగతులు యిక్కడికి రానీయమని పూచీ యిస్తున్నాము.

పురుషోత్తం: (మధ్యలో అందుకుని) మా ఆవిడ—

రంగనాధం: (సరిగా వినకుండా, కోపంగా) మళ్ళీ అదే మాట!

పురుషోత్తం: మీ ఆవిడ కాదండి....మా ఆవిడ....ఇవాళ ప్రత్యేకంగా కోర్టువారిని నమ్మించేందుకు మహా పతివ్రతా వేషం ధరించి, బుడి బుడి రాగాలతో, కల్లబొల్లి మాటలతో మీ కళ్ళలో—అంటే న్యాయం కళ్ళల్లో కారం జల్లటానికి బ్రహ్మాండమైన పన్నాగం వేసింది....మా ఆవిడ కనపడుతున్నంత అమాయకురాలు కాదండోయి. అహర్నిశలూ నన్ను సతాయించుకు తింటూ ఇల్లొక నరకం చేసేసింది.

రంగనాధం: నిజమే, కొంతమంది భార్యలు ఇల్లొక నరకం చేస్తారు (టెలిఫోను మోగుతుంది. అది తీసుకుని) హల్లో! నువ్వేనా? కొంచెం నెమ్మదిగా మాట్లాడకూడదూ?.....అబ్బబ్బ! నువ్వెలా మాట్లాడినా నాకు కటువుగానే వినిపిస్తుందంటావా? రామ రామ! నేనలా అనలేదు. ఇంతకీ ఫోను ఎందుకు చేసినట్లు? కేసు మధ్యలో ఉన్నాను....ములక్కాయల సాంబారేనా? బాగానే ఉంది కాని కొంచెం యింగువ ఎక్కువైన దనిపించింది.... అరే! ఎందుకంత కోపం? ఆ మాత్రం కూడా చెప్పకూడదా ఏమిటి? అయినదానికీ, కానిదానికీ నువ్వలా తప్పు పట్టుకుంటే ఎలా? సరే, ఇంకెప్పుడూ అననులే. (ఫోను పెట్టేసి దిగాలుగా కూలబడిపోతాడు.)

నరహరి: అయ్యా, కాలుజారితే తీసుకోవచ్చు కాని, మాట జారితే.

రంగనాధం: (తను కోర్టులో ఉన్న సంగతి మర్చిపోయి) చక్కగా చెప్పేవు. మా ఆవిడ—(నాలుక కొరుక్కుని) మీ కేసు కానియ్యండి.

(టెలిఫోను మళ్ళీ మ్రోగింది. ఎవరూ ఎత్తకపోతే రెండు మూడు సార్లు కొట్టుకుని మళ్ళీ ఆగిపోతుంది.)

సింహాచలం: అయ్యా, ఫోనుచేసేది అమ్మగారేలాగుంది. గబుక్కున తమరు తీసుకోలేదని కోపంవచ్చి పెట్టేశారు కాబోలు. కొంచెం గమనించండి.

రంగనాధం: (చిరాకుగా) వస్తేరానీ ఎవరికి లెక్క. అయినా నీకెందుకీ సంగతులు? నోర్ముయ్!

నరహరి: అయ్యా మీరు కొంచెం కలవరంగా వున్నారు. తమకి ఏదన్నా యిబ్బందివుంటే కేసు వాయిదా వేసుకుందాం.

పురుషోత్తం: చాలు చాల్లే! వాయిదాల పేరుచెప్పి మా ఆవిడ దగ్గిరనుంచి ఫీజు గుంజుకోడానికా?....జడ్జీగారూ, గోటితో పోయేదానికి గొడ్డలి

ఎందుకండీ. నేను ఒప్పేసుకున్నానుగా! ఆర్డరు పడేస్తే మాదారిన మేము పోతాం. (అని లేచిపోబోతాడు,)

రంగనాధం: (తేరుకుని) పురుషోత్తంగారూ మాదారిన పోతాం అని చులాగ్గా అనేస్తే సరిపోతుందటండీ? వివాహం మన ధర్మశాస్త్ర ప్రకారం ఎంతో పవిత్రమైన బంధం. అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యాభర్తలు జీవిత పర్యంతం కష్ట సుఖాల్లో కలిమిలేములల్లో ఒకటిగా వుండాలని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అటువంటి పవిత్ర బంధాన్ని ఒక్కముక్కతో తెంపేసి పారెయ్యడానికి ఇది అమెరికా కాదు—ఫ్రాన్సూ కాదు. మన పుణ్య భారత దేశంలో—(ఫోను మళ్ళీ మ్రోగుంది. తొందరగా దాన్ని అందుకుని, ఆదుర్దాగా) నాకు తెలుసు. నీకు ముక్కుమీదే కోపంగాని మంచి మనసు. నేనుమాత్రం ఏమన్నాను? (దిగాలు పడిపోయి) అరే! తమరా? మీరను కోలేదు సార్. మా ఆవిడనుకున్నాను....తమరు రోటరీ క్లబ్బులో ఉప న్యాసమిస్తుంటే ఎలా రాకుండవుంటాను సార్. సాయంత్రం ఆరింటి కేగా? తప్పకుండా నా స్నేహితులతోపాటు వస్తాను. నమస్కారం. (ఫోను పెట్టేసి) మా ఆవిడ అనుకున్నాను. ఇంతా చేస్తే పెద్ద జడ్జీగారు. ఏమను కున్నాడో!

పింహాచలం: పెద్దయ్యగారు ఏమీ అనుకోరు లెండి. ఈ బాధలు లేని మొగాడెవడంట.

రంగనాధం: షటప్! (కొంచెం పరధ్యానంగా) ఆరుగంటల ఆటకి సినిమాకి వెళ్ళాలని మా ఆవిడ ప్రొద్దున్నే తీర్మానించింది. అదే సైముకి తన ఉపన్యాసం వినడానికి రమ్మని జడ్జీగారి తాకీదు!

నరహరి: ఉద్దతుల మధ్య పేదకు ఉండతరమా అన్నారు. అసలు ఆడవాళ్ళతో వచ్చిన గొడవే ఇదండీ!

సావిత్రి: (ఉపన్యాస ధోరణిలో) అయినదానికీ కానిదానికీ మా మీద విరుచుకుపడటం మగవారికి అలవాటైపోయింది, శతాబ్దాలుగా స్త్రీని అధోగతిలో పడేసి పురుషుడికి చాకిరిచేసే బానిసగావో అడిగినప్పుడల్లా కోరిక తీర్చే ఆటబొమ్మగానో చేసివేశారు. స్త్రీకికూడా పురుషుడితోపాటు సరి సమానంగా జీవించటానికి సర్వహక్కులూ వున్నాయని ప్రపంచ మంతటా ఒక మహోద్యమం రేగింది. మన శాస్త్రాలుకూడా స్త్రీ అంటే

పరాశక్తి అని చెపుతున్నాయి. ఈ ఉద్యమాన్ని అవరోధించటానికి మీకే కాదు మిమ్మల్ని పుట్టించిన బ్రహ్మదేవుడికే తరంకాదు.

రంగనాధం: ఆర్డర్, ఆర్డర్, నరహరిగారూ, మీ క్లయింటు నిజంగా పరాశక్తిలాగే వుంది!

నరహరి: కోర్టువారు మమ్మల్ని క్షమించాలి. సావిత్రమ్మా, యిష్టం వచ్చినట్లు మాట్లాడడానికి యిది మీ ఇల్లు కాదని జ్ఞాపకం పెట్టుకోండి.

పురుషోత్తం: అలా బుద్ధి చెప్పండి. పురుషుల మీద ఉపన్యాసాలు దంచటానికి ఇది మహిళాసభ కాదనికూడా చెప్పండి.

నరహరి: ఉండవయ్యా, మధ్యలో నేనూవున్నా నంటావు. (సావిత్రితో) ఆమ్మా, మీరు కోర్టువారి అనుమతి లేకుండా మాట్లాడనని హామీ ఇస్తేనే ఈ కేసు నడిపిస్తాను. లేకపోతే మీరుమరో ప్లీడర్ని పెట్టుకోవచ్చు.

సావిత్రి: (చిరాకుగా) కేసు మధ్యలో పోతానంటే ఎట్లా? మీ ఇష్ట ప్రకారమే కానివ్వండి.

నరహరి: యువర్ ఆనర్, తమరు ప్రత్యక్షంగా గమనించారు గదా! వాది ప్రతివాదుల మధ్య కలయిక ఇక అసంభవం. ఒకవేళ కోర్టు వారు సదుద్దేశ్యంతో అలా ఏదైనా చెయ్యడానికి సంకల్పించినా దానివల్ల వచ్చే అల్లరులూ అఘాయిత్యాలూ ముందుగానే ఊహించుకోవటం మంచిది. అందుకనే ఇక ఆలస్యం లేకుండా డీక్రీ దయ చేయించమని అడుగుతున్నాను.

రంగనాధం: మీరు అడగడం బాగానే వుంది. కాని అంత తేలిగ్గా డిక్రీ యివ్వడానికి నా మనస్సు ఒప్పుకోవడంలేదు. ఆఖరిసారిగా అడుగుతున్నాను. సావిత్రమ్మా, మీరు పిటిషన్ ఉపసంహరించుకొని మీ భర్తగారితో అరమరికలు లేకుండా కాపరం చెయ్యటం మీ ఉభయులకీ శ్రేయస్కరం. మీకు టైము కావాలంటే ఈ కేసు మరో రోజు తీసుకుందాం. ఏమంటారు?

సావిత్రి: ఇప్పుడు ఎవరు చెప్పాలి? నేనా? నరహరిగారా?

నరహరి: కోర్టువారు ప్రత్యేకించి అడుగుతున్నారు కాబట్టి మీరు చెప్పండి.

సావిత్రి: తనదాకా వస్తేగాని ఎవరికి తెలీదు. మొన్నంటే మొన్న,

తప్పుత్రాగి అ పంతులమ్మ ఇంటినుంచి సరాసరి వచ్చి ఏమిటీ చేష్టలంటే గొంతు పిసకడానికి తయారయాడు మా ఆయన. నౌకరు వెంకటేసు అడ్డు వచ్చాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే నా ప్రాణాలు అక్కడే పోయేవి.

రంగనాధం: అరే! మరి పోలీసు రిపోర్టు ఇవ్వలేదా?

సావిత్రి: చివరికి పోలీసులచుట్టూ తిరగమంటారు! అంతేనా మీ సలహా? (కొంచెం ఏడుస్తూ) కోర్టులో ఎవరి నోళ్ళలోనూ పడకుండా న్యాయం జరుగుతుందని పిటీషన్ పెట్టుకున్నాను. ఇక్కడే ఆ న్యాయం లభించకపోతే ఇంకెక్కడికి వెళ్ళగలను? పోలీసు స్టేషన్‌కి వెళ్ళేబదులు ప్రాణత్యాగం చెయ్యటం మేలు.

రంగనాధం: (నరహరితో) ఇంట్లో నౌకరు వాది ప్రాణం రక్షించాడని చెప్తున్నారు. ఆ సాక్ష్యం!

నరహరి: (అడ్డువచ్చి) ఆ సాక్ష్యమే వుంటే తమముందు హాజరు పరచమటండీ! ఇంట్లో జరుగుతున్న ఘోరాలు చూడలేక—పాపం!—వెంకటేసు పరారైపోయాడు. చిన్నప్పటినుండి సావిత్రమ్మని పెంచాడు గదండీ! అందుకని ఆమె భాధలు చూడలేక మతిచెడి తిరుగుతున్నాడట.

రంగనాధం: రామ! రామ! అంతదాకా వచ్చిందన్నమాట. పురుషోత్తంగారూ, ఆర్డరు జారిచేసేముందు మీరుకూడా చెప్పుకోవలసిందేమైనా వుందా?

పురుషోత్తం: (కొంచెం విరక్తిగా) అంతా మా ఆవిడే చెప్పేసిందిగా. ఇక నేను చెప్పేదేముంది? చెప్పినా వినిపించుకునేదెవరు?

రంగనాధం: (చిరుకోపంతో) విడాకులు తీసుకోవడం కష్టంకాదు. ఆ తర్వాత పరిస్థితులు ముఖ్యంగా మీ అమ్మాయి విషయం అలోచించుకున్నారా?

పురుషోత్తం: ఆ మాట మా ఆవిడకే చెప్పండి. పిటీషన్ వేసింది ఆవిడ. ఈ విడాకులతో ఏం బావుకుంటుందో బావుకోమనండి. నాది మాత్రం ఒక్కటే చిన్న మనవి. మా అరుణని మాత్రం నా ఆధీనంలోనే వుంచమని ప్రార్థిస్తున్నాను.

సావిత్రి: (తబ్బిబ్బుగా) నా ప్రాణం పోయినా సరే అలా ఒప్పు

కోను. అసలు అరుణ లేకపోతే నేను బ్రతకలేను. (నరహరితో) ఏమయ్యా ప్లీడరూ, మాటా మంతీ లేకుండా నిలబడి పోయావేమిటయ్యా? అరుణని మనం ఆయన అధీనంలో వుంచాలని ఎప్పుడై నా అనుకున్నామా?

రంగనాధం: (ఆశ్చర్యంగా) అనుకోవడమేమిటీ?

నరహరి: (త్వరగా అడ్డువచ్చి) యువర్ ఆనర్, విడాకులకోసం పిటిషన్ వేస్తానని మాత్రమే నేను వకాల్తా తీసుకున్నాను. పిల్ల ఎవరి ఆధీనంలో వుండాలో తమరే నిర్ణయించండి.

(టెలిఫోను మ్రోగుతుంది. దానికేసి చూస్తూ, తియ్యటమా వద్దా అనే జిజ్ఞాసతో రంగనాధం కొన్ని క్షణాలు పరధ్యాన్నంగా వుండిపోతాడు.)

సింహాచలం: అయ్యగారూ, ఫోను తియ్యమంటారా?

రంగనాధం: (తటపటాయిస్తూ) నేనెందుకులే, నువ్వే తియ్యి.

సింహాచలం: (ఫోను తీసుకుని) అల్లో! అల్లో....అమ్మగారండీ... అయ్యగారు కేసు మధ్యలో గజిబిజిగా-అంటే బిజీగావున్నారండీ....అబద్దం చెపితే నా తల బద్దలై పోదమ్మా? ఏదైనా అర్జంటు విషయం వుంటే కనుక్కోమన్నారు. మరి సాయంత్రం అయ్యగారు పెద్ద జడ్జీగారి లెక్చరుకెళ్ళాలంట....మీరు కోప్పడకండి. ఇప్పుడే చెప్పేస్తా. (ఫోను పెట్టేస్తాడు)

రంగనాధం: ఏమిట్రా సింహాచలం? అలా నిలడిపోయావేం?

సింహాచలం: అమ్మగారు నిలుచున్నపాళంగా—

రంగనాధం: (ఆదుర్దాగా) ఆ! ఏమిటీ?

సింహాచలం: ఎలా చెప్పాలో తెలియటంలేదండీ!

రంగనాధం: (విసుగ్గా) తెలియకపోవడ మేమిటీ? నీకు నోరు లేదూ?

సింహాచలం: (తడబడుతూ) అమ్మగారివాళ ఆరు గంటలాటకి టిక్కెట్లు తెప్పిస్తామని తమతో ముందుగానే చెప్పారటగా! మీరు రాకపోతే పసేమిరా వీల్లేదంటున్నారండీ.

నరహరి: అయ్యా! తమ స్వంత విషయంలో కల్పించుకో కూడదు. కాని ఆప్తుడుని కాబట్టి ఒక్కమాట చెప్పుతాను.

రంగనాధం: ఈ పరిస్థితుల్లో నువ్వు ఉంటే ఏం చేస్తావయ్యా?

నరహరి: అనలు అంతదాకా రానివ్వకూడదండి. వస్తే మనం చాకచక్యంతో ఎవరినో ఒకరిని బోల్తా కొట్టించక తప్పదు.

సింహాచలం: ఇంత పెద్ద ప్లీడేరివి యదేనటయ్యా నువ్విచ్చే సలహా! అటుపోతే నువ్వు ఇటుపోతే గొయ్యి!

రంగనాధం: నోర్ముయ్. మధ్యలో నీ గొడవేమిటి? ఇంతకీ నరహరిగారూ, మీరేం చెయ్యమంటారు?

నరహరి: అంతమందిలో మీరు వచ్చింది లేనిది జడ్జీగారికేం తెలుస్తుంది? ఆయన ఉపన్యాసం వినడానికి నేనెలాగూ వెళ్ళాలను కుంటున్నా. చెప్పిన నాలుగు ముక్కలూ మీ చెవిలో ఊదేస్తాను. మీరాయన్ని చూసినప్పుడో ఫోనులో మాట్లాడినప్పుడో ఉపన్యాసం బ్రహ్మాండంగా వుందని ఒక్కమాట అనేస్తే సరిపోతుంది.

రంగనాధం: ఆహా! నెల్లాళ్ళక్రితం ఆయన ఉపన్యాసం వినటానికి పట్టుమని పదిమంది రాలేదు. అందుకని యివాళ సెలవుపెట్టి అందరికీ ఫోన్లు చేస్తున్నాడు. ఈ తడవకూడా వెళ్ళకపోతే బాగుండదు. అసలే పట్టుదల మనిషి.

సింహాచలం: సినిమాకి వెళ్ళకపోతే అమ్మగోరు ఊరుకోరండి.

రంగనాధం: (ఉసూరుమని సైము చూసుకుంటూ) నరహరిగారూ మీ కేసు కొండేటి చాంతాడులాగా సాగిపోతూనే వుంది. ఇంతకీ మనం ఎక్కడవున్నాం.

సింహాచలం: మంచి రసకందాయంలో.... (కళ్లురిమి చూస్తున్న రంగనాధాన్ని గమనించి ఆగిపోతాడు.)

నరహరి: యువర్ ఆనర్, ఒక్కక్షణంలో ముగించేస్తా. వాది వేసిన పిటిషన్‌లోని ఆంశాలన్నీ నిజమనీ ఆమెని ప్రతివాదితో కాపరం చెయ్యమనటంలో ఏ మాత్రం న్యాయం లేదనీ క్షుణ్ణంగా బుజువు చేసుకున్నాం. ఇక మిగిలింది వాళ్ళ చిట్టితల్లి అరుణ.

రంగనాధం: ఆ అమ్మాయి యిష్టంకూడా కనుక్కుంటే....

నరహరి: మంచిదేకాని ఒక్క ముఖ్య విషయం ఆలోచించండి. అరుణ ముక్కు పచ్చలారని పిల్ల. ఆ బిడ్డని కోర్టుకి రప్పించడం అంత భావ్యం కాదేమో. అమ్మాయి ఎవరి అధీనంలో వున్నా ఫరవాలేదని నేనూ హామీ యిస్తున్నాను.

రంగనాధం: (చిరాగ్గా) హామీ యివ్వడానికి మీరెవరు?

పురుషోత్తం: నేనిస్తాను సార్! అరుణకి మంచి గవర్నస్‌ని పెట్టి చదువుసంధ్యలు చెప్పిస్తాను. రమ్మీలు క్లబ్బులు సభలు పెట్టుకుని మా ఆవిడ పిల్లని సరిగా చూడటం లేదు.

రంగనాధం: సరే! యిక్కడ ప్రవేశపెట్టిన సాక్ష్యం బట్టి విడాకులే అవసరమన్న నిర్ణయానికి రావలసి వచ్చినందుకు నాకు చాలా బాధగా వుంది. పంతొమ్మిదివందల ఏభై ఐదు హిందూ వివాహ చట్టం పదమూడో సెక్షను ప్రకారం వాదియైన సావిత్రికీ ప్రతివాదియైన పురుషోత్తానికీ ఇందుమూలంగా విడాకుల డిక్రీ ఇవ్వడమైనది.

నరహరి: యువర్ ఆనర్, ఈ జడ్జిమెంటులోనే అరుణ సంగతి కూడా తేల్చివేస్తే బాగుంటుంది.

రంగనాదం: (విసుగ్గా) ప్రస్తుతానికి అరుణ పురుషోత్తంగారి ఆధీనంలోనే వుండాలి.

సావిత్రి: (ఆశ్చర్యంగా) అయ్యా! అదేమిటీ? (నరహరితో) బలే ప్లీడరువయ్యా! నన్ను కాస్తా నట్టేట్లో ముంచేశావే!

నరహరి: (తొందరగా) పదవమ్మా, పద. కోర్టువారి శాసనం మీద ఎక్కువగా మాట్లాడితే కష్టాలో పడతాం. (నెమ్మదిగా) తొందర పడకండి. అవసరమైతే అటునుంచి నరుక్కు వద్దాం.

(పురుషోత్తం, సావిత్రి వెళ్ళిపోతారు. వాళ్ళ వెంటే నరహరి.)

సింహాచలం: అంతా గమ్మత్తుగా ఉంది బాబూ! పండంటి కాపురాన్ని అటునుంచి నరుక్కొస్తానంటాడు ప్లీడరు.

రంగనాధం: ఎవరి ఖర్మ వాళ్ళది. సింహాచలం, ఈ కేసుతో నా తల దిమ్మెక్కి పోయిందిరా. తక్కిన కేసులన్నీ వాయిదా వేస్తే బాగుంటుందేమో.

సింహాచలం: నేనూ అదే చెప్తామనుకున్నాను సార్, కాని తమరు నోర్ముయ్ అంటారేమోనని ఊరుకుండి పోయాను. కాస్త ఇంటికి వెళ్ళి అమ్మగారిని సమాధానపరిస్తే....

రంగనాధం: అదిగో! అదే అధిక ప్రసంగం! నోర్ముసుకుని కాగితాలు కట్టెయ్!

(తెర)

మూడో అంకం

(రెండు నెలల తర్వాత. పురుషో త్తం ఇల్లు. హాలుని రెండు భాగాలుగా చేస్తూ ఒక గోడ. వేరై పోయిన దంపతులు ఒక రొకరికి సంబంధం లేకుండా వుండటానికి వీలుగా సింహద్వారం మూసేసి వుంటుంది. దానిబదులు మరి రెండు ద్వారబంధాలు వెలిశాయి. అయితే పూ ర్తిగా గోడ వుండటంవల్ల సభాసదులకి రంగస్థలం కనబడదు, కాబట్టి గోడని లాంఛన ప్రాయంగానే పెట్టుకోవాలి. గోడలో ఒక అలమారా. కుడిప్రక్కన పురుషో త్తం వాటా. ఎడం ప్రక్కన సావిత్రి భాగం. ఈ రెండు వాటాల మధ్య రాకపోకలు బయటికి వుండే తలుపుల ద్వారానే. కాని ఇక్కడిమాట లక్కడ అక్కడిమాట లిక్కడ చక్కగా వినబడుతుంటవి. రెండు వాటా ల్లోనూ బల్లలూ కుర్చీలూ, తదితర సరంజామా సరిసమానంగా వుంటాయి. తెర లేచేటప్పటికి పురుషో త్తం అలమారా దగ్గిర నిలబడి వుంటాడు....ప్రక్కవాటాలో సావిత్రియిల్లు సర్దుకుంటూవుంటుంది)

పురుషో త్తం: సావిత్రీ, సావిత్రీ!

సావిత్రి: మరీ అంత గట్టిగా పిలవడమెందుకు? మనం అనుకున్న ప్రకారం మూడు సార్లు ఈల వేస్తే నేనే వస్తానుగా....అరుణ బడికి వెళ్ళిందా?

పురుషో త్తం: వెళ్ళిందిలే. జడ కుదరలేదని ఒకటే గొడవ.

సావిత్రి: ఇక్కడికి పంపించలేక పోయారా? చిన్న పిల్ల - దాన్నే జడ వేసుకోమని మీరు వ త్తిడి చెయ్యటమెందుకో నా కర్థం కావడంలేదు.

పురుషో త్తం: గట్టి కారణం వుంది. కాబట్టే కొన్నాళ్ళు నీ దగ్గిరకి పదే పదే వెళ్ళవొద్దని చెప్పాను. నాకు మాత్రం అరుణకి జడ లల్లడం, బట్టలు వేయించడం తగిన పనా! కాని మనం తొందర పడితే చాలా ప్రమాదాలున్నాయి. తప్పుడు విడాకులు తీసుకున్న వాళ్ళమీద నిఘా వేసి వుంచమని కేంద్ర ప్రభుత్వం దగ్గిరనుంచి పెద్ద తాకీదు వచ్చిందని చూచాయగా తెలిసింది. పోలీసులు మనమీదకూడా ఒక కన్నువేసి వుంచారేమో - మన జాగ్రత్తలో మనం వుండాలి సుమా!

సావిత్రి: జాగ్రత్తగా వుండక వీధిని పడ్డామా; కాని మీరెప్పుడూ అలమారా దగ్గిరే తారట్లాడుతూ వుంటే ఎవరో ఒకరు అనుమానించక పోరు. అదికూడా తగ్గించి ఏ పేపరో పుస్తకమో చదువుకోకూడదూ!

పురుషోత్తం: ఈ పేపర్లూ పుస్తకాలూ పఠించుకుంటూ ఎంతసేపు గడపమంటావు? నిజంగా నాకు పిచ్చెక్కిపోతా వుంది. పైగా ఆ విశ్వంగాడొకడు - ఎప్పుడొస్తాడో? ఎప్పుడు పోతాడో? వాణ్ణి నువ్వు తొందరగా వదిలించుకోకపోతే మన బ్రతుకు జైల్లోకంటే అధ్వాన్నమైపోతుంది.

సావిత్రి: ఏం మాటలండీ? విశ్వాన్ని వదిలించుకోవడ మేమిటి? కష్టంలో వున్నప్పుడు మనమే ఆదుకోకపోతే వాడికింకేం ఆసరా వుంటుంది. ఏదైనా ఉద్యోగం దొరికితే వాడంతట వాడే వెళ్ళిపోతాడు. ఈ లోపున మామయ్య మనస్సు మారినా మారొచ్చు.

పురుషోత్తం: మనం కలిసి వున్నప్పుడు, 'రా నాయనా' అని పిలిచాం. బాగానే వుంది. విడాకులు ఇచ్చిన తర్వాతకూడా వాడు జలగలాగా నిన్ను పట్టుకుని కూర్చుంటే ఎలా? బయటవాళ్ళు ఏమనుకుంటారు? జ్ఞానం వుంటే వాడంతట వాడే వెళ్ళిపోయేవాడు. ఏమిటో, మీ విశ్వం సంగతి నాకేమీ అంతుపట్టడం లేదు. ఎప్పుడు కనబడ్డా అదోలా అనుమానంగా చూచి నవ్వుతాడు. కొంపతీసి మన సమాధానం బయటికి అందించడుగదా?

సావిత్రి: చాల్లెద్దురూ, బయటవాళ్ళనుకోవడమేమిటి? రోజురోజుకీ మీకు చాదస్తం ఎక్కువవుతా వుంది—యింతకీ అరుణ కోసం ఎవరినైనా టీచర్ని చూచారా?

పురుషోత్తం: క్రొత్తవాళ్ళని తెచ్చిపెట్టుకుంటే ఏమి గొడవలు వస్తయ్యో అని నా భయం. పనిమనిషి వేషంలోనో చాకలి వేషంలోనో చివరికి పిల్లలకి చదువుచెప్పే టీచరుగానో పి. ఐ. డీ. లు ఇండ్లలోకి దూరతారు. మనకి తగినంత నమ్మకం లేకుండా ఎవరినీ రానియ్యకూడదుసుమా!

సావిత్రి: మీ అనుమానాలకీ భయాలకీ అంతులేదు. పిల్లని చూడ్డానికి ఆడదిక్కు లేకపోతే ఎలాగండీ! అదే నాదగ్గర వుంటే కూర్చోబెట్టి పాఠాలు చెప్పేదాన్ని. ఇప్పుడది ఆగమ్మ కాకిలాగా తిరుగుతూ వుంది. మీతో ఏ పనీ కాదు. అందుకే విశ్వాన్ని ఎవరినైనా చూడమని చెప్పాను.

పురుషోత్తం: (చిరాగ్గా) విశ్వం, విశ్వం! వాడి గొడవే గాని ఇంకెవరినీ పట్టించుకునేటట్టు లేవు....(బయట తలుపు కొట్టిన చప్పుడు.) అదిగో ఎవరో వచ్చినట్లున్నారు. నీ పని చూసుకో. (వెళ్ళి తలుపు తీస్తాడు.) ఓహో! నరహరిగారా!

నరహరి: పురుషోత్తంగారూ, నమస్కారం. బాగున్నారా! అంతా సవ్యంగా జరుగుతున్నట్లే అనుకుంటాను.

పురుషోత్తం: జరుగుతావుంది లేవయ్యా! ఆస్తి సంగతేమో గాని మమ్మల్ని చాలా ఇరకాటంలో పెట్టేశావు. ఇంతకంటే సన్యాసం పుచ్చుకుంటే మేలు.

నరహరి: అయ్యా, ఇలాంటి విషయాల్లో స్వల్పమైన చికాకులు లేకుండా వుంటాయటండీ! డిక్రీ ఇచ్చింతర్వాత కొంతకాలం మీరు ఓపిక పట్టాలి. తొందరపడి పప్పులో కాలు వేశారంటే అసలుకే మోసం వస్తుందని నెత్తిన నోరుపెట్టుకుని చెప్పినా వినరే! క్లబ్బులో మీ విడాకులు నిజమో కాదో అని పందేలు వేస్తున్నారట. ఈ సంగతి మీ చెవిన వేసి పోదామని వచ్చాను.

పురుషోత్తం: (ఖంగారుగా) నిజమే!

నరహరి: నిజంగాక అబద్ధం చెప్పవలసిన గతి నాకేం వచ్చింది. ఇంకో విషయం దేశంలో ఎంతమంది విడాకులు పుచ్చుకున్నారు, ఎందుకు పుచ్చుకున్నారు, అందులో ఎంతమాత్రం నిజం వుందీ అని సి. బి. ఐ. వాళ్లు ఆచూకీ తీస్తున్నారటండీ!

సావిత్రి: (ప్రక్కనుంచి అందుకుని) ఈ రొంపిలో దింపి తగుదునమ్మా అని మళ్ళీ వచ్చాడు. ఈ విడాకులు వద్దో అని మొత్తుకున్నాను. నా మాట విన్నారా?

నరహరి: (తొట్రుపాటుతో) విన్నారా! విన్నారా! అక్కడ మాట లిక్కడికి చక్కగా వినబడుతున్నాయి. ఇది ఏ సి. ఐ. డి. అన్నా కనిపెట్టాడంటే కొంపలంటుకు పోతాయండోయ్!

పురుషోత్తం: (విసురుగా) చాల్లేవయ్యా, చెప్పొచ్చావు! విడాకులు పుచ్చుకున్నా కలిసి వుండొచ్చని చెప్పి తర్వాత కాదూ కూడదని మా ఇద్దరి మధ్య దుర్భేద్యమైన ఈగోడ పెట్టించేశావు. పింహద్వారంకాస్తా మూయిం

చేశావు. ఈ ఏర్పాటు ఏడిపినట్లుంది. మేమిద్దరం కాసేపు మాట్లాడుకోవాలంటే వీధిలోనుంచో పెరట్లోనుంచో వెళ్ళాలి. బయట జనం తిరుగుతూవుంటారు. వెనకనుంచి వెళ్ళాలంటే ఆ పనిమనిషిముంద అంట్లు తోముతూనో గుడ్డ లుతుకుతూనో ప్రత్యక్షం. అదొక బ్రహ్మ రాక్షసంటే నమ్మండి.

నరహరి: నవ వధూవరులు తొందరపడినట్లు మీరుకూడా తహతహలాడితే ఎలా సార్?

సావిత్రి: (ప్రక్కనుంచి) ఏమండోయ్?

పురుషోత్తం: ఏమిటి?

సావిత్రి: ఆ ప్లీడరుగారిని కొంచెం తగ్గమనండి. ఊరికే మన ఇంటికి రావడం తగ్గించమని చెప్పండి. మన ఇష్టం మనది. మధ్యలో సైంధవుడిలాగా ఈయ నెవరండీ?

నరహరి: కోప మెందుకు సావిత్రమ్మా, మీ మంచి కోసమే చెప్పాను.

సావిత్రి: (గొంతు హెచ్చించి) చాలుచాల్లే! జుట్టు నెరిసిపోయినా పనిమనిషి కొంగు పట్టుకుని తిరుగుతూ మాకు చెప్పొచ్చారా?

నరహరి: నేనా? ఎంతమాట! పనిమనిషి కొంగు పట్టుకుని తిరుగుతున్నానా? (కోపంగా) నీకీ సంగతి ఏ ముదనష్టపు వెధవ చెప్పాడు?

సావిత్రి: (కేకలేస్తూ) వెధవో, ముత్తైదో....లోకం కళ్ళు ఎంత కాలం ముస్తావయ్యా?....

నరహరి: సావిత్రమ్మా, కొంచెం నిదానించు. బయట తలుపు తీసివుంది. ఎవరైనా వస్తే అల్లరైపోతుంది. నేను అటువచ్చి మీకు నెమ్మదిగా నచ్చ చెపుతాగా!

సావిత్రి: నరహరిగారూ, మీరు నా వాటాలోకి రానూ వద్దు, నచ్చ చెప్పనూ వద్దు. మీరు చెప్పిన దాని కంతా గంగిరెద్దులా తలూపడానికి నేను మా ఆయన్ని కాదు. (పురుషోత్తంతో) పానకంలో పుడకలాగా ఇప్పు డీ ప్లీడ రెందుకండీ? ఇక వెళ్ళమనండి?

నరహరి: సావిత్రమ్మ కొంచెం చిరాగ్గా వున్నట్లుంది. నాకు తెలిసిన విషయం మీకు చెప్పి పోదామని వచ్చాను. మీ కిష్టమయితే జాగ్రత్తగా

వుండండి. లేకపోతే లేదు. మధ్యలో నా కెందుకూ బెడద....అదుగో ఎవరో వచ్చినట్లుంది. వస్తా. (గొణుక్కుంటూ) పనిమనిషట! పనిమనిషి!

(నరహరి బయటకి వెళ్తూవుంటే మాలతి ప్రవేశిస్తుంది. దాదాపు ఇరవై రెండేళ్ళుంటయ్! చక్కని చుక్క. చందమామ లాంటి ముఖం. నడవడిలో చదువూ సంస్కారం వుట్టిపడుతున్నాయి. నరహరి పోతూపోతూ ఆ అమ్మాయిని చూచి ఏదో అర్థమయినట్లు తల ఆడించుకుంటూ వెళ్ళిపోతాడు.)

మాలతి: నమస్కారం. ఇది పురుషోత్తంగారి యిల్లు కదండీ.

పురుషోత్తం: అవునమ్మా, నేనే పురుషోత్తం....ఏమన్నా పనిమీద వచ్చారా? రాండి. ఇదిగో, కూర్చోండి. కాఫీ తీసుకుంటారా?

మాలతి: (చుట్టూ కలయ చూస్తూ) పూర్వం యిది ఒకే యిల్లు కదండీ? ఇపుడు రెండు భాగాలు చేసి అద్దె కిచ్చారా?

పురుషోత్తం: ఏదో లెండి—

మాలతి: అన్నదమ్ములుకాని వేరుపోయి వాటాలుగానీ పంచుకున్నారు కాబోలు....(పరకాయించి) ఈ గోడ కొత్తగా కట్టినట్లుందే!

పురుషోత్తం: చిక్కులందరికీ వస్తాయి....మా ఆవిడ లేకపోవడం వల్ల....

మాలతి: అయ్యో పాపం!....మీ ఆవిడ అకస్మాత్తుగా పోయారా! ఎంత కష్టం....ఇంత దుఃఖాన్ని దిగమింగి మీరు పాపం—

పురుషోత్తం: అలాంటిదేమీ లేదమ్మా....మాకు అభిప్రాయభేదాలు వచ్చి విడిపోవలసి వచ్చింది. (తనేమి మాట్లాడుతున్నాడో జ్ఞప్తికి తెచ్చుకుని గంభీరంగా) అవన్నీ మీకెందుకు? వచ్చిన పని చెప్పితే బాగుంటుంది.

మాలతి: క్షమించండి. మీ యింట్లో అమ్మాయి—

పురుషోత్తం: అమ్మాయి నా దగ్గరే వుండాలని కోర్టువారు తీర్పు చెప్పారు. ఈ సంగతులు మీకనవసరం—

మాలతి: అదికాదండీ....మీరు నన్ను అన్యథా శంకిస్తున్నారు. మీ అమ్మాయికి ఒక గవర్నస్ కావాలటగా! ఆ ఉద్యోగం నాకిప్పిస్తారేమోనని వచ్చాను.

పురుషోత్తం: అలాగటమ్మా! మరి ముందే చెప్పేస్తే బాగుండేదిగా,

(కొంచెం అనుమానం స్ఫురించగా) మాకు టీచరు చాలా అవసరమని మీ కెలా తెలిపిందిఁ నేనే పేపరులోనూ వేయించలేదేఁ

మాలతి: (నసుగుతూ) నిరుద్యోగంతో బాధపడే నాలాంటి దురదృష్ట వంతులు పేపర్లు క్షుణ్ణంగా చదవటమే కాకుండా, ఎక్కడ నౌకరీ దొరుకు తుందోనని అహర్నిశలూ వాకబు చేసుకుంటూ వుండాలి. ఒక స్నేహితుడు చెపితే, గంపెడాశతో వచ్చాను. తీరా వచ్చాక, ఖాళీకాస్తా రెండు నిమిషాల క్రిందటే భర్తీ అయిపోయిందని తమరు సెలవివ్వలేదు. అదే పదివేలు.

పురుషోత్తం: (తీక్ష్ణంగా) ఎవరా స్నేహితుడుఁ మిమ్మల్నెవరైనా పంపించారాఁ మీరు నిజంగా దేనికొచ్చారుఁ

మాలతి; (చిరు కోపంతో) ఏమిటేమిటో ప్రశ్నలు వేస్తున్నారు. పోలీసులు కూడా నేరస్తుల్ని ఇంత తికమక పెట్టరు....మీకంత అనుమానంగా వుంటే ఎందుకు లెండి. (లేవబోతుంది.)

పురుషోత్తం: ఉండండి.... ఈమధ్య పి. ఐ. డి. లిలాగే అడ్డమైన వాళ్ళనీ గూఢచారులుగా పంపిస్తున్నారటఁ

మాలతి: (ఆశ్చర్యంగా) పి. ఐ. డిలాఁ

పురుషోత్తం ; వాళ్ళే ... ఇక వేరే పనిపాటలు లేనట్లు మనలాంటి వాళ్ళ మీదకు వస్తున్నారు. దేశంలో ఎన్నెన్ని ఘాతుకాలు జరిగిపోతున్నా పట్టించుకోరు.... ఇంతకీ మీ క్వాలిఫికేషన్సు చెప్పారుకాదు.

మాలతి: బి. ఎ. పాసయ్యాను. టీచింగులో కొంత అనుభవం కూడా వుంది. రెండు నెలలు క్రితందాకా కస్తూరిబాయి విద్యాలయంలో పని చేశాను. ఖాళీలు లేకపోవడంవల్ల తీసేశారు. (దీనంగా) మీరు ఉద్యోగం ఇప్పిస్తే నాకు చాలా సహాయం చేసినవారవుతారు.

పురుషోత్తం: మీకు పెళ్ళి అయిందాఁ

మాలతి: లేదండీ, మా నాన్న అకస్మాత్తుగా పోయింతర్వాత దిక్కులేని పక్షుల మయిపోయాం. ఇద్దరు తమ్ముళ్లు ఒక చెల్లెలూ స్కూలో చదువుకుంటున్నారు. సంసార బాధ్యతంతా నామీదే పడింది. ఇదిగో నా సర్టిఫికెట్లు చూస్తారా? (అందిస్తుంది).

పురుషోత్తం: (ఒక నిమిషం చూసి) చాలా బాగున్నాయి. ఒక్క

మాట. మా అరుణ అప్పుడప్పుడూ కొంచెం మారాం చేస్తుంటుంది. పైగా ఏ ఆడదిక్కూ లేదు.

మాలతి: మరి అమ్మగారు!

పురుషోత్తం: (చిరాకుగా) ఆ ప్రక్కనే వుంటుంది. మీ రేమీ పట్టించుకోనక్కరలేదు. అమ్మాయి అక్కడికి వెళ్ళకుండా చూడవలసిన బాధ్యత మీది. పగలంతా మీ రిక్కడే వుండాలి. నే నెప్పుడైనా ఊరు వెళితే రాత్రిళ్లుకూడా వుండవలసి వస్తుంది. మీ కేమీ అభ్యంతరం లేదుకదా?-

మాలతి: అలాగేనండీ. మీ అమ్మాయిని నా కంటికి రెప్పలాగా చూసుకుంటాను.

పురుషోత్తం: జీతభత్యాలు చెప్పారుకాదు.

మాలతి: మీకెలా తోస్తే అలా యివ్వండి. మీ నీడన వుంటే అదే చాలు.

పురుషోత్తం: మీకెన్నటికీ తక్కువ చెయ్యనులెండి. మీకోసం అరుణ గది ప్రక్కన ఇంకొకటి ఖాళి చేయించిపెడతాను. మీరక్కడే వుండొచ్చు. ఇవాళనుంచే పనిలో చేరండి.

మాలతి: చాలా ధ్యాంక్సు. మళ్ళీ మధ్యాహ్నం నుంచీ వస్తాను. (మాలతి బయటికి వెళ్ళిపోతుంది. ప్రక్క భాగంలో సంభాషణ అంతా వింటున్న సావిత్రి గబగబా వీధి తలుపు దగ్గిరకి వెళ్ళి కొంచెం పరకాయించి చూసి తిరిగి వచ్చేస్తుంది. ముఖంతో ఈర్ష్యకోపం ద్యోతకమౌతున్నాయి.

సావిత్రి: (గోడమీద మూడుసార్లు కొడుతూ) ఏమండోయి, ఏమండోయి! మిమ్మల్నే!

పురుషోత్తం: (వీధి తలుపు గబగబా వేసి అలమారా దగ్గిరకి వస్తాడు.) ఇప్పుడే ఆవిడలా వెళ్ళింది. సమయా సమయాలు చూచుకుని పిలవాలి. నీ తొందర నీదేగాని అవతలవాళ్ళు వింటారని కించత్తైనా ఆలోచించవుగదా! ఈ వేర్పాటుకాపరం చెయ్యడంలో నా తలప్రాణం తోకకి వస్తోంది.

సావిత్రి: (రుసరుసలాడుతూ) అరుణకి టీచర్ని కుదిర్చినట్లైనా? ఆవిడెవరో, పుట్టు పూర్వోత్తరా లేమిటో, భోగట్టా చేశారా? లేకపోతే ఎర్రగా బుర్రగా వుందని గబుక్కున కుదిర్చేశారా?

పురుషోత్తం: ఆమె పేరు మాలతి. మంచి కుటుంబంలో పిల్లలాగే వుంది. సర్టిఫికెట్లు చూస్తే మన అరుణకి సరైన టీచరుగా వుంటుందనిపించింది.

సావిత్రి: దొంగ సర్టిఫీకెట్లు చులాగ్గా సృష్టించేస్తున్నారు. ఇంట్లో సర్వకాలాలు వుండే మనిషిని పెట్టుకునేటప్పుడు అన్ని సంగతులు తెలుసుకోవాలికాని పైపైలాపచ్చీసుగా వున్న పాతికేళ్ళ అమ్మాయిని గబుక్కున పెట్టేసుకుంటారా! ఇదేమైనా సబబుగా వుందా? పైగా మీ ప్రక్కగదే ఖాళీ చేస్తానని చెప్తున్నారా? మీకు మతి పోతున్నట్లుంది.

పురుషోత్తం: (నిర్ఘాంతపోయి) ఆ! ఏమిటన్నావు? ఆ అమ్మాయి ఎవరో నాకు తెలియదు. రెండు నెలలుగా టీచర్ని కుదర్చమని ఒకే గోల. కుదర్చగానే మరో అల్లరీ. నీతో ఈ కాపరం చెయ్యటం నా తరం కాదు.

సావిత్రి: (ఈసడింపుగా) కాపరం చెయ్యటం చేత కాదని మాటి మాటికీ అంటున్నారు. మీ ఉద్దేశ మేమిటి? పనస తొనలాంటి పిల్ల కనబడ కానే పెళ్ళాం చేదై పోయిందా?

పురుషోత్తం: (రెచ్చిల్లిపోతూ) అబ్బబ్బ! నువ్వూ నీ అనుమానాలూ? ఒక్క క్షణమైనా నన్ను ప్రశాంతంగా బ్రతకనిచ్చేటట్లు లేవు. ఉన్నంతసేపూ వూరికే కారాలూ మిరియాలూ నూరుతున్నావు. నేను క్లబ్బుకి పోతున్నాను. ఇక్కడ ఉండిమాత్రం చేసేదేముంది? (పురుషోత్తం తలుపు వేసుకుని వెళ్ళిపోతాడు. సావిత్రి కాసేపు అచేతనంగా నిలబడిపోతుంది. ఇంతలో విశ్వం ప్రవేశం. మెడలో కెమేరా, చేతిలో చిన్న టేప్ రికార్డరూ. ఇంకో చేతిలో పైల్సు. అవన్నీ తీసి బల్ల మీద పెడుతూవుంటాడు.)

సావిత్రి: (ఆశ్చర్యంగా చూస్తూ) రెండు రోజులు హైదరాబాదులో పనుందని వెళ్ళావు. పదిహేను రోజు లయింది. నువ్వెక్కడున్నావో ఏమయ్యావో అని ఆదుర్దా పడుతున్నాం. ఒక్క ఉత్తరంముక్క రాసి పడెయ్యకూడదూ. ఈ సరంజామా ఏమిటి?

విశ్వం: వదినా, నీకో శుభవార్త చెప్పాలి. నీ ఇంట్లో కాలు పెట్టిన వేళావిశేషం - నాకు అదృష్టం కలిసివచ్చి మంచి ఉద్యోగం దొరికింది, అంతా నీ చలవే!

సావిత్రి: చాలా సంతోషం. జీతమెంత?

విశ్వం: నేనూ నా స్నేహితుడూ కలిసి ఒక ఎలక్ట్రానిక్స్ కంపెనీ పెడుతున్నాం. రెండు మూడు పెద్ద క్రాంట్రాక్టులు వచ్చాయి. చెత్త జీతాలతోటి పనేముందిగ మా నాయన నే నెందుకూ కొరగాని చవట ననుకొని ఇంట్లోంచి పొమ్మనగానే బెదిరిపోయి కాళ్ళ బేరానికి వస్తా ననుకున్నాడు. ఏమైనాసరే ఈ విశ్వం అంత తేలిగ్గా లొంగిపోయేఘటం కాదని నిరూపిస్తాను.

సావిత్రి: (నిస్పృహగా) నీ పట్టుదలా, నీ మొండితనమేగాని తండ్రి మాటకి కొంతైనా విలువ యివ్వద్దూ. ఊరికే కావేషాలు పెంచుకుని మనస్సులు పాడుచేసుకోవడం ఏమీ బాగాలేదు. నామాట విని—

విశ్వం: ఆయన కాళ్ళమీద పడమంటావు, అంతే! అస్తమానం నా మనస్సు మార్చటానికి ప్రయత్నిస్తావేకాని నా జీవితంతోపాటు ముడి పెట్టుకొని ఇంకో వ్యక్తి వుందని మర్చిపోతున్నావు. పోనీలే, ఇంతక్ అన్నయ్యగారెలా ఉన్నారు!

సావిత్రి: (కొంచెం విరక్తిగా) వున్నారు! ఆయనకేం! మహారాజు. ఏం చేసినా చెల్లుతుంది!

విశ్వం: (తల పంకించి) ఏదో బాధపడుతున్నట్లున్నావు! నే నెంత చెప్పినా వినకుండా ఆ నరహరిగాడి సలహామీద యీ విడాకుల ఊబిలో దిగారు.

సావిత్రి: (విచారంగా) అన్నీ ఆలోచించుకునే చేశాం. ఇప్పుడు మధనపడి ఏం ప్రయోజనం! నేనే మోసపోయాను. మీ అన్నయ్య తడిగుడ్డతో గొంతులు కోస్తారని ఏమాత్రం అనుమానమున్నా ఈ విడాకులకు ఒప్పుకునేదాన్నా!

విశ్వం: (ఆశ్చర్యంగా) ఏం జరిగింది.

సావిత్రి: (ధీనంగా) ఇంకేం జరగాలి! అరుణకోసం ఎవరినైనా టీచర్ని కుదర్చమని ఎన్నిసార్లు చెప్పినా నీవు పట్టించుకున్నావా! ఇప్పుడు నాపాలిట శనిలాగా ఒకతి వచ్చి ఆయన్ని బుట్టలో వేసేసుకుంది.

విశ్వం: ఎవరేమిటి!

సావిత్రి: నాకుమాత్రం ఏం తెలుసు! మనిషి కుదుర్చుకునేటప్పుడు నాతో సంప్రదించనక్కర లేదూ! చూడటానికి ఒక సినిమా స్టారులా వుంది. నవనవలాడే వయస్సు. అలాంటి పిల్లని తెచ్చి యింట్లో పెట్టుకో

వడం సభ్యతగలవాళ్ళు చేసే పనేనా (విచారంగా) చూడు విశ్వం. మేమెంత అన్యోన్యంగా వుండేవాళ్ళమో నీకు తెలుసు. చంటిదానికోసం మనసు రాయి చేసుకుని విడాకుల కొప్పుకున్నానుగాని పరిస్థితులిలా తారుమారవు తాయని ఎప్పుడూ వూహించలేదు. అంతా నా దురదృష్టం.

విశ్వం: విడాకులంటే దాగుడుమూత లనుకున్నావు కాబోలు. ఐనా అన్నయ్య స్వభావం నీకు పూర్తిగా తెలిసికూడా ఇలాంటి సందేహాలు అనుమానాలు పెట్టుకోటం బాగాలేదు. ఆయన నిప్పులాంటి మనిషి.

సావిత్రి: (వెటకారంగా) చెప్పావులే! మగవాళ్ళ బుద్ధులు ఎవరికి తెలియవు? ఏ వయస్సు మళ్ళినావిడనో పెద్దదిక్కుగా తెచ్చి పెట్టుకోవాలిగాని చిలకలాంటి పిల్లని ఇంట్లో వుండేటట్లు కుదుర్చుకోవడం చాలా అసహ్యంగా వుంది. నేనీ మాటే అంటే తారామండలానికి ఎగిరిపడ్డాడు.

విశ్వం: నువ్వూ నీ పిచ్చి అనుమానాలూ! ఆ పిల్ల ఎవరో నేను కనుక్కుంటానులే. నువ్వు చెప్పేదానికేమైనా ఆస్కారం వుంటే ఆవిడని నిమిషాలమీద వదిలించే భారం నాది. సరేనా?

సావిత్రి: కబుర్లకేం? ఇంటిపట్టున ఒక్కరోజైనా వుండవు. మాటలు మాత్రం కోటలు దాటతాయి.

విశ్వం: అలా కాదు వదినా, నే నెప్పుడూ ఇక్కడే వుండి అన్నయ్యగారిని ఒక కంట కనిపెడుతూనే వుంటాను. ఇదిగో (కెమెరా, టేపు రికార్డరూ చూపిస్తూ) పురుషోత్తం అన్నయ్యమీద వాటర్ గేట్‌ని మించిన నిఘా వేస్తాను. నువ్వూరికే బెదిరిపోవద్దు. ఇలాంటి పరికరాలు మనదగ్గర వుంటే మీరు పెట్టుకున్న ఈ చొప్పదంటు గోడ ఒక లెక్కా.

సావిత్రి: (తృప్తిగా) సరే, నీమీదే అంతా భారం వేస్తున్నాను.... నేను కాసేపు బయటికి వెళ్ళాలి. తిరిగి వచ్చేదాకా ఇల్లు కనిపెట్టుకుని వుంటావు గదూ?

విశ్వం: అలాగే, వదినా, (సావిత్రి బయటికి వెళ్ళిపోతుంది. విశ్వం ఈల వేసుకుంటూ టేపు రికార్డరు జయటివాళ్ళకి కనబడకుండా పుస్తకాల మధ్య పెట్టి, మైకుని రెండు వాటాల్లోంచి వినబడేటట్లుగా అమర్చి పుస్తకం తీసుకుని చదువుకోటం ప్రారంభిస్తాడు. ఇంతలో మాలతి ఒగర్చుకుంటూ వస్తుంది.)

మాలతి: హల్లో, విశ్వం! అయిపు లేకుండా పరారై పోయావేమిటి? నీ దగ్గరనుంచి ఏమైనా కబురు వస్తుందేమోనని ఎదురు చూసి చూసి నా కళ్ళు కాయలు కాపిపోయాయి. నువ్వు చెప్పినట్లు ఇవాళే ఇక్కడే పనిలో చేరాను కాని సాధక బాధలు ఆలోచించావా? ఇక్కడ పరిస్థితి ఏమీ బాగున్నట్లు కనబడటంలేదు.

విశ్వం: అబ్బబ్బ! వచ్చీరావటం గుక్క తిరక్కుండా ఒక ఉపన్యాసం దంచేశావు. ఇవాళ పనిలో చేరావో లేదో అంత తొందరపడితే ఎలా? విడాకుల నాటకం ఆడే ఈ రంగస్థలంలో శాంతి భద్రతలు ఎలా వుంటాయి? అందుకేగా నిన్నిక్కడ వుండమన్నాను.

మాలతి: పోనీలే. ఏదోవిధంగా మనిద్దరం ఒకచోట వుండటమే నాకు కావాల్సింది! ఇంతకి మీ నాన్నగారు మెత్తబడే సూచనలేమైనా వున్నాయా?

విశ్వం: శాంతం కాంతా భూషణం అన్నారు. కొంచెం ఓసికపట్టు. మా నాన్న చాలా కరుకుగా కనిపించినా నేనంటే పంచప్రాణాలు. నెమ్మదిగా ఆయనే దారిలోకి వస్తాడు. ఒకవేళ దురదృష్ట వశాత్తూ అలా రాకపోయినా మన వివాహం మాత్రం తప్పదు. ఏం? అలా చూస్తావేం? నా మాటమీద నీకు నమ్మకంలేదా?

మాలతి: నీమీద నాకు విశ్వాసం లేకపోతే నా జీవితాన్ని నీకు ఎందుకు అంకితం చేస్తాను. (గద్గదికంగా) •మీ తల్లిదండ్రులకి ఒక్కగానొక్కడివి. వాళ్ళకి నిన్ను దూరంచేశానే అని బాధపడి పోతున్నాను. నాలాంటి దురదృష్టవంతురాల్ని ప్రేమించి నీ భవిష్యత్తునే పాడుచేసుకుంటున్నావంటే నా గుండెలు బ్రద్దలయిపోతున్నాయి.

విశ్వం: అయినా నువ్వులేని భవిష్యత్తు నాకేముంది!

(ప్రక్కవాటాలో పురుషోత్తం నెమ్మదిగా తలుపు తీసుకుని వస్తాడు. విశ్వం మాటలు స్పష్టంగా వినబడతయి. అతను సావిత్రితోటే మాట్లాడుతున్నాడయికొని గబగబ అలమారు దగ్గరికి వచ్చి వింటూంటాడు.)

విశ్వం: నిన్ను చూడకుండావున్న ఈ పదిహేను రోజులు నా కొక యుగంలా అనిపించింది. ప్రతిక్షణం నువ్వే నా కళ్ళముందు మెదులుతుండే

దానివి. నన్ను నమ్ము. నీకోసం అన్నీ వదులుకున్నాను. ఇదిగో (దగ్గిరికి వచ్చి బుగ్గ గిల్లుతాడు)

మాలతి: (నెమ్మదిగా) హుష్— (ఏదో అనబోయి సిగ్గుతో వూరుకుంటుంది)

విశ్వం: ఇక నిన్ను విడిచి నేను ఎక్కడికి వెళ్ళను. పరిస్థితులు మనకి అన్ని విధాలా కుదిరాయి. నరహరి మాటలు విని ఆస్తికోసం దిగజారిపోయాడు మా అన్నయ్య. నీకోసం ఆస్తంతా వదులుకున్నాను నేను. ఇలా దగ్గరికివద్దూ....ఒక చిన్న....

(ప్రక్కవాటాలో పురుషోత్తం ఆఘమేఘాలమీద వున్నాడు. ఇంకా విందామన్న ఆదుర్దాలో అలమారుమీద వున్న ఫోటో క్రింద పడేస్తాడు.)

మాలతి: (గతుక్కుమని నెమ్మదిగా) ఆయన వచ్చినట్లున్నారు. (బయటికి వెళ్ళిపోతుంది.)

(ప్రక్కవాటాలో పురుషోత్తం భరించరాని ఆవేదనతో, రోషంతో కూలబడిపోతాడు. అరుణ వస్తుంది.)

అరుణ: ఆకలేస్తుంది నాన్నా ...

పురుషోత్తం: (వళ్ళుతెలియని కోపంతో, ఏం మాట్లాడుతున్నాడో తెలియకుండా) పో, ఇక్కడనుంచి పో....

అరుణ: (భయపడిపోయి) అదేమిటి నాన్నగారూ....నిజంగానే ఆకలేస్తోంది....పోనీ అమ్మ దగ్గ....ర....కి

పురుషోత్తం: ఛీ! మీ అమ్మమాట ఎత్తుతావా! మళ్ళీ అనవుగదా! అనవుకదా! (కొడతాడు.)

అరుణ: బిగ్గరగా ఏడుస్తూ) అమ్మా....

(బయటనుంచి మాలతి ఆదుర్దాగా వచ్చి పిల్లని తీస్తుంది)

పురుషోత్తం: (తేరుకుని) ఛీ....ఎంతపని చేశాను!....ఒక్క నాడైనా నా చిట్టితల్లిని కసురుకోలేదు....ఇవాళ—ఇవాళ (కొంచెం ఆగి) నా మనస్సు బాగోలేదు....బయటికి పోతున్నా....కొంచెం మీరే అమ్మాయిని సముదాయించండి....

మాలతి: అలాగేనండీ....రా, అరుణా....(లోపలికి తీసుకువెళ్తుంది)

(కొంచెం వ్యవధి. ప్రక్కవాటాలో విశ్వం పచార్లుచేస్తూ వుంటాడు. బైటనుంచి "విశ్వం బాబూ విశ్వంబాబూ" అన్న కేక పనిపిస్తుంది.)

విశ్వం: ఎవరూ?

వెంకటేసు: (లోపలికి వస్తూ) నేనే బాబూ.

విశ్వం: ఓహో! వెంకటేసూ! నువ్వా! ఇక్కడ నౌకరీ మానేసి వూరెళ్ళిపోయావన్నారుగా!

వెంకటేసు: నౌకరీ మానేశానుగాని వూరు వెళ్ళడానికి మనసొప్పలేదు బాబూ. ఈ ప్రక్కనే మా మేనల్లుడింట్లో తలదాసుకుండా.

విశ్వం: వెంకటేసూ, ఈ ముసలికాలంలో నీకెందుకి అగచాట్లు? నీ కొడుకు దగ్గరకిపోయి కృష్ణా రామా అనుకుంటూ కాలం గడిపితే బాగుంటుంది కదా?

వెంకటేసు: అలాగే అనుకున్నాబాబూ, కాని చూస్తూ చూస్తూ ఏళ్ళపాటు కనిపెట్టుకున్న కుటుంబాన్ని ఎలా విడిచిపెట్టి వెళ్ళేది? పండంటి కాపురం ఆ సావిత్రమ్మ పాడుచేసుకుంది. అరుణమ్మని సూస్తావుంటే నా గుండె పగిలిపోతావుంది. తల్లినీ బిడ్డనీ ఈ చేతుల్తో పెంచాను.

విశ్వం: వాళ్ళకి నచ్చచెప్పడానికి ఎంతో ప్రయత్నించాను. కాని నా మాట విన్నారా? ఆ నరహరిగాడి మాటలే వేద వాక్యాలనుకుని తగనిపని చేశారు. వాణ్ణి ఏం చేసినా పాపంలేదు.

వెంకటేసు: మన బంగారం మంచిదైతే ఇంకోళ్ళని అని ఏం ప్రయోజనం బాబూ! నువ్వు సదువుకున్నోడివి. అన్నీ తెలిసినోడివి. ఏదైనా ఉపాయం కనిపెట్టు బాబూ!—ముసిలోణ్ణి వుండలేక సెపుతున్నా.

విశ్వం: తెలిసీ తెలిసీ గోతిలో దిగుతామంటే నువ్వూ నేనూ ఏమి చెయ్యగలం? ఆ స్తి రంధిలోపడి ప్రేమ, అభిమానం మాపవతా—అవ్నీ మరిచిపోయారు.

వెంకటేసు: నువ్వుకూడా అలా అంటే ఎలాగు బాబూ? సావిత్రమ్మ బయటికి వెళ్ళటం చూసి ఈ మాట నీ చెవిన పడేసి పోదామని వచ్చాను.... నౌకరు ముండావాణ్ణి—నాలాటోడు చెబితే ఎవరింటారు? నువ్వే ఏదో—ఒకదారి సూడాలి. లేకపోతే పచ్చటి సంసారం చితికిపోతుంది.

విశ్వం: అదే నేనూ ఆలోచిస్తున్నాను. (కొంచెం కోపంగా) వీళ్ళు

చేష్టలు చూస్తుంటే నాకు వళ్ళు మండిపోతోంది. సమాజం ఒక వెల్లువలా ముందుకు సాగిపోతుంటే ఎదురీదుదామని ఈ ప్రయత్నం చేస్తున్నారు. మా నాయనకూడా ఆ కోవకు చెందినవాడే.

వెంకటేసు: నా మతితగలడ! అసలు వచ్చిన పనే మరిచిపోయాను. (జేబులోంచి ఉత్తరం తీసి) మీ అమ్మగోరు జాబు పంపించారు. మీకు అర్జంటుగా యివ్వమన్నారు.

విశ్వం: అలాగా! (ఆదుర్దాగా తీసుకుని చదువుతుంటాడు. పక్క వాటాలో మాలతి ప్రవేశం.) అరే.... వెంకటేసూ! ఎంత మంచి వార్త తెచ్చేవు....(నెమ్మదిగా) అక్కడ ఆవిడ వచ్చినట్లుంది. నువ్వు తప్పుకో.

వెంకటేసు: ఆవిడెవరు బాబూ!

విశ్వం: నీకు తెలిన అమ్మాయే. తరువాత చెప్తాను. ముందు నువ్వు ఎవరికంటా బడకుండా వెళ్ళు....ఇంకోమాట అరుణని ఒకకంట కనిపెడుతూ వుంటావుకదూ?

వెంకటేసు: నే నెక్కడికీ పోను బాబూ. రాత్రైతే ఈ అరుగు మీదే పడుకుంటున్నానండీ....(వెళ్ళిపోతాడు)

విశ్వం: (జాబు చదవడం పూర్తి చేసి, గంతులు వేస్తూ) మాలతీ! అక్కడ ఎవరూ లేరుగా?

మాలతి: ఎవరూ లేరులే. పురుషోత్తంగారు బయటికి వెళ్తూ ఆలస్యంగా వస్తానన్నారు. అరుణ వాళ్ళ నాన్నగారు కొట్టారని ఏడ్చి ఏడ్చి ఇప్పుడే నిద్రపోయింది.

విశ్వం: నీ కొక మంచిమాట చెప్పాలి. నన్ను అక్కడికి రమ్మంటావా? ఇక్కడికి వస్తావా?

మాలతి: నువ్వే రా, (కొంచెం తటపటాయిస్తూ) మీ వదినెగాని గబుక్కున వస్తే—

విశ్వం: మా వదిన సంగతి నీ కింకా తెలియదు కాబోలు. లేడీస్ క్లబ్బులో రమ్మీ ఆడడానికి వెళ్ళింది. అందులో పడితే ఒకపట్టాన తెములుతారా? (తలుపు దగ్గరకి వేసి పురుషోత్తం వాటాలోకి కూనిరాగం తీస్తూ ప్రవేశిస్తాడు)

మాలతి: మంచి హుషారులో వున్నావే? ఏమిటా మాట?

విశ్వం: ముత్యంలాంటి మాట. మరి నాకు బహుమానంగా ఒక చిన్న....

మాలతి: (చిరుకోపంగా) అదే వద్దన్నది. ఆహా! నన్నిక్కడ ఉద్యోగంలో చేరమన్నది ఎందుకో నా కిప్పుడు అర్థమయింది.

విశ్వం: అంత కోపమైతే ఎలా? నాకుమాత్రం తెలియదా ఏమిటి?

మాలతి: ఏమో బాబూ! నీవు కొంచె కోణంగివి. అలా అంటూనే ఏదో తంటా తెస్తావు. తొందరగా చెప్పు ఏమిటీ?

విశ్వం: (నాటక ఫక్కీలో) యింకేం చెప్పాలి? నీవు నా ప్రేయసివని, నా జీవిత నౌకకి చుక్కానివనీ, ఎంకివలె నా గొంతుకలో కొట్లాడే గుండెవనీ....

మాలతి: ఓహో! ప్రేమతోపాటు కవిత్వంకూడా మూడుపువ్వులూ ఆరుకాయలూ కాస్తుంది. ఆ చెప్పేదేదో త్వరగా కానీ, పుణ్యకాలం కాస్తా అయిపోతే అక్కడ ఆవిడా, యిక్కడ ఈయనా తయారవుతారు.

విశ్వం: నేను ఉద్యోగం వెతుక్కుంటూ వెళ్ళానా? అది తెలియక ఏ సన్యాసం పుచ్చుకున్నానో, లేక తప్పిమని ప్రాణత్యాగం చేశానో అని గాబరాపడి మా అమ్మ మంచం ఎక్కింది. నేను తిరిగి వచ్చానని తెలిసి వెంకటేసుతో ఉత్తరం పంపింది. పాపం! చాలా బాధపడుతూవుంది. అటు హిరణ్యకశిపుడులాంటి భర్త. ఇటు ప్రహ్లాదుడులాంటి కొడుకు.

మాలతి: ఎంతైనా తల్లిమనసు. ఈ కష్టాలన్నీ నా మూలంగానే వచ్చినయి. తల్లినీ కొడుకునీ వేరుచేశాను. నేను నిజంగా పాపాత్మురాలిని! (కళ్ళ నీళ్ళు పెట్టుకుంటుంది)

విశ్వం: ఈ సంధిగ్ధాలూ, సమస్యలూ మానవ జీవితంలో ఎప్పుడూ వున్నవే. ఈ నాడు క్రొత్తగా వచ్చినవి కావు. పరిస్థితులని బట్టి వాటి స్వభావం మారుతూవుంటుంది. అంతే. ఆస్తి, గౌరవం, హోదా అనే కల్పిత విలువలని పట్టుకుని అభ్యుదయాన్ని నిరోధించే వ్యక్తులు, శక్తులు ప్రతి వ్యవస్థలోనూ వుంటారు. వాళ్ళే తల్లులూ తండ్రులూ!

మాలతి: బాగానేవుంది. ఒకప్రక్క కవిత్వం ఇంకొకప్రక్క ప్రేమ, అడపాతడపా రాజకీయాలు నీతో చాలా గొడవగా వుంది. ఇంతకీ అసలు సంగతి చెప్తావా లేదా?

విశ్వం: మా అమ్మ కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తూవుంటే మా నాన్న కొంచెం మెత్తపడ్డాడట....

మాలతి: (సంతోషంగా) నిజంగానే! ఇంత చల్లని కబురు చెప్పటానికి ఇంతసేపు యీ ఉపన్యాసాలతోటి ఏడిపించా వెందుకూ?

విశ్వం: నువ్వు చెప్పనిస్తేగా! ఒక్క షరతుమాత్రం పెట్టారు, ఏ నిర్ణయానికీ వచ్చేముందు మా అమ్మ నీతో మాట్లాడాలట. నిన్ను తీసుకు రమ్మంది.

మాలతి: ఇదంతా నిజమే! నేను నమ్మలేకుండా వున్నాను.

విశ్వం: నిజమే మాలతీ. నువ్వుకూడా మా సావిత్రమ్మొదినలాగ అనుమానం మనిషివే! కావాలంటే యీ ఉత్తరం చూసుకో. పద, మా యింటికి వెళదాం.

మాలతి: విశ్వం, నాకు చాలా భయంగా వుంది. అక్కడికి వెళ్ళిన తర్వాత మీ నాన్నగారు ధూం ధాం అని కేకలువేస్తే నా పైప్రాణం పైనే పోతుంది.

విశ్వం: ఇంతేనా! ఏదో చాలా ధైర్యస్థురాలి వనుకున్నాను.

మాలతి: (సంకోచిస్తూ) ఇప్పుడే బయలుదేరా లంటారా?

విశ్వం: (పైం చూసుకుంటూ) ఈ క్షణంలో బయలుదేరకపోతే మా నాన్నగారికి అనవసరంగా కోపం తెప్పించినవాళ్ళ మవుతాం. పద. ఎందుకైనా మంచిది నువ్వు ముందు నేను వెనకా బయలుదేరదాం, మా వదిన చూచిందంటే లేనిపోని సంజాయిషీలు చెప్పుకోవాలి.

(సావిత్రమ్మ అదే సమయానికి తన వాటాలోకి వస్తుంది. ప్రక్కన మాటలు వినిపిస్తాయి. పురుషోత్తమే మాలతితోటి మాట్లాడుతున్నాడనుకొని చప్పుడు చెయ్యకుండా అలమారాదగ్గరకి వస్తుంది)

మాలతి: ఏమిటోనండీ, నాకు చాలా భయంగావుంది.

విశ్యం: (మాట్లాడకుండా దగ్గరికి వస్తాడు)

మాలతి: అదిగో, అదే వద్దంది. ఇంత తొందరపడితే ఎలాగండీ! అహర్నిశలూ మీ కంటఎదుటే వెలుగుతున్నానుగా. ఈ యింట్లోంచి బయట పడితే నే నెప్పటికీ నీ దాన్నే. ముందు....(ప్రక్కకి చూపిస్తూ) ఆవిడగానీ వచ్చిందంటే అసలుకే మోసం!

విశ్వం: (మాట్లాడకుండా గాలిలో ముద్దుపెడుతూ నవ్వుతూ బయటికి వెళ్ళిపోతాడు)

(సావిత్రి చాలా కలవరపడిపోతుంది. కాసేపు నిశ్శబ్దం. మాలతి కూడ బయటికి వెళ్ళి తలుపు వేసుకుంటుంది. ఇంకేమీ వినరానందున సావిత్రి ఉసూరుమంటూ కుర్చీలో కూలబడిపోయింది. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. కొంచెం తేరుకుంటుంది. ముఖంలో కోపం, ఈర్ష్య గోచరిస్తాయి)

సావిత్రి: (కోపంతో) విశ్వం, విశ్వం.

విశ్వం: (బయటనుంచి వస్తూ) ఏం వదినా?

సావిత్రి: ఎక్కడికి వెళ్ళావు? నేను వచ్చేటప్పటికి తలుపు బార్లా తీసుంది. ఏ దొంగవెధవైనా దూరితే ఏమయ్యేది? అయినా యిల్లు కాస్త చూస్తుండమని బైటికి వెళితే నువ్వు పెత్తనా లేమిటీ?

విశ్వం: ఏమిటి వదినా? అంత కోపంగా వున్నావు? తోచకపోతే బైటికివెళ్ళి సిగరెట్లు కాల్చుకుంటున్నాను.

సావిత్రి: మరి నాకు కనడలేదే?

విశ్వం: నేను వీధిమొగలో నిలబడి మన యింటిమీద ఒక కన్ను వేసి వుంచానులే. నీవు రావడం చూసి వెనకాలే వచ్చాను.

సావిత్రి: (ఉసూరుమంటూ) అలాగా! అయితే నే ననుకున్నది నిజమేనన్న మాట. (బాధగా) భగవంతుడా! నా కెంతకష్టం తెచ్చిపెట్టావు!

విశ్వం: (ఆశ్చర్యంగా) అదేమిటి వదినా? ఇప్పుడేమైంది! అలా పీరు కారిపోతున్నా వేం?

సావిత్రి: (దీనంగా) నా బాధ నాది, ఎవరితో చెప్పుకుంటే తీరుతుంది. ఈ అగ్ని నా గుండెల్లో పెట్టుకుని బ్రతకాల్సిందే. (కొంచెం ఆత్మగతతో) మీ అన్నయ్యని చూశావా?

విశ్వం: నాకు కనబడలేదే! యింట్లోనే వుంటారు. ఆ టీచరమ్మ యిప్పుడే బయటికి వెళ్ళింది.

సావిత్రి: (కోపంగా) దానిమాట నా దగ్గి రెత్తావంటే వూరుకోను.

విశ్వం: అదేమిటి వదినా, ఆ అమ్మాయి మంచిదిగానే తోస్తోంది. ఆ నమ్రత, ఆ సంస్కారం, చక్కదనం—

సావిత్రి: ఓహో! ఆ చక్కనిచుక్క వెంట నువ్వుకూడా పడక పోయావా? సిగ్గు లేకపోతే సరి! (కోపం హెచ్చిపోయి) మీ మగవాళ్ళకంతా ఒకటే బుద్ధి. ఏవరై నా నదురుగా కనబడితే అన్నీ మర్చిపోతారు.

విశ్వం: నువ్వేదో మనసులో చాలా బాధపడుతున్నట్లున్నావు. నెమ్మది మీద మాట్లాడుకుందాము. ఇప్పుడు నేను చాలా అవసరంగా వెళ్లాలి.

సావిత్రి: వెళ్దువుగానిలే. ముందు ఆయనక్కడ ఉన్నారో లేదో చూచిరా.

విశ్వం: ఆయనెవరు? పురుషో త్తం అన్నయ్యా? నేను చూడట మెందుకూ, నీకు కోడ్ వుందిగా. ఉపయోగించు.

సావిత్రి: (చిరాగ్గా) కొంచెం చూసి చెప్పమంటుంటే ఏమిటా టలా యింపు?

విశ్వం: (బయట గుమ్మందాకా వెళ్ళి) అరే, ఇప్పుడే బయటికి వెళు తున్నాడు. అయినా చిన్నవాణ్ణో చితకవాడినో ఒక టడుగుతాను. మీరిద్దరూ హాయిగా సంసారం చేసుకోకుండా ఈ విడాకు లెందుకూ? ఈ అడ్డుగోడ లెందుకు? నాలాంటివాళ్ళ మధ్యవ ర్తిత్వం ఎందుకు?

సావిత్రి: (చాలా ఉద్వేగంగా) మీ అన్నయ్యంటే ఏమిటో అను కున్నాను. అసలాయన వయోముఖ విషకుంభం. విడాకుల నెపంపెట్టి నన్ను వదిలించుకోవాలని పన్నాగం పన్నిన మనిషి! పోనీలే భగవంతుడు నాకు మంచితోవే చూపించాడు. పూ ర్తిగా దిగజారిపోయి అయినదాని వెంట కాని దానివెంటపడే భ ర్తతో కాపరం చేసేదానికంటే స్వతంత్రంగా వుండ టమే హాయి.

విశ్వం: (గబుక్కున తేరుకొని) ఏమిటీ? మా అన్నయ్యని అనవల సిన మాటలే! ఈ విడాకులు వద్దో, దేవుడా అంటే విన్నావా? నెమ్మదిమీద అన్నీ సర్దుకుంటాయిలే. నువ్వుమాత్రం తొందరపడబోకు. (బయటికి తల వూపుకుంటూ వెళ్ళిపోబోతాడు. సావిత్రి ఆలోచిస్తూ కూర్చుండిపోతుంది తలుపు దగ్గిర. తటపటాయిస్తూ నరహరి ప్రత్యక్షం) ఓహో! ప్లీడరుగారా? మీ విడాకుల వ్యాపారం ఎలాగుంది సార్?—(బిగ్గరగా నవ్వుతూ వెళ్ళి పోతాడు.)

నరహరి: (భయం భయంగా) సావిత్రమ్మా! సావిత్రమ్మా!!

సావిత్రి: ఎవరూ (తిరిగి చూచి) నరహరిగారా! (ద్విగుణీకృతమైన కోపంతో) మళ్ళీ వచ్చావూ! నీ పాడుముఖం నా కిక చూపించొద్దని ఎన్ని సార్లు చెప్పాలి. ఇప్పటికి చేపిన నిర్వాకం చాలుగాని దయచెయ్యండి.

నరహరి: (మొఖం తుడుచుకొంటూ) నాకు దేవుడిచ్చిన ముఖాన్ని పాడుముఖం అంటున్నారా? అనమ్మా అను, చిన్నప్పుడు మా అమ్మమ్మ నా ముఖం చూస్తేనే గాని కళ్ళు తెరిచేదికాదు, కాలం మారిపోయింది.

సావిత్రి: (వెటకారంగా) మీ బామ్మగారు పోయి నాలుగైదేళ్ళు అయ్యింది కదూ!

నరహరి: ఔనమ్మా! బచ్చి ఏ స్వర్గాన వుందో!

సావిత్రి: తమరుకూడా అక్కడికే దయచెయ్యండి, (కోపంగా)వెళ్ళు వయ్యా వెళ్ళు, నీ కిక్క డేమీ పనిలేదు.

నరహరి: అబ్బెబ్బే! అలా అనబోకండి. చాలా ముఖ్యమైన విషయం చెప్పాలి. చెప్పకపోతే ఏ క్షణంలో మిన్నువిరిగి మీద పడుతుందో అని, మీరు కోపగిస్తారని తెలిసికూడా వచ్చాను. ఈ ఒక్కసారి వినండి.

సావిత్రి: ఒకసారి నీ తప్పుడు మాటలు విని, చెయ్యరానిపని చేసి అనుభవిస్తున్నాను. నా సంసారంలో చిచ్చుపెట్టిన వాడిని నువ్వు. నువ్వేమీ చెప్పనక్కలేదు. వెళ్ళమంటుంటే కదలకుండా నిలబడ్డా వేమిటి?

నరహరి: మంచికిపోతే చెడు ఎదురైందట. వెళ్ళమంటున్నారుగా వెళ్తాను. ఈ గుమ్మంలోకి మళ్ళీ వస్తే చెప్పు తీసుకుని కొట్టండి. చాలా అర్జంటు విషయం చెప్పడానికి వచ్చానని మాత్రం మీ ఆయనకి చెప్పండి. లబో దిబో మని ఆయనే పరుగెత్తుకుని వస్తాడు. నా కెందుకీ ఘోష!

సావిత్రి: (మెత్తబడి) సరే, ఏమిటా ప్రమాదం?

నరహరి: మీ విషయం ఎలా తెలిసిందో గాని, ఢిల్లీలో సి. బి. ఐ. వాళ్ళ చెవుల్లో కూడా పడిందట. అక్కడనుంచి ఒక ఆఫీసరూ, ఆయన పిబ్బంది పదిరోజుల నుంచి ఇక్కడ మకాంపెట్టి ఆచూకీ తీస్తున్నారట.

సావిత్రి: (మొదట కంగారు పడి, కొంచెం నిలదీసుకుని)అంతదాకా వచ్చిందన్న మాట....రా....రానీ అదీ ఒకందుకు మంచిదే (కొంచెం ఏడుస్తూ) నా చేతులారా పచ్చటి సంసారం పాడుచేసుకున్నాను. మా ఆయన

తోటిదే లోకమని నమ్ముకున్నందుకు మంచి పాఠమే నేర్పారు. (కోపంగా) చూస్తానుగా! అటో ఇటో తేల్చేస్తానుగా. ఇవాళతో సరి....

నరహరి: సావిత్రమ్మా, మీ రేదో ఉద్రేకంలో ఉన్నారు. అసలే ఒక మహా ప్రమాదం అగ్నిపర్వతంలా పేలబోతుంటే మీరు తొందరపడితే మనమందరమూ సర్వనాశనమైపోము.

సావిత్రి: నీకేం! ఆన్నివిధాల నాశనమైపోయింది నేను (కోపంగా) వుండండి, నేను నోరుమూసుకుని వూరుకుంటా ననుకున్నారు కాబోలు. అంతా బట్టబయలుచేసి నాలో రగుల్తున్న కోపాగ్నిని చల్లార్చుకోకపోతే నా పేరు సావిత్రి కాదు. దానితో అన్ని సమస్యలు తీరిపోతయి.

నరహరి: (వణికిపోతూ) తొందరపడకమ్మా....దానివల్ల ఎన్ని అనర్థాలు వున్నాయో, ఎంతమంది నాలాంటి నిరపరాధులు ఆపదల్లో చిక్కుకుంటారో ఆలోచించండి.

సావిత్రి: (కోపంగా) నీదాకా వచ్చేటప్పటికి తెలుస్తుందన్న మాట! ఇందుకా నీ భయం! ఏదో మా కోసం తాపత్రయపడిపోతున్నావని అనుకున్నాను, పోతే అందరమూ పోతాములే. ఇందులో మిమ్మల్ని ఇరికించినందుకు మాతోపాటు వీకూ కావాల్సిందే కాస్తి. ఇంక దయచెయ్యండి.

నరహరి: నీకు ముక్కుమీదే వుంటుంది కోపం. అంతా నాప్రారబ్ధం. శ్రీరంగనాధా! (బయటికి వెళ్ళిపోతాడు. సావిత్రి ఆలోచిస్తూ అలాగే కూలబడి పోయింది. చీకటి.)

(కొంచెం వ్యవధి. రాత్రి సావిత్రి అలమారా దగ్గరకి వచ్చి మూడు సార్లు సంజ్ఞాసూచకంగా కొడుతుంది,. ప్రక్కవాటాలో పురుషోత్తం సోఫాలో కూర్చుని విస్కీ త్రాగుతూ దీర్ఘంగా ఆలోచిస్తూ పలకడు.)

సావిత్రి: ఏమండోయి. మిమ్మల్నే అక్కడే వున్నారా! లేదా!

పురుషోత్తం: (ముక్తసరిగా) ఉన్నాను.

సావిత్రి: పలుకే బంగారమై పోయిందన్న మాట. మీతో అవసరంగా మాట్లాడాలి. అక్కడికి రమ్మంటారా! మీరే వస్తారా!

పురుషోత్తం: (గొంతు హెచ్చించి) నేను రాను, నా అవసరం నీకిప్పు డేమొచ్చిందిగా! ఇక్కడికి నువ్వొచ్చినా, నీతో మాట్లాడడానికి నాకు మనస్కరించడం లేదు.

సావిత్రి: ఏమిటా వెకిలిమాటలుఁ చేసిన దౌర్భాగ్యపు పని చాలక పెడసరంగా మాట్లాడుతున్నారాఁ ఇది మర్యాద కాదు.

పురుషోత్తం: (ఇంకా గొంతు హెచ్చించి) అసలు నీకు మర్యాద అంటే తెలుసా?

సావిత్రి: అలా గొంతు చించుకుంటా రెందుకుఁ ఊరంతా తమరు చేసిన ఘనకార్యానికి జేజేలు పట్టాలాఁ ఆవతల అమ్మాయి వింటుంది.

పురుషోత్తం: అరుణ లోపల పడుకుందిలే.

సావిత్రి: అయితే మరి నన్ను లోపలికి రానివ్వండి. ఇవాళే మన పంగతి అటో ఇటో తేల్చుకోవాలి.

పురుషోత్తం: (అగ్రహంగా) తేల్చుకునేది నువ్వాఁ నేనాఁ రా.

(సావిత్రి తలుపు దగ్గిరగా వేసి బైటనుంచి పురుషోత్తం వాటాలోకి ప్రవేశిస్తుంది.)

సావిత్రి: ఏమిటండీ మీరు తేల్చేదిఁ

పురుషోత్తం: నువ్వేం తేలుస్తా మనుకున్నావో అదేఁ పట్టుమని రెండు నెలలు కాలేదు. ఇంత త్వరగా నీ బుద్ధి వక్రిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు.

సావిత్రి: (ఆశ్చర్యంగా) ఏమిటండీ మీరనేదిఁ నా బుద్ధి వక్రించిందాఁ

పురుషోత్తం: ఛీఁ ఏమి తెలియనట్లు నటిస్తున్నావుఁ నీకు పిగ్గు బిడియం వున్నాయాఁ

సావిత్రి: అయ్యగారికి డోసు ఎక్కువయినట్లుందిఁ

పురుషోత్తం: ఓహోఁ అపర సావిత్రిఁ పతివ్రతా శిరోమణిఁ (రెచ్చిపోయి) అమాయకురాలినని నమ్మి ఎంత మోసపోయాను. నీలో ఇంత దుర్బుద్ధి వుందికాబట్టే ఈ విడాకుల మిషమీద నన్ను వదిలించేసుకున్నావు.

సావిత్రి: నేను మిమ్మల్ని వదిలించుకున్నావాఁ మీరు నన్ను వదిలించుకున్నారాఁ (ఏడుస్తూ) దౌర్భాగ్యురాలిని, అన్నివిధాల మోసపోయానుఁ

పురుషోత్తం: బుడి బుడి రాగాల్తో కల్లబొల్లి మాటలతో ఇంకెన్నాళ్ళు నా కళ్ళు కప్పుతావుఁ నాకంతా తెలిసిపోయింది. నీలాంటి దిగజారిపోయిన భార్యతో కాపరం చెయ్యటం కంటే విడాకులే నయం.

సావిత్రి: (రౌద్రంగా) నేనా? దిగజారి పోయానా? ఎంత మాట న్నారు!

పురుషోత్తం: అవును. నువ్వే, ముమ్మాటికీ నువ్వే! నీ ముఖం చూస్తే పంచ మహా పాతకాలు చుట్టుకుంటయ్. పో! ఇక్కడినుంచి ఇప్పుడే వెళ్ళిపో. నాకు ఒళ్ళు మండిపోతోంది. ఈ కోపంలో ఏం చేసినా చేస్తాను.

సావిత్రి: నా నీతినే శంకిస్తున్నారా? ఎవరో చెప్పినతప్పుడు మాటలు విని నామీద ఇలాంటి అభాండాలు వెయ్యటం ఏమైనా న్యాయంగా వుందా? (కొంచెం తేరుకుని, ఏదో తట్టగా) తెలిసింది. మీరాడే నాటకం అంతా అర్థమయింది. ఇదంతా మీరు నరహరితో కలిసి నా జీవితం నాశనం చెయ్యడానికి వేసిన పన్నాగం.

పురుషోత్తం: (గంభీరంగా) పన్నాగం వేసింది నేను కాదు. నువ్వే....

సావిత్రి: భగవంతుడా! నా కెంత ఇక్కట్లు తెచ్చిపెట్టావు!.... (పురుషోత్తంతో) లేనిపోని మాటలు చెప్పి ఏ ఇల్లాలు చెయ్యరాని పని చేయించారు. మీరు చెప్పింది నిజమేననుకుని చుట్టాలు, పక్కాలు నవ్వుతున్నా, ఇరుగు, పొరుగు కాకుల్లా పొడుస్తున్నా, అవమానాన్ని భరించాను. విడాకులిచ్చినంత మాత్రాన మన ప్రేమ నన్నగిల్లదనీ, మనిద్దరి మధ్యా ఏ కలతలూ రావనీ, మీరు వాగ్దానం చేస్తే బుద్ధి గడ్డి తిని నమ్మాను. ఇదంతా ఒక పెద్ద కుట్రనీ, ఇంకెవతెనో తెచ్చుకోడానికి వేసిన ఎత్తనీ ఊహించ లేకపోయాను. తప్పుదారి త్రొక్కినందుకు నాకు మంచి శాస్తే అయింది. (కొంచెం ధిక్కరిస్తూ) సరే! ఇంతదాకా వచ్చిం తర్వాత నేను మాత్రం ఎందుకు తాపత్రయం పడాలి? ఇష్టంలేని భర్తతో ముడి వేసుకుని బ్రతక వలసిన ఖర్మ నాకేనా? ఆ పంతులమ్మని తెచ్చుకున్నారుగా! దానితోనే కాపరం వెలగబెట్టండి. దాన్ని కట్టుకుని ఊరేగండి.

పురుషోత్తం: (నిర్ఘాంతపోయి) ఇవాళ వచ్చిన అమ్మాయి సంగతా నీవు మాట్లాడేది? నాకు బిడ్డలాటిది. ఒళ్ళు దగ్గిర పెట్టుకుని మాట్లాడు.

సావిత్రి: (తన ధోరణిలోనే) నిజమాడితే నిష్ఠూరం. ఏం చేస్తారేం? బెదిరిస్తున్నారా?

పురుషో త్తం: (ఆపుకోలేని కోపంతో) నిన్నేదో భయంకరమైన అనుమాన పిశాచం ఆవహించింది. అరుణకోసం పెట్టిన మాలతితో నాకు సంబంధం అంటగట్టుతున్నావా? నీకు పూ ర్తిగా మతిపోయింది.

(ప్రక్క గదిలోంచి తలుపు ఓరగా తీసి అరుణ బయటికి రాబోతుంది. కాని పోట్లాడుకుంటున్న తల్లిదండ్రులను చూచి భయపడి అగిపోతుంది. సావిత్రి, పురుషో త్తం అరుణని గమనించరు.)

సావిత్రి: మతిపోయింది నాకు కాదు. పదేళ్ళు కాపరం చేసి నీ తోటిదే లోకమని నమ్మిన భార్యను గంగలో దింపి ముక్కుపచ్చ లారని బిడ్డ ముఖమైనా చూడక ఆ పంతులమ్మతో తై తక్కలాడుతున్న మీకు.

పురుషో త్తం: ఆ పంతులమ్మ ఎవరో కూడా నాకు తెలియదంటే వమ్మవేం? పోరు పడలేక పనిలో చేరమన్నాను. నువ్వింలాంటి అపోహలు పెట్టుకుని నానా మాటలూ అనటంలో అర్థంలేదు. (కొంచెం ఆగి) అర్థం లేకపోవటమేమిటి? నేనే భ్రమపడుతున్నాను. ఇందులో చాలా పెద్ద అర్థమే వుంది....

సావిత్రి: (వెటకారంగా) ఏమిటా అర్థం?

పురుషో త్తం: పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగుతూ ఎవ్వరూ చూడలేదనుకుందట. నీ వ్యవహారం అలాగే వుంది:

సావిత్రి: (కోపంతో) పిల్లిమీద ఎలుకమీద పెట్టి సూటీపోటీ మాటలెందుకు? ధైర్యముంటే మీ మనస్సుతో వున్నదేమిటో చెప్పరాదూ?

పురుషో త్తం: చెప్పాల్సిందే! చెప్తాను. నువ్వంటే నాకు ఎంతో గాఢమైన ప్రేమ, నమ్మకం వుండేవి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా చలించవనీ, నీలో ఎటువంటి కళంకమూ రాదనీ, విశ్వసించి పూ ర్తి స్వతంత్రం యిచ్చాను. ఆ విశ్వాసమే నాకొంప ముంచింది. పదేళ్ళు కాపరం చేసి యివాళ ఆ విశ్వంగాడితో నువ్వాడే సరసాలు వినే దుర్గతి నాకు పట్టిందంటే ఇంతకన్నా యింకేం చెప్పాలి?

సావిత్రి: (నిర్ఘాంత పోయి) నేనా? విశ్వంతో!....(విరగబడి నవ్వుతూ) మీకు నిజంగానే మతిపోయింది.

పురుషో త్తం: (గట్టిగా) షటప్.

సావిత్రి: యూ షటప్! (ప్రక్క గదిలోనుంచి అంతా చూస్తున్న

అరుణ బిక్కు బిక్కుమని ఏడుస్తూ, బైటికి వెళ్ళిపోతుంది.) మీరింత అనుమానపు మనిషనీ, మీలో యింత నీచమైన భావాలు గూడు కట్టుకు పోయేయనీ నేనెన్నడూ అనుకోలేదు. పదేళ్ళు కాపరమని పదేపదే అలటున్నారు. ఈ పదేళ్ళలో నన్ను తెలుసుకున్నది యింతేనన్న మాట. నా తమ్ముడులాంటి విశ్వంతో మాటలాడినంత మాత్రాన నన్ను నానా మాటలూ అనడం మీకే సిగ్గుచేటు.

పురుషోత్తం: నా చెవులారా విన్నాను. నాకంతకన్నా వేరే సాక్ష్యం అక్కరలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకోడయితే నిన్నక్కడి కక్కడే చంపి పాతేసుండేవాడు.

సావిత్రి; అదొక్కటే తక్కువ. విడాకులని మభ్యపెట్టి పరాయి ఆడదాన్ని తెచ్చిపెట్టుకుని మీరు నా కళ్ళముందే కులుకుతున్నారు. అందుకే నేను మీకు కంటకప్రాయంగా వున్నాను. మీలాంటి భర్తతో కాపరం చేసే దానికంటే చావటమే మేలు. రండి. చంపండి. నాకూ విముక్తి కలుగుతుంది....

పురుషోత్తం: (రెచ్చిపోయి) మహా పతివ్రతలాగా లెక్చర్లు దంచుతున్నావే? నీలాంటి వాళ్ళవల్లే సంసారాలు, సంసారాలు నాశనమై పోతున్నాయి. నిన్ను చంపినా పాపం లేదు.

సావిత్రి: ఏ చేతులతో తాళి గట్టారో ఆ చేతుల్తోనే చంపటానికి కూడా తెగించారన్న మాట.

పురుషోత్తం: (దౌర్జన్యంగా) ఆ, తెగించాను. తెగనరుకుతాను. నీ పీడ విరగడై పోతుంది.

(ఒళ్ళు తెలియని కోపంతో ఏమి చేస్తున్నాడో తెలియకుండా సావిత్రి మీదికి రాబోతాడు,)

సావిత్రి: (భయంతో కంపించిపోతూ గట్టిగా) అరుణా, అరుణా! తొందరగా రా, మీ నాన్న నన్ను చంపేస్తున్నారు. అరుణా, రా, అమ్మా, ఇంక ఒక్కక్షణమైనా మనం ఇక్కడ ఉండకూడదు!

పురుషోత్తం: (అడ్డువచ్చి) ఫో, ఇక్కడనుంచి ఫో, అరుణ నా అధీనంలో ఉంది దాన్ని తీసికెళ్ళడానికి వీల్లేదు.

సావిత్రి; (నిర్లక్ష్యంగా) అది రేపు కోర్టులో చూచుకుందాం (మళ్ళీ)

అరుణ-అదేమిటి? పిల్ల పలకదేం? (ఆదుర్దాగా అరుణ గదిలోకి వెళ్ళి వచ్చే స్తుంది. చాలా కలవర పడిపోయాంది.) అరుణ గదిలోలేదే? ఏమయింది. ఎక్కడుంది? ఏం చేశారు? (పురుషోత్తం ఆలోచిస్తూ పరధ్యానంగా వుంటాడు.) మిమ్మల్నే. అవతల పిల్ల కనబడటంలేదంటే మాట్లాడరేం?

పురుషోత్తం: (బిత్తరపోయి) ఏమిటీ? అరుణ కనబడటంలేదా?

సావిత్రి: (కోపంగా) అమ్మాయి నెక్కడో దాచేసి నన్నెందుకిలా ఏడిపిస్తారు?

పురుషోత్తం: (అయోమయంగా) నిజంగా! కనబడలేదా?

సావిత్రి: (ఏడుస్తూ) మీకు మీకు తెలియదా? లోపల పడుకుంద న్నారుగా!

పురుషోత్తం: (గాబరాగా అరుణ గదిలోకి పరుగెత్తివెళ్ళి తిరిగి వస్తూ) నిజమే, గదిలోలేదే!....సావిత్రీ నన్ను నమ్ము. అరుణ ఏమైందో నాకు తెలియదు, ఇంతలో ఎలా మాయమైంది?

సావిత్రి: (భయంతో కూలబడిపోయి) భగవంతుడా! నన్నెందుకిలా పరీక్షిస్తున్నావు? పండు వెన్నెల లాంటి సంసారంలో నిప్పులు పోసుకున్నాను చివరికి నా బంగారు తల్లి కూడా దూరమైపోయింది. మీరింకా అలా చూస్తా రేమిటి?బిడ్డని ఏ కిరాతకుడు ఎత్తుకుపోయాడో! లేక మన వై ఖరి చూసి భయపడి ఎటన్నా పారిపోయిందేమో! అభమూ శుభమూ తెలియని బిడ్డ. వంటిమీద నగలు కూడా వున్నాయి. ఏ దుర్మార్గుడి చేతుల్లోనైనా పడితే అది మనకు దక్కుతుందా? (ఏడుస్తుంది)

పురుషోత్తం : (దుఃఖంతో) ఆస్తి, ఆస్తి అని తాపయత్రయ పడి నందుకు నాకు భగవంతుడు మంచి శాస్తి చేశాడు. భార్యా బిడ్డా తలా ఒక దారయిపోయారు.

సావిత్రి : (ఆవేదనతో) ఇప్పుడు ఆ విషయాలన్నీ త్రవ్వుకుని ప్రయోజనం ఏముంది? ముందు అమ్మాయి సంగతి చూడండి - పోలీసు రిపోర్టు చెయ్యండి.

పురుషోత్తం : అవునవును....పోలీసు (పురుషోత్తం ఫోను దగ్గిరకి వెళ్ళబోతుంటే బయటనుంచి 'పురుషోత్తంగారూ', అంటూ సలాముద్దీన్

ఖాన్ వస్తాడు. తెల్ల పై జామా, నల్లని షర్వానీ ఏర్ర టోపీ, గడ్డం మీసం ముఖాన్ని పూర్తిగా ఆక్రమించేశాయి. కళ్ళకి నల్ల అదాలు) ఎవరండీ మీరు?

సలాముద్దీన్ : నేను పి. బి. ఐ. ఇన్స్‌పెక్టర్. నా పేరు సలాముద్దీన్ ఖాన్. మీరేనా పురుషోత్తం? మీతో కొన్ని విషయాలు అర్జెంటుగా మాట్లాడాలి (సావిత్రిని చూపిస్తూ) ఆవిడా బీబీ - అంటే మీ పెళ్ళాం? అంతేనా?

సావిత్రి : ఇన్స్‌పెక్టరుగారూ, సమయానికి దేవుడిలా వచ్చారు. మా అమ్మాయి అరుణ కనబడటం లేదండీ. కొంచెం అవసరంగా వెతికించాలి.

సలాముద్దీన్ : నేను పిల్లలని వెతకటానికి రాలేదు. వేరే కేసు దర్యాప్తు చెయ్యటానికి వచ్చాను.

పురుషోత్తం : (భయంగా) కేసా? ఎవరి మీద?

సావిత్రి : (అడ్డు వచ్చి) ఇంట్లో పిల్ల కనబడటం లేదని మే మేడుస్తుంటే కేసు కేసంటావు ఎవరయ్యా నువ్వు?

సలాముద్దీన్ : తప్పిపోయిన పిల్లల్ని పట్టుకోడానికి, లేచిపోయిన అమ్మాయిలని తీసుకురావడానికి పోలీసులో వేరే డిపార్టుమెంటు వుంది. అది మాకు సంబంధం లేదు. నేను వచ్చింది వేరే పనిమీద.

సావిత్రి : (విసురుగా) నీ పని తగలబడ! (పురుషోత్తంతో) మీరన్నా ఆ పోలీసు స్టేషన్‌కి ఫోను చెయ్యండి. పిల్లకోసం మనం ఆదుర్దా పడుతుంటే ఏదో దర్యాప్తు చేస్తాట్ట. దర్యాప్తు!

పురుషోత్తం: తొందరపడకు సావిత్రీ. నీకు నోటిదురుసు ఎక్కువ. ఇన్స్‌పెక్టరుగారు ఏమన్నా అనుకుంటారు. (సలాముద్దీన్‌తో) సాయిబుగారూ, మేము చాలా కష్టంలో వున్నాం. సమయానికి వచ్చారు. మా పిల్ల సంగతి కొంచెం చూడండి. నేను కూడా పిల్లని వెతుక్కోవాలి, మీరేమైనా మాట్లాడవలసివుంటే నెమ్మదిమీద చూసుకుందాం.

సలాముద్దీన్: నేనే ఫోను చేస్తాను. మీరు మాత్రం ఈ మిషమీద బైటికి వెళ్ళడానికి వీలులేదు. (ఫోను దగ్గిరకి వెళ్ళి డయల్ చేసి) హలో! త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, సబిన్స్‌పెక్టర్ హై? అచ్చా! నాతో మాట్లాడమను (కొంచెంఆగి) సబ్ ఇన్స్‌పెక్టరుసాబ్, ఇక్కడ రామన్నపేటలో పురుషోత్తం గారి ఇంట్లోంచి అరుణ అనే అమ్మాయి గైర్ హాజర్ అయింది. వయస్సు

ఎనిమిదేళ్ళు. ఎర్రగా వుంటుంది. మెళ్ళో బంగారు గొలుసు, చెవులకి రింగులు. అన్ని స్టేషన్‌లకి అర్జంటుగా మెసేజ్ పంపండి. చాలా జరూర్. ఇందులో ఆలస్యం చేస్తే మాట దక్కదు. (ఫోన్ పెట్టేస్తాడు)

సావిత్రి: (ఆశ్చర్యంగా) అమ్మాయిని ముఖా ముఖీ చూచినట్లుగా వివరించారే! మీకెలా తెలుసు?

సలాముద్దీన్: ఎక్కడ విషయాలు అక్కడ తెలుసుకోకపోతే ఈ నౌకరీ ఎలా చేస్తాం? అందరి గుట్లుమట్లు మాకు బాగా తెలుసు.

పురుషోత్తం: (స్తిమితపడి) నా మనసు కొంచెం కుదుటపడింది. సావిత్రి, నువ్వేమీ కంగారు పడొద్దు. స్వయంగా ఇన్స్‌పెక్టరుగారే చూస్తున్నారుగా. మన అమ్మాయి తప్పకుండా దొరుకుతుంది. (సలాముద్దీన్‌తో) మీరు రేపు దయచేస్తే మాకేదైనా తెలిసివుంటే తప్పక చెప్తాం పిల్లకోసం నేను వెళ్ళాలి.

సలాముద్దీన్: అలా టలాయించి గైరాజరు అవుదామని చూస్తున్నారా? నైనై!

సావిత్రి: మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు ఇప్పుడు దాపరించాడేమిటి? మీ కేసు మాట దేముడెరుగు? ముందు మా పిల్ల ఎక్కడికి పోయిందో చూసుకోవాలి. వెళ్ళవయ్యా వెళ్ళు.

సలాముద్దీన్: ఆ! సి. బి. ఐ అంటే మజాకా? మీరు పొమ్మంటే పోవడానికీ రమ్మంటే రావడానికీ మాకు వేరే ఉద్యోగం లేదూ? ఈ కేసు ఎవరిమీదో కాదు. మీమీదే!

సావిత్రి: (వణికిపోతూ) మామీద కేసా?

పురుషోత్తం: ఎవరిజోలికీ పోకుండా మా బ్రతుకులు మేము బ్రతుకుతుంటే మామీద కేసంటా రేమిటి? దేశమంతటా చూడండి. మీరు తలుచుకుంటే కేసులకి లోటా? ఇక్కడేముంది?

సలాముద్దీన్: షబాష్! మీలాంటి వాళ్ళని చాలామందిని చూశాం. ఎవరి జోలికీ పోకుండానే గోతులు త్రవ్వేస్తారు. ఇంతకీ నే నడిగే ప్రశ్నలకి జవాబు చెప్తారా? పోలీసు స్టేషన్‌కి వస్తారా?

పురుషోత్తం: మేము చేసిన నేర మేమిటి? అసలు సంగతి చెప్పకుండా ఏమేమో అనేస్తున్నారు.

సలాముద్దీన్: నువ్వూ నీ పెళ్లాం డైవోర్సు తీసుకున్నారుకదా?

సావిత్రి: ఓహో! అదా! ఏమిటో అనుకున్నాను. అవును డైవోర్సు తీసుకున్నాం. మధ్యలో మీ కెందుకు?

సలాముద్దీన్: ఎందుకు తీసుకున్నారు?

పురుషోత్తం: (తెచ్చిపెట్టుకున్న కోపంతో), అది మా స్వవిషయం. దర్యాప్తు చెయ్యటానికి మీ కే హక్కూ లేదు.

సలాముద్దీన్; గట్టిగా బల్ల గుద్ది చెప్తున్నారే? మీ డైవోర్సు దొంగ డైవోర్సు. ఆస్తి కోసం చేసిన ఖురాబు పని.

పురుషోత్తం: మాటలు తిన్నగా రానీ. మేము ఎందుకు విడాకులు తీసుకున్నామో జడ్జిగారికి తెలుసు. మీరు చేసే దర్యాప్తు మా విడాకులమీదే అయితే తమరు దయచేయొచ్చు. అవతల మా అమ్మాయి ఏమైపోయిందో నని అల్లాడిపోతున్నాం. తర్వాత ఏమైనా ఆపద వస్తే ఎవరయ్యా బాధ్యులు?

సలాముద్దీన్: ఫరవాలేదు. మీ అమ్మాయి కోసం పోలీసులు వెతుకు తారు. ముందు మీ సంగతి తేల్చండి.

సావిత్రి: ఏమిటయ్యా? తేల్చేదిః మాకు దొంగ విడాకులు పుచ్చుకునే గతి ఏం పట్టిందిః నా భర్త పెట్టే బాధలు పడలేక నా అంతట నేనే కోర్టుకి వెళ్ళాను. ఇదిగో కళ్లు తెరిచి చూడండి. మా ఇల్లు రెండు భాగాలు చేసేసు కున్నాం. అసలు మా ఆయనకీ నాకూ కొన్ని నెలలుగా మాటలే లేవు. అకస్మాత్తుగా పిల్ల కనబటలేదంటే వచ్చాను. ఎంతైనా కన్న కడుపు. మీ పోలీసులకి అదికూడా తప్పే కాబోలు.

సలాముద్దీన్: సావిత్రమ్మగారూ! మీరు నాటకాల్లోనూ సినిమాల్లోనో చేరితే పెద్ద స్టార్ అయిపోయి వుండేవాళ్ళు. (కొంచెం బిగువుగా) మీ కల్లి బొల్లి మాటలు కట్టి పెట్టండి. ఈ రెండు నెలలూ మీరు ఆడినదంతా దొంగ నాటకం అని చెప్పటానికి నా దగ్గిర కావల్సినంత సాక్ష్యం వుంది.

సావిత్రి: (నీరసంగా) ఏమిటా సాక్ష్యం?

పురుషోత్తం: (గాబరాగా) నువ్వు తొందరపడి నోరు జారబోకు. పోలీసులు ముద్దాయిల నిలాగే దబాయించి వున్నదీ లేనిదీ వాళ్ళతోనే చెప్పిం చేస్తారు.

సలాముద్దీన్: ఆగవయ్యా పెద్ద మొనగాడివి! డిటెక్టివ్ నవలలు

చాలా చదివావు కాబోలు (షర్వానీ జేబులో నుంచి చిన్న టేప్ రికార్డరూ ఇంకో జేబులోంచి ఫోటోలు తీసి) సాక్ష్యం అంతా ఇందులోనే వుంది. మీరేం చేసిందీ, ఏం మాట్లాడిందీ, నిమిష నిమిషానికీ రికార్డు చేసేశాం. ప్లీడరు నరహరితో షరీకై దొంగ విడాకులు తీసుకున్న సంగతి ఇందులో ఉంది. వింటారా?

సావిత్రి: హారి! దుర్మార్గుడా! ఎంత పని చేశావు?

సలాముద్దీన్: ఏమమ్మోయి, మాటలు సరిగా రానీ.

సావిత్రి: (దిగులుగా) నేను మిమ్మల్ని అంటం లేదు. ఇదంతా వాడే చేసివుంటాడు. విశ్వం!! వాడే! మా గొంతులు తడిగుడ్డతో కోసేశాడు. ఇంట్లో వుండి నాకే ఎసరు పెట్టిన దౌర్భాగ్యుడు!

పురుషోత్తం: ఆ చుంచుమూతి వెధవని యింట్లో వుండనియ్యద్దంటే నా మాట విన్నావుకాదు. ఇదంతా వాడు చేసిన పనే! దొంగరాస్కెల్! స్కౌండ్రల్! ఎంత ద్రోహం చేశాడు! (రౌద్రంగా) వాడి రక్తం కళ్ళ చూస్తేగాని నాకు నిద్ర పట్టదు.

సలాముద్దీన్: అంత పనీ చేస్తారా? (ముసి ముసిగా నవ్వుకుంటుంటాడు.)

పురుషోత్తం: చేస్తానా? చేసి చూపిస్తానా? జైలుకి ఎలాగూ పోవాలి. నాకు అన్నివిధాలా ద్రోహం చేసిన ఆ దుర్మార్గుడి అంతం చూస్తే పోయిన ఆత్మగౌరవమైనా దక్కుతుంది. నాకు మిగిలింది అదొక్కటేగా?

సావిత్రి: నా మతి మండిపోయింది. విశ్వం మీమీద నిఘావేసి వుంచుతానంటే సరేనన్నాను. తిన్నింటి వాసాలు లెక్కపెడతాడని కల్లో కూడా అనుకోలేదు.

సలాముద్దీన్: మీరు చేసిన నేరం వొప్పుకున్నట్లేగా, ఇక మా స్టేట్ మెంట్లు తీసుకోవాలి ప్రభుత్వాన్ని వంచించి భూపరిమితి చట్టం తప్పించుకోడానికి దొంగ విడాకులు తీసుకున్నందుకు మీమీద కేసు పెడతాను. మీతో షరీకై ఈ నేరం చేయించిన నరహరిని కూడా ఇరికించేస్తాను.

పురుషోత్తం: (విచారంగా) ఒక మాట సార్!

సలాముద్దీన్: క్యాహై?

పురుషోత్తం: బుద్ధి గడ్డి తిని ఈ నేరం చేసిన మాట నిజమే. కాని

ప్రస్తుతం మే మే నాటకం ఆడటంలేదు. మా ఆవిడతో నేనింక కాపురం చెయ్యను. అబద్ధంతో మొదలైన మా విడాకులు ఇప్పుడు పూర్తిగా నిజమే అయింది. మీరు 'లా' ప్రకారం ఏ శిక్ష చేసినా అనుభవించడానికి సిద్ధంగా వున్నాను.

సలాముద్దీన్: అదేమిటండీ? జేప్‌రికార్డులో మీ ఇద్దరికి చాలా మొహబత్ వున్నట్లు బాత్ చీత్‌తో హై! ఇప్పుడిలా ప్లేట్ ఫిరాయించార్! ఇది ఇంకో నాటకమా?

పురుషోత్తం: కాదు. పరిస్థితులు తారుమారై పోయాయి. మా ఆవిడ....అయినా మీ కెందుకు? మీ డ్యూడీ మీరు చెయ్యండి.

సావిత్రి: సాయిబుగారూ, నామీద దుర్మార్గపు అపోహలు పెట్టుకొని మా ఆయన అనరాని మాటలంటున్నారు. అసలు సంగతి వేరే వుంది. విడాకులు మిషమీద వన్ను వదిలించుకొని మరో అవిడిని ఇంట్లో పెట్టుకొని తై తక్కా లాడుతున్నారు. వేరు పడితే పడ్డాం. అదే నాకిప్పుడు కావలసింది. మీరే కేసు పెట్టుకుంటారో పెట్టుకోండి.

(బయటనుంచి ఈశ్వరయ్య, మాలతీ వస్తారు. వాళ్ళని చూస్తూ సలాముద్దీన్ కొంచెం మూలకు వెళ్తాడు)

ఈశ్వరయ్య: (హడావుడిగా) సావిత్రీ, సావిత్రీ విశ్వంగాడేడీ? సాయంత్రం అమ్మాయిని తీసుకొచ్చి ఇప్పుడే వస్తానని వెళ్ళాడు. ఇక్కడికిగాని వచ్చేడా?

పురుషోత్తం: (ఆశ్చర్యంగా) మాలతీ నువ్వా! ఈశ్వరయ్య గారింటికి వెళ్ళావా? నీకు విశ్వం తెలుసా? మరి నాకు చెప్పలేదే? (కొంచెం కోపంతో) ఇంతకీ ఏడీ ఆ దుర్మార్గుడు?

సావిత్రి: (తబ్బిబ్బుగా మాలతికేసి చూస్తూ) ఈ అమ్మాయి—

ఈశ్వరయ్య: ఈ అమ్మాయి ఎవరనా? ఇంకెవరూ? మన విశ్వం గాడు ఏరికోరి చేసుకునే పిల్ల. నేనేమో అనుకున్నాను. మన ఆకతాయ వెధవ ఈ అమ్మాయికి తగుతాడా అనే మనం ఆలోచించాలి.

మాలతి: (సిగ్గుతో) మామయ్యగారూ, మీరలా అనకండి. ఆయన వింటే బాధ పడతారు.

ఈశ్వరయ్య: ఏడికాడు. వాడు నా దగ్గిర ఏ ఆటలాడినా సరిపోయింది.

కాని నువ్వు మాత్రం మా సావిత్రిలా మొగుడ్ని మొదటినుంచి అదుపులో పెట్టుకోవాలి.

సావిత్రి: (ఆశ్చర్యంగా, విపరీతమైన ఆవేదనతో తడబడుతూ) ఇంతకీ, ఈ అమ్మాయి—

ఈశ్వరయ్య: ఈ అమ్మాయిని విశ్వం చేసుకోటానికి ససేమిరా వీలు కాదని ఇప్పుడెలా ఒప్పుకున్నానని అనుకుంటున్నావు కదూ! మొదట్లోనే విశ్వం ఈ అమ్మాయి పరుశురామయ్య కూతురని చెప్పివుంటే ఇంతదాకా వచ్చేదా? పరశురామయ్యంటే ఎవరనుకున్నావు? చిన్నప్పుడు నా ప్రాణ స్నేహితుడు! అంతా విశ్వం తొందరేగాని (ప్రప్రథమంగా సలాముద్దీన్‌ఖాన్‌ని చూచి) అరే! ఈ సాయిబుగారెవరు?

పురుషోత్తం: పి. బి. ఐ. ఇన్స్‌పెక్టర్ సలాముద్దీన్‌ఖాన్. (పరిచయం చేస్తూ) ఈయన మా బాబయ్య ఈశ్వరయ్యగారు.

సలాముద్దీన్: విశ్యంకా బాప్! చాలా సంతోషం. సలామాలేఖుం.

ఈశ్వరయ్య: (ఆశ్చర్యంగా) మీకు విశ్వం తెలుసా?

సలాముద్దిన్: ఓ! మాలూమ్‌హై....(మాలతికేసి తిరిగి)ఈ లడ్కీ..

ఈశ్వరయ్య: సాయిబుగారూ, మీకుకూడా విశదంగా చెప్పాలి కాబోలు. సరే వినండి నా కొడుకున్నాడే—విశ్వం. వట్టి ఋంత. ఈ పిల్లనే తప్ప ఇంకెవర్నీ చేసుకోనని భీష్మించుకుని ఆ స్తిపాస్తులన్నీ వదులు కోటానికి సిద్ధమయ్యాడు....వాణ్ణి పరీక్ష చేయాటానికే నేనలా అన్నాను కాని నాకు మాత్రం తెలియదటండీ....మనకు సంపాదించే ఆస్తులు శాశ్వతమా! ముందో వెనకాలో, ఏ దొంగ వెధవో గుటకాయస్వాహా చేస్తాడు. లేకపోతే గవర్నమెంటే నీకింతకంటే వద్దురా నాయనా అంటుంది. అదీ కాకపోతే మనమే గుటుక్కుమంటే మనతోపాటు ఏం తీసుకుపోతాం? అందుకే ఒప్పేసుకున్నాను. (పురుషోత్తాన్నీ, సావిత్రినీ గమనించి కొంచెం ఆదుర్దాగా) పురుషోత్తం, మీరిద్దరూ ఏదోలా వున్నారేం ఈ ఇన్స్‌పెక్టరుగారు ఏమైనా చీకాకు తేలేదుకదా!

సలాముద్దీన్: (విరగబడి నవ్వుతూ) వెధవ ఆస్తికోసం విడాకులిచ్చుకుంటే చీకాకులురాక ఇంకే మొస్తాయి! అన్నయ్యా, వదినా జైలుకన్నా

వెళతారంట కాని,విడాకులు మాత్రం దృఢంగా ఉండిపోవాలంటున్నారు. అది కొంచెం కనుక్కోండి నాన్నగారూ!

ఈశ్వరయ్య: (నిశ్చేష్టుడై) ఎవరూ?! విశ్వం!!

సావిత్రి, పురుషోత్తం: (ఒకేసారి) విశ్వం!! నువ్వా!

విశ్వం: (వేసిన వేషం తీసేస్తూ) అవును నేనే - మీకు తగదని ఎంత చెప్పినా వినకుండా కోర్టులెక్కి సంసారం నాశనం చేసుకోవటానికి తయారైతే నేను చూస్తూ వూరుకుంటాననుకున్నారా? మీ విడాకుల వింతనాటకంలో నేనూ, మాలతీ ఒక అంతర్నాటకం ఆడాము.

సావిత్రి: భలేవాడివే! అయితే నిన్న మధ్యాహ్నం మాలతి మాట్లాడింది నీతోనేనన్న మాట....

పురుషోత్తం: శ్రీరామా! నేను విన్నదీ పొరపాటే! ఆ కేరింతలూ ఆ మాటలూ, పాటలూ, మాలతితోనా?

ఈశ్వరయ్య: ఏమిటీగోల! మీ కందరికీ ఏదో పిచ్చిపట్టినట్లు, తలా తోకా లేకుండా మాట్లాడుతున్నారు. (కొంచెం గంభీరంగా, సావిత్రి పురుషోత్తంతో) మీ వ్యవహారం ఏమీ బాగోలేదు. ఇంత బ్రతుకూ బ్రతికి విడాకులేమిటి....ఇప్పు డనువిస్తున్నారు—అంతేనా?

పురుషోత్తం: అంతా నా తప్పే! వెధవ ఆస్తికోసం ఇంత పిచ్చిపని చేశాను.

సావిత్రి: క్షమించు మామయ్యా. నా బుద్ధి లోపించింది. ఏ హైందవ నారీ చెయ్యరాని పని చేశాను. అంతా నా ఖర్మ. [ఏడుస్తూ] చివరికి నా కన్న బిడ్డ కూడా దూరమైపోయింది.

ఈశ్వరయ్య: (ఆదుర్దాగా) ఏమిటీ? అరుణ ఏమైంది! ఏదీ? పిల్ల ఎక్కడ!

సావిత్రి: (గట్టిగా ఏడుస్తూ) అరుణ కనబడటంలేదు. మా యిద్దరి మధ్య గొడవలవల్ల దాని లేతమనస్సు చెదిరిపోయి తట్టుకోలేక ఎటో వెళ్ళిపోయింది. పాపాత్మురాలిని! నన్ను భగవంతుడు కూడా క్షమించడు.

(వెంకటేసు, అరుణ వస్తారు.)

వెంకటేసు: అమ్మగారూ, అరుణ ఎక్కడికీ పోలేదమ్మా. మీ బిడ్డని తీసుకోండి, బాధ పడకండి.

అరుణ: (తల్లి దగ్గిరకి పరుగెత్తుతూ) అమ్మా! అమ్మా!

సావిత్రి: (అరుణని ఎత్తుకుని ముద్దె పెట్టుకుంటూ) అరుణా నా బంగారుతల్లీ! నువ్వెక్కడి కెళ్ళావో తెలియక నాగుండెలు బ్రద్దలై పోతున్నాయి.

అరుణ: (భయంగా) నాన్నగారు....

సావిత్రి: నువ్వేం భయపడకమ్మ మీ నాన్నగారు ఏమీ అనరులే! నువ్వు కనబడలేదని చాలా బాధపడుతున్నారు. మీ నాన్న దగ్గిరికి వెళ్ళు.

పురుషోత్తం: (అరుణని దగ్గిరకు తీసుకుంటూ)రామ్మా రా, అలా చెప్పకుండా వెళ్ళిపోయావేమిటమ్మా?

అరుణ: (ఏడుస్తూ) నాకు చాలా భయం వేసింది నాన్నగారూ, వెంకటేసు వుంటాడని బయటికి వెళ్ళాను.

పురుషోత్తం: (ఆశ్చర్యంగా) వెంకటేశా!

అరుణ: వెంకటేసు వూరు వెళ్ళలేదు నాన్నగారూ. నన్నివిడిచిపెట్టి వుండలేక రాత్రిళ్లు ప్రక్కింటి అరుగుమీదే పడుకుంటున్నాడు.

వెంకటేసు: అవునుబాబూ, నా చిట్టితల్లిని ఎలా విడిచిపెట్టి పోగలను? మళ్ళీ మంచిరోజులు రావా అని మీకు తెలియకుండా మాయోడి దగ్గిర తల దాచుకున్నాను. (సావిత్రితో) నేను చేసింది తప్పుకాదు కదమ్మా?

సావిత్రి: నువ్వెంత మంచివాడివి వెంకటేసు! నా పిల్లని కాపాడి నాకు బాగా బుద్ధి చెప్పావు. ఆస్తి భ్రమలో పడి నిన్ను అనరాని మాట లన్నాను. పాడు ఆస్తి! నా జీవితమే నాశనమై పోయింది.

ఈశ్వరయ్య: ఇప్పటికైనా మించిపోలేదు. ఆ విడాకులేవో ఉప సంహరించుకుంటే సరిపోతుందిగా! ఏడి? ఆ నరహరిని పిలుచుకురండి.

నరహరి: (ప్రవేశిస్తూ) ఇక్కడే వున్నానండి....

విశ్వం: మళ్ళీ తగలడ్డావూ? (ఈశ్వరయ్యతో) ఉపసంహరించుకో డానికి విడాకులు అరిటాకులు కావు నాన్నగారూ. డైవోర్సు తీసుకున్న భార్యా భర్తలూ మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని చట్టంలో వుంది. ఈ మాత్రానికి నరహరి ఎందుకూ?

ఈశ్వరయ్య: మరి ఆలస్యం ఎందుకూ? ప్లీడరు అక్కర లేకపోతే పురోహితుడికి కబురుచేద్దాం. ఎవరో ఒకరు! (చుట్టూ పరీక్షగా చూచి (అరే!

యింకా యీ గోడ ఎందుకుఁ పడగొట్టి పారేయండి. పీడ విరగడై పోతుంది....

విశ్వం: అవును నాన్నగారూ, మీ చేతులతో ఈ పాడుగోడని పడెయ్యించండి.

(వెంకటేసు రెండు గునపాలు తెచ్చి ఒకటి విశ్వానికి ఇస్తాడు.)

ఈశ్వరయ్య: ఊఁ! చూస్తారేంఁ విశ్వం, నువ్వుకూడా ఒక పట్టు పట్టు....(వెంకటేసూ, విశ్వం గోడ కొట్టేస్తూంటారు.)

సావిత్రి: (నీరసంగా తూలుతూ పురుషోత్తంతో) నా కళ్ళు తిరుగుతున్నాయండి.

పురుషోత్తం. (పట్టుకుని) ఫరవాలేదులే, ఇలారా కూర్చో.

(తీసుకెళ్ళి, ఆప్యాయంగా కుర్చీలో కూర్చోబెడతాడు.)

అరుణ: (ఆదుర్దాగా) అమ్మా, నీకు ఒంట్లో ఎలావుంది?

పురుషోత్తం: (చిరునవ్వుతో) ఏమీ ఫరవాలేదమ్మా, అదే సర్దుకుంటుంది.

సావిత్రి: (పిగ్గుతో తల వంచుకుంటుంది.)

ఈశ్వరయ్య: (పడిపోయిన గోడలో వున్న అలమారా దగ్గిరకి వెళ్ళి తలుపు తీసి ఆశ్చర్యంగా) అరేఁ ఇదేమిటిఁ

విశ్వం: (నవ్వుతూ) అదే నాన్నగారూ, సావిత్రమ్మ వదినకి ఎందుకు కళ్ళు తిరిగాయిఁ ఆవిడ ఇప్పుడు ఎందుకు పిగ్గుపడుతోందిఁ అసలు సంగతి ఈ అలమారాలోని రహస్యద్వారంలోనే వుంది. అది మా అన్నయ్యగారి అంతఃపుర రహస్యం!

ఈశ్వరయ్య: (నెమ్మదిగా అర్థం చేసుకుని విరగబడి నవ్వుతూ) ఓహో! ఇదా సంగతీ!!

(అందరూ నవ్వుతుంటే నేపధ్యంలో సంగీతం)

మేమాడిన ఈ నాటకం - విడాకుల వింత నాటకం!
ఆలుమగల పిత లాటకం - అంతా ఒక బూటకం!
జీవితపు నిత్య నాటకం - అంతులేని జగన్నాటకం!!

(పూర్తిగా తెర)

ಕರ್ನಾಟಕ

పాత్రలు

డాక్టర్ భాస్కర్.

సుమతి	....	ఆయన భార్య
రామయ్య	....	వాళ్ళింట్లో నౌకరు
గోపి	....	తెగిపోయిన గాలిపటం
లింగయ్య	....	గోపి తండ్రి
వాణి	....	సంఘ సేవకురాలు
రంగనాయకులు	....	ఘరానా దొంగ

పోలీసు ఇన్‌స్పెక్టర్

కానిస్టేబిల్

[కథానాయకుడు: రెండేళ్ళ క్రితమే ప్రమాద వశాత్తూ మేడమీద నుంచి పడి మరణించిన రాజా.]

ఉపక్రమణిక

[రాత్రి: డాక్టర్ భాస్కర్ మేడమీద హాలు. ముచ్చటగా అలంకరించబడి వుంటుంది. ఒక ప్రక్కన సోఫాలూ, తివాసీ, మధ్యలో చిన్న బల్ల, పువ్వులతోట్టి. మూలగావున్న బల్లమీద వీణ. మరొక ప్రక్కన డైనింగ్ టేబిల్, రెండు కుర్చీలు; మూడోకుర్చీ పిల్లవాడు కూర్చుని తినటానికి వీలుగా ఎత్తుగా వుంటుంది. ఒక అలమారా, దాన్నిండా పిల్లల ఆటవస్తువులు. కుడివైపునుండి బైటికి తలుపు. ఎడమవైపున, లోపల గదిలోకి ఇంకొక తలుపు. రెండు తలుపులకి మంచి పరదాలు. ఎదురుగా, అంటే, భోజనాల బల్ల దగ్గిరగా ఒక కిటికీ. ఊచలులేవు. అందులోంచి, వీధిలోని దీపపు వెలుగులో ఎలక్ట్రిక్ తీగలు బాగా కనబడుతున్నాయి.

సుమతి సోఫాలో కూర్చుని కూని రాగంలో జోలపాడుతూ, రాజాని నిద్ర పుచ్చటానికి ప్రయత్నిస్తూ వుంటుంది. పిల్లవాడి వయస్సు ఐదారేళ్ళు. సుమతి వయసు ఇరవైయారు, ముప్ఫయి మధ్య. చాలా చక్కనిది. ఆమె విశాల నేత్రాలలో ఆనందం, తృప్తి వెల్లి విరుస్తున్నాయి.

సుమతి రాజా నిద్రపోతున్నాడనుకుని లేస్తుంది.]

సుమతి: చల్లగాలి వేస్తోంది. ఎందుకైనా మంచిది. దుప్పటి తెస్తా.

[సుమతి లోపలికి వెళ్తుంది. నిద్ర వస్తున్నా, ఆపుకోటానికి ప్రయత్నిస్తున్న రాజా, కళ్ళు తెరచి చూస్తాడు.

బయట రివ్వున గాలి. రెపరెపలాడుతూ, ఒక గాలిపటం ఎలక్ట్రిక్ తీగలలో చిక్కుకుంటుంది]

రాజా: అరే! [గభాలునలేచి, కిటికీలోకి ఎక్కి, గాలిపటాన్ని తీయటానికి ప్రయత్నిస్తూ వుంటాడు. ఇంతలో సుమతి వస్తుంది. గాభరాగా, 'రాజా!' అని కేకవేస్తుంది. కంగారులో రాజా కిటికీలోంచి బయటకి పడిపోతాడు]

సుమతి: బాబూ! బాబూ!! [హృదయ విదారకంగా, ఆరుస్తూ, కిటికి దగ్గిరకు పరుగెత్తుతూ, కూలిపోతుంది. నేపథ్యంలో విషాదకర మైన సంగీతం-చీకటి.]

మొదటి అంకం

[రెండేళ్ళ తరువాత. సాయంత్రం. డాక్టర్ భాస్కర్ యిల్లు అంతా ఉపక్రమణలో వున్నట్టే ఉంటుంది. అలమారుమీద మాత్రం రాజాఫొటో దానికి లాకెట్టుతో సహా ఉన్న బంగారుగొలుసు అలంకరణ; కిటికీలోంచి సుదూరంలో మైదానం. అందులో పిల్లలుగాలిపటాలు ఎగరేస్తూ, మధ్య మధ్య కేరింతలు కొడుతూ, పరుగెడుతూ వుండటం, చూచాయగా తెలుస్తూ ఉంటుంది. తెరతీసే సమయానికి సుమతి కిటికీ దగ్గర నిలబడి దీర్ఘంగా ఆలోచిస్తూ వుంటుంది. మనిషి బాలా మారిపోయింది. ముఖంలో కళలేదు; భరింపరాని ఆవేదన, అనంతమైన దైన్యం ఆమె కళ్ళల్లో కనపడుతున్నాయి. నే పథ్యంలోంచి విషాద సంగీతం. వంటింటిలోంచి నౌకరు రామయ్య వస్తాడు. అతడికి రమారమి యాభై సంవత్సరాల వయసుంటుంది. కొంచెం పొట్టిగా వుంటాడు. నెరసిన జుట్టు. మనిషిలో విశ్వాసపాత్రత కొట్టవచ్చినట్టుంది.]

రామయ్య: అమ్మగారూ

సుమతి: [ఉలికిపడి] ఏమిటి?

రామయ్య: ఈ సాయంత్రం టీపార్టీకి వెళ్ళాలి కదమ్మా? మీరు మర్చిపోయారేమో, అయ్యగారు వచ్చేవేళయింది.

సుమతి: [వినిపించుకోకుండా] రామయ్యా, అటుచూడు. ఆ తెల్లటి మబ్బు తునకలమధ్య గాలిపటాలెలా నాట్యం చేస్తున్నాయో. [బాధగా] రాజా గాలిపటాలంటే కొట్టుకుపోయేవాడు. వాడేవుంటే ఈనాడు పిల్లలందరితో పాటూ గంతులువేస్తూ వుండేవాడు కదా. [అకస్మాత్తుగా కోపంతో ముఖం జేవురిస్తుంది.] పాడుపటాలు, రాజానిచూస్తూ చూస్తూ ఉండగానే పొట్టనపెట్టుకున్నాయి, [గద్గదికంగా] భగవంతుడు నా హృదయంలో ఎంత చిచ్చుపెట్టాడు, నాకసలు రాజానియ్యకుండా వుంటేనే బాగుండేది.

రామయ్య: అమ్మా, అవన్నీ జ్ఞప్తికి తెచ్చుకొని మీరు మనసు

పాడుచేసుకుంటున్నారు. ఇచ్చేహక్కూ, తీసుకునే హక్కూ ఆ పైవాడిది, ఎంత బాధపడినా పోయిన వాళ్ళని మనం తీసుకుని రాలేం కదా!

సుమతి: [చిరాకుగా] పోయాడు. పోయాడని మీరందరూ ఒకటే మాట. నారాజా ఎక్కడికి పోయాడు? ప్రతిక్షణం నా కళ్ళముందే మెదులుతున్నాడు. నా చెవుల్లో అహర్నిశలూ వాడిముద్దు మాటలే వినబడుతున్నాయి. [కళ్ళనీళ్ళతో] నాకీలోకంలో రాజాతప్ప ఎవరున్నారు?

[రామయ్య ఆమె బాధను అర్థం చేసుకున్నట్లు తల ఊపుతూ ఏదో అనబోతాడు కాని, ఇంతలో కాలింగుబెల్ మోగుతుంది]

రామయ్య: అదుగో, అయ్యగారు వచ్చేసినట్లున్నారు. [వెళ్ళి తలుపు తీస్తాడు] ఓహో మీరా! దయచేయండి [గిరుక్కుమని లోపలికి వెళ్ళిపోతాడు. వాణి ప్రవేశిస్తుంది. ఆమెకు దాదాపు సుమతివయసే ఉంటుంది. చాలా ఆధునికంగా అలంకరించుకుంది. మంచి రూపురేఖలు. చదువుకున్నది. సంఘసేవకురాలు]

వాణి: [హడావిడిగా] హల్లో, సుమతీ, ఇంకా రెడీకాలేదేమిటి?

సుమతి: [పరధ్యానంగా కిటికీలోంచి చూస్తూ పలకదు]

వాణి: [దగ్గరగా వచ్చి భుజం తట్టుతూ] ఏమిటి సుమతీ, లోకంలో వున్నట్లులేవే?

సుమతి: [నిట్టూరుస్తూ] నాకు అంత అదృష్టం కూడానా? ఈ లోకంలో వున్నాను కాబట్టే బాధ. ఆ పార్కులో చూడు రంగు రంగుల గాలిపటాలు ఎగరేస్తూ పిల్లలు ఎంత ఆనందంగా గంతులేస్తున్నారో. వాళ్ళి పాడులోకంలోనే వున్నారంటావా? ఆ గాలిపటాలతోపాటు వాళ్ళ చిన్నారి మనసులుకూడా వినువీధుల్లో ఎక్కడెక్కడో ఎగిరిపోతున్నాయి. అందుకే వాళ్ళకంత సంతోషం. కాని, నేనుమాత్రం పంజరంలో చిక్కిపోయిన పక్షిలా పడివున్నాను. నాకెప్పుడో విముక్తి?

వాణి: నీవు రోజు రోజుకీ ఆవేదనతో కుంగిపోతున్నావు. నీబాధ చూస్తూ భాస్కర్‌కూడా ఎంత కుమిలి పోతున్నాడో నేను గమనించక

పోలేదు. కాని ఒక్కమాట వింటావా? ఇలా గతాన్ని మరిచి పోకుండా మనస్సులు పాడుచేసుకుని మీ ఇద్దరి జీవితాల్లో అంతులేని నైరాశ్యం తెచ్చి పెట్టుకోవటం ఏమీ బాగోలేదు. నేను శుష్కవేదాంతం చెబుతున్నానను కుంటున్నావేమో.

సుమతి: శుష్కమైంది జీవితంగాని, వేదాంతం కాదు. నేనూ కాపరానికి వచ్చిన కొత్తలో తియ్యని కలలు కన్నాను. జీవితంలో ఏదో మధురాతి మధురమైన అనుభూతి వుందనీ, అందులో శాశ్వతమైన సంతోషం లభిస్తుందనీ ఊహించు కున్నాను. కాని నా కలలన్నీ కల్లలుచేసి వెళ్ళిపోయాడు రాజా. నువ్వెన్నన్నా చెప్పు, నాకిప్పుడు అంధకారం తప్ప వేరేంలేదు.

వాణి: సుమతీ, నీకు తగిలినగాయం స్వల్పమైనదనీ, అది చులాగ్గా మాని పోతుందనీ నేనెలా అనగలను? తల్లివి కాబట్టి ఈ కడుపుకోత జీవితాంతం ఉండేదే. అయితే, పోయిన వాళ్ళతో ముడివేసుకుని ఎంతకాలం ఇలా బాధపడతావు? ఈ సంసారంలో నీక్కూడా ఒక ముఖ్యమైన బాధ్యత వుందని మరిచి పోతున్నావు.

సుమతి: నన్నేం చేయమంటావు వాణీ? ఎంత ప్రయత్నించినా నా మనసు ఈ విపరీతమైన ఆఘాతానికి తట్టుకోలేక పోతూవుంది. ఒకక్షణం కళ్ళు మూసుకుంటే రాజాయే కనబడతాడు. వాడి నెలాగైన మర్చిపోవాలనీ, మనసు రాయిచేసుకోవాలనీ ఎంత ప్రయత్నిస్తున్నానో భగవంతుడికి తెలుసు.

వాణి: పోనీలే, ఆ సంగతి ఇప్పుడెందుకు? పద, తయారవుదువు గాని.

సుమతి: [ఆశ్చర్యంగా] తయారా? ఎందుకూ?

వాణి: అసలు సంగతే మర్చిపోయావన్నమాట! ఈవేళ విశ్వనాధం గారింట్లో వాళ్ళబ్బాయి పుట్టిన రోజు పండగ. టీపార్టీకి సరదాగా కలిసి వెళ్దామని భాస్కర్ చెప్పాడు. [గడియారం చూస్తూ] భాస్కర్ కూడా వచ్చేస్తుంటాడు. నువ్వు త్వరగా రెడీ అయితే బాగుంటుంది.

సుమతి: పుట్టిరోజా! [ఉలిక్కిపడి] ఔనౌను. పూర్తిగా మర్చిపోయాను. [ఏదో ఆలోచిస్తూ లోపలికి వెళ్తుంది]

వాణి: త్వరగా చీర మార్చుకురా! మనం గంటలకొద్దీ ముస్తాబులు చేస్తామని ఎగతాళి చేస్తాడు భాస్కర్.

[వాణి వీణ దగ్గర కూర్చుని మీటుతూ పాడుకుంటుంది. డాక్టర్ భాస్కర్ ప్రవేశించడం ఆమె గమనించదు. భాస్కర్ వయసు 35 వుంపుంటుంది. నిండైన విగ్రహం. చదువు, సంస్కారం ఉట్టిపడుతుంటాయి. లోపలికి వచ్చిన భాస్కర్ అచేతనంగా నిలబడి పరవశత్వంలో తనని తానే మర్చిపోతాడు. పాట అయిపోగానే వాణి వెనక్కి తిరిగి పిగ్గుం పడుతుంది.]

భాస్కర్: [నెమ్మదిగా చప్పట్లు కొడుతూ] చాలా బాగుంది! వాణీ, నువ్వింత బాగా పాడతావని నాకు తెలియదే.

వాణి: [చిరుపిగ్గుతో] అభిమానం కొద్దీ అలా అన్నావు కాని, నాపాటకేంలే.

భాస్కర్: ఒకప్పుడు సుమతి పాడుతుంటే నన్ను నేను మర్చిపోయే వాడిని, ఇప్పుడు సుమతి పాడటమే మానివేసింది. నేను చాలా దుర దృష్టవంతుణ్ణి.

వాణి: [జాలిగా] నీ హృదయంలో రగులుతూవున్న అశాంతి నాకు పూర్తిగా తెలుసు భాస్కర్. సుమతి రోజురోజుకూ కుంగిపోతోంది. ఎలాగైనా ఆమెలోని దిగులు పోగొట్టి మళ్ళీ మనలో ఒకదానిగా చెయ్యాలని నాకు చేతనయినంత వరకూ ప్రయత్నిస్తూనే వున్నాను.

భాస్కర్: [నిస్పృహగా] ఏం ప్రయత్నమో ఏమిటో, ఈ ఇంట్లో ఒకప్పుడు ఆనందం వెల్లి విరిసింది. రాజా ముద్దు మాటలు వింటూ, వాడి చిలిపిచేష్టలు చూస్తూ మురిసిపోయే వాళ్ళం. వాడి అల్లరితో ఈ ఇల్లు కళ కళ లాడుతూ వుండేది. సుమతి ఎప్పుడూ వాడితో ఆడుతూ పాడుతూవుంటే రోజులు అలాగే గడచిపోతా యనుకునేవాణ్ణి. కాని అంతా తారుమారై

పోయింది. [కొంచెం నెమ్మదిగా] ఒక్కొక్కప్పుడు హాప్పటల్లో పన్నై పోయిం తరవాత యింటికి రావాలంటేనే నాకు ఏదో చెప్పరాని బాధగా ఉంటుంది.

వాణి: [దగ్గరగా వెళ్ళి] నువ్వుకూడా ఇలా నీరు గారిపోతే ఎలా? సుమతిని ఒకదారికి తేవడం నీ కర్తవ్యం.

భాస్కర్: [కొంచెం కోపంగా] నా కర్తవ్యమా?

వాణి: నన్ను అపార్థం చేసుకోవద్దు. భార్యా భర్తల్లో ఒకరు మానసికంగా బలహీనంగా ఉన్నప్పుడు మరొకరికి బాధ్యత వుంటుందని చెప్తున్నాను. ఈ పరిస్థితులలో నువ్వు సుమతిని పూర్తిగా అర్థం చేసుకుని ఆమె బాధని తీర్చడానికి ప్రయత్నించాలి. నువ్వు ఏ మాత్రం తొందరపడ్డా చాలా విపరీత పరిణామాలు రావచ్చు.

భాస్కర్: అందుకనే, నేనెంతో ఓర్పుతో ఆమెకు బాధ కలగకుండా మసలుకుంటున్నాను. అంతకంటే నేనేం చేసేది? ఆమె మనసు చిన్నా భిన్నమయిపోయింది. తన బాధేకాని ఇతరులకి కూడా బాధ వుంటుందని ఆమెకు తెలియటం లేదు. ఈ సమస్య నీకు తెలుసును కాబట్టి నన్నర్థం చేసుకోగలిగావు. అలాగే సుమతికూడా అర్థం చేసుకుంటే నేను అదృష్టం వంతుణ్ణే.

వాణి: తెలిసినా నేనేం చెయ్యగలను? నీకు ఏ విధంగానూ మనశ్శాంతిని ఇవ్వలేను గదా?

రామయ్య: [హడావిడిగావచ్చి] అరే బాబు గారొచ్చారే? ఉండండి. టీ తీసుకొస్తాను.

భాస్కర్: ఇప్పుడు టీ ఎందుకు రామయ్యా? విశ్వనాధం గారింటికి టీ పార్టీకి వెళ్తామని అమ్మగారిని రెడీగా ఉండమన్నాను. పైపైపోయింది. త్వరగా రమ్మని చెప్పు.

రామయ్య: అలాగేనండి. [వెళ్ళిపోతాడు. ఇంతలో సుమతి వస్తుంది.]

వాణి: అదేమిటి సుమతీ! నువ్వు రెడీ అవుతున్నావని అనుకున్నాను. బట్టలు మార్చుకోలేదేం! విశ్వనాధంగారి అబ్బాయి పుట్టినరోజు పందక్కు వెళ్దామనుకున్నాంగా!

సుమతి: [భాస్కర్‌తో, దీనంగా] ఎలా వెళ్ళనండీ.

భాస్కర్: ఏం! ఎలా ఏమిటి! మనకారులో వెళ్దాం.

సుమతి: [వినీవిననట్లు భాస్కర్‌వైపు తిరిగి] ఏమండీ, మీకుకూడా జ్ఞాపకం లేదా! ఈవేళ ఎవరిపుట్టిన రోజను కుంటున్నారు!

భాస్కర్: [మాట్లాడడు.]

సుమతి: అప్పుడే మర్చిపోయారా! రెండేళ్ళనాడు ఇదేరోజు ఎంత వైభవంగా రాజా పుట్టినరోజు చేసుకున్నాం!

వాణి: ఈ రోజు రాజా పుట్టినరోజా.....

సుమతి: అవును వాణీ. ఆనాడు నువ్వేగా దగ్గర నిలబడి వాడిచేత ఐర్త్‌డే కేక్ కోయించావు! ఏడు కొవ్వొత్తులూ ఒక్కసారిగా ఉఫ్‌మని ఆర్పేస్తే మనమంతా ఎంత సంబర పడ్డామో జ్ఞాపకంలేదూ! నువ్వు మరిచి పోయావేమో.....ఆ నాకింకో సంగతి కూడా జరిగింది. రాజాకొసం భాస్కర్ ఒక సూట్ తెచ్చారు.....

వాణి: అవునవును. అది రాజాకి పెద్దదై పోయింది కదూ.

సుమతి: అనువు. పాపం భాస్కర్ చాలా చిన్న బుచ్చుకున్నారు. పోసిలెద్దురూ, వచ్చే పుట్టినరోజుకి జాగ్రత్తగా దాచిపెడతా నన్నాను. [అకస్మాత్తుగా కళ్ళనీళ్ళతో] కాని, ఆ రోజు రానేలేదు. [ఇంతలో టెలిఫోను గణగణ మోగుతుంది. భాస్కర్ ఫోను తీసుకుంటాడు]

భాస్కర్: హల్లో, తొమ్మిదో నంబరు వార్డా.....ఎవరు! నర్సమ్మలా! న్యుమోనియా కేసేగా! అలాగే, ఇప్పుడే వస్తాను. [టెలిఫోను పెట్టేసి] నేను ఆర్జంటుగా వెళ్ళాలి. పిల్లవాడు చావుబతుకులమీద వున్నాడు.

వాణి: మరి విశ్వనాధం గారింటికో!

భాస్కర్: నాకు వీలుకాదు వాణీ.

సుమతి: పిల్లవాడా, పాపం. తొందరగా వెళ్ళండి, వాడి తల్లిరాత ఎలావుందో.

భాస్కర్: వాణీ, నీకు చాలాశ్రను ఇచ్చాంకదూ, విశ్వనాధం గారిల్లు దారిలోనేఉంది. నిన్నక్కడ డ్రాప్‌చేస్తా. [కొంచెం నవ్వుతో] డాక్టర్లతో ముడిపెటుకుంటే ఇదేతంటా.

వాణి: [చిరునవ్వుతో] అది నాకుతెలుసు. పార్టీకేంలే. ముందు పిల్లవాడి సంగతి చూడు. సుమతి, మరి నేను వస్తాను.

రామయ్య: [ఆదరా బాదగా టీ తీసుకొస్తూ] బాబూ—యిదిగో టీ తీసుకోండి,

భాస్కర్: ఇప్పుడు వైంలేదు, రామయ్యా!

[భాస్కర్, వాణీ వెళ్ళిపోతారు. సుమతి పరధ్యానంగా కిటికీ దగ్గరికి వెళ్ళిచూస్తూ ఉంటుంది,]

రామయ్య: టీ తీసుకోండమ్మా!

సుమతి: వద్దు. లైటార్పేసి నీపని చూసుకో.

[రామయ్య నిస్పృహగా టీ తీసుకువెళ్ళి పోతాడు. కిటికీలో ఎగురుతున్న గాలిపటం.]

సుమతి: [విపరీతమైన ఆవేదనతో]

పడగలు, గాలిపడగలు!....బుసలు కొడుతున్న పాము పడగలు!! నాబాబుని కాటేసిన పడగలు [భరించలేని బాధతో] రాజా! [కెవ్వున కేక వేసి పడిపోతుంది.... ....లోపలినుంచి రామయ్య "అమ్మా" అని పరిగెత్తుకు వస్తాడు..... ....సంగీతం-చీకటి]

[కొంచెం వ్యవధి]

[యింకో గంట, గంటన్నర తరవాత సుమతి అచేతనంగా సోఫాలో కూర్చుని వుంటుంది. భాస్కర్, గోపీ వస్తారు. గోపీకి ఏడెనిమిది ఏళ్ళుంటాయి. చిరిగి, మాసిపోయిన బట్టలు—జుట్టుకళ్ళమీద పడుతూ వుంటుంది—మాటల్లో యాస—ఫోటోలోఉన్న రాజాకి మంచి పోలిక.

కొంచెవాడైన కొత్త యింట్లోకి రావడానికి భయపడుతున్నట్లు కనపడుతాడు.]

భాస్కర్: సుమతీ, ఎవరు వచ్చారో చూశావా? [గోపీతో] రాగోపీ ఏమీ భయంలేదులే [గోపీ తత్తర బిత్తర చూస్తుంటే] నేను చెప్తున్నానుగా ఇది నీ యిల్లే అనుకో, రా....ఈ సోఫాలో కూర్చుందువుగాని. [సుమతితో] అదేమిటి సుమతీ ఇంత పరధ్యాన్నమైతే ఎలా? ఇటు చూడు, గోపీ వచ్చాడు.

సుమతి: [అనాలోచితంగా] గోపీ! ఎవ్వరు? [చూచి వెనక్కి తగ్గి కొంచెం చీదరగా] ఛీ, వీణ్నెక్కడనుంచి పట్టుకొచ్చారు?

భాస్కర్: అలా చూస్తావేం సుమతీ? గోపీ అంటే ఎవరను కున్నావు ఇందాక టెలిఫోను రాలేదూ. ఒక సీరియస్ కేసువుందని—ఆ నరిపిము పీడిఅన్న, పాపం ఆ పిల్లవాడు చావుబ్రతుకుల్లో వున్నా తల్లి తండ్రు లెవ్వరూ రాలేదు. యిందాకే అయిపోయిం దనుకున్నాను. రెండు ఇంజె క్షన్లు ఇచ్చింతరువాత కొంచెం తేరుకున్నాడు. కాని యింకా పరిస్థితి అపాయకరంగానే ఉంది, వాడెలా ఉన్నాడో చూచిరమ్మని గోపీని వాడి తండ్రి ప్రొద్దున్నే పంపాట్ట, ఏమీ తెలియక వరండాలో పిచ్చివాడిలా తిరుగుతూ వుంటే తీసుకొచ్చాను. నిజమేనా గోపీ! [గోపీ కిటికీలోంచి బైటికి చూస్తూ ఉంటాడు]

గోపీ: నిజమేనండీ అయ్యగారూ. మా నాయన అన్నను చూసుకోరా అని పొద్దుగాల పంపిచుండు—లోపలికి పోతానంటే దవాఖానా గేటు దగ్గర దర్వానుగాడు అటకాయించేశాడు ముసలి ముండాకొడుకు. దవాఖానా అంతా వాడిదే అనుకున్నాడు. కాని నేను మాత్రం అంత తెలివి తక్కువ వాణ్ణా? వాడు వేరే దిక్కు చూస్తుంటే లోపలి కెళ్ళిపోయాను. [నవ్వుతూ] వాడొకటే గోల.

భాస్కర్: అయితే నువ్వు ప్రొద్దున్నుంచీ ఏమీ తినలేదన్నమాట.

గోపి: లేదండి.

భాస్కర్: అయ్యో పాపం! గోపికి కొంచెం భోజనం పెట్టించు సుమతీ.

సుమతి: [ఉలిక్కి పడి] అలాగే—రామయ్యా, రామయ్యా! ఈ పిల్లవాడ్ని తీసుకెళ్ళి తినటానికి ఏమన్నా పడెయ్యి.

రామయ్య: అలాగేనమ్మా. [వెళ్ళిపోతాడు.]

భాస్కర్: కొంచెం ఉండు. ముందు గోపికి స్నానం చేయించి శుభ్రమైన బట్టలు వేస్తే బాగుంటుందేమో. ఏమంటావు గోపీ, తొందరగా స్నానం చేసి వస్తావా?

గోపి: [ఉత్సాహంతో] సరేనండి అయ్యగారూ.

భాస్కర్: ఏం అలా ఆగిపోయావు?

గోపి [నసుగుతూ] ఏమీ లేదండి.

భాస్కర్: చెప్పు గోపీ, నీకిక్కడేమీ భయం లేదని చెప్పానుగా.

గోపి: నాకు వేరే బట్టలు లేవండీ. ఇవే వేసుకుంటాను.

సుమతి: [కొంచెం తొందరపాటుగా] నీ యిష్టం. ఇక్కడ నీకు చీనీ చీనాంబరాలు కట్టబెట్టడాని కెవ్వరూ లేరు.

గోపి: అదేమిటండీ చీనీ—చీ....

సుమతి: [చిరాకుగా] నీకవన్నీ తెలియవులే....

[వెటకారంగా] రామయ్యా. వీణ్ణి తీసుకువెళ్ళి స్నానం చేయించు. [గోపి బయటకు పోబోతాడు.] అదేమిటీరా బయటికి వెళ్తావేం? ఇటు....

గోపి: [ఆశ్చర్యంగా] నల్లా బయట గదండీ వుంట? [ఏదో జ్ఞప్తికి రాగా] మొన్న మా గూడెం దగ్గర భలే తమాషా జరిగింది. కొంచెం వళ్ళు తడుపుకుందామని దోస్తులతో వెళ్ళాను. కాని ఆడోళ్ళు ఊరుకుం టారా? దొంతర్లగా పెట్టేసినారు బిందెలు. కొంచెం జరపండీ అంటే నానా తిట్లు. తాగటానికి నీళ్ళు లేవు; ఈ వాజమ్మలు స్నానం చేస్తారంటని మూతులు యిరుచుకున్నారు. [ఆగి] వాళ్ళకింత కావరమా అని.... అయ్య గోరూ, నేనేం చేశానో తెలుసా....

సుమతి: చనువిచ్చారని యిష్ట మొచ్చినట్లు మాట్లాడుతున్నాడు.... వింటుంచే నా వంటిమీద తేళ్ళూ జెర్రెలూ పాకినట్లుంది. [కొంచెం పెద సరంగా] ఈ పురాణమంతా మనం ఓపిగ్గా వినాల్సిందేనా?

భాస్కర్: కొంచెం ఓపిక పట్టు సుమతీ. [గోపీతో] ఏం చేశావేమిటి?

గోపి: ఏం చేశానా? గులేలు తీసుకుని నాలుగు కుండలు టపాటపా బద్దలు గొట్టాను. ఇక చూడాలి తమాషా! వాళ్ళు ఒకటే గోల. నేనప్పుడు పారిపోయి వచ్చేశాను.

భాస్కర్: భలే వాడివే! అలా చెయ్యొచ్చా....తప్పు కదూ? పోనీలే వెళ్ళి స్నానం చేసిరా. [గోపి రామయ్య వెంట వెళ్తాడు] సుమతీ, గోపి కేమన్నా బట్టలు తీసిపెట్టు.

సుమతి: బట్టలా? నుంచున్న పళంగా బట్ట లెక్కడనుంచి వస్తా యండీ....

భాస్కర్: [సంకోచిస్తూ] రా ...జా....వి....ఏమన్నా సరిపోతా యేమో చూడు.

సుమతి: [ఆశ్చర్యంగా] ఆ, ఏమంటున్నారూ? రాజా బట్టలా?

భాస్కర్: అవును రాజా బట్టలే. [కొంచెం ఆగి] రాజా ప్రస క్తి ఏ విధంగా వచ్చినా నీ మనస్సు కలవరపడి పోతుందన్న సంగతి నాకు తెలుసు. అయితే జీవిత సత్యాన్ని ఎదుర్కోకుండా ఎంతకాలం నువ్విలా నీనుండే పారిపోగలవు? పిచ్చిదానా. పోయిన రాజా మళ్ళీ మనకు వస్తాడా? ....దేనికోసం వాడి బట్టలూ, ఆట వస్తువులూ ప్రాణప్రదంగా దాచుకుంటు న్నావు? వాటి చుట్టూ ఏదో ఒక ప్రపంచం నిర్మించుకుని అందులోనే జీవిద్దా మనుకుంటున్నావు. అంతేనా? కాని అది జరిగే పని కాదు.

సుమతి: [కోపంగా] భాస్కర్, నా ప్రపంచం, నీ ప్రపంచం అని వేరే ఉన్నాయా? అంతా ఒకటే, నన్నిలా ఉండనీండి. చూస్తూ చూస్తూ రాజా వేసుకున్న బట్టలు ఈ దౌర్భాగ్యపు పిల్లవాడి కివ్వమనటానికి మీకు మనస్సెలా ఒప్పింది? అయినా నాకు తెలీకడుగుతాను. అతి సుకుమా రంగా పెరిగిన మన రాజా బట్టలు ఈ మురికి వెధవకెలా కట్టబెడతారండీ?

భాస్కర్: మురికి వెధవా! వాడు నీ పిల్లవాడు కాదు కాబట్టి నీ కళ్ళకి మురికివాడి లాగే కనబడ్తాడు. అదే మాట వాడి తల్లినడుగు. ఏం చెబుతుందో! అయినా [ఒక ఆలోచన తట్టగా] మన రాజాయే వుంటే వాడికి గోపీ వయస్సేగా, [కొంచెం కంగారుగా] ఆనాడు పుట్టిన రోజు పండక్కి తెచ్చిన డ్రెస్....అది సరిపోతుం దనుకుంటాను. కొంచెం చూడు....

సుమతి: ఆనాడు నా బంగారు తండ్రికి తెచ్చిన సూటా! అది ఈ గోపీగాడికి కట్ట బెట్టమంటారా! ఏదో దారిన పోయే పిల్లవాడికి నాలుగు మెతుకులు పడేసి పంపి స్తే సరిపోయేదానికి బదులు ఈ ఘన సన్మానం ఏమిటీ! [ఆవేదన ఎక్కువవుతుండగా] సరే, అలాగే చేయండి. నా చిన్నారి తండ్రి బట్టలన్నీ వీడికే కట్ట బెట్టండి. నా గుండె బ్రద్దలై పోతుంటే మీరానం దించండి....

భాస్కర్: [కొంచెం చిరాకుగా] ప్రతి చిన్న విషయాన్ని రాజాతో ముడిపెట్టి రాద్ధాంతం చేసి మనసు పాడు చేసుకోవటం తప్ప నీకేమీ తెలి యదు. మనకు వచ్చిన కష్టాన్ని గుండె నిబ్బరంతో ఎదుర్కోవాలన్న ధ్యాసే నీకు లేకపోవటం నా దురదృష్టం. నీ హృదయానికి తగిలిన దెబ్బ చిన్నదని, అది చులాగ్గా మానిపోతుందని అనుకునే రాక్షసుణ్ణి కాను. కాని చచ్చిపోయిన మన పిల్లవాడ్ని తలుచుకునై నా బ్రతికున్న యీ నిర్భాగ్యుడైన పసిపిల్లవాడి మీద కొంచెం జాలి చూపించమంటున్నాను.

సుమతి: జాలి! మీకంత జాలి ఉంటే కడుపు నిండా తిండి పెట్టి పంపించండి. కావాలంటే ఒకటో రెండో వాడి చేతులో పెట్టండి. అంతే కాని నా రాజా వస్తువుల్ని వాడి కివ్వమంటంలో ఏమైనా అర్థం ఉందా! వాడికీ నా రాజాకీ సాపత్యమేమిటీ?

భాస్కర్: వాడు పుట్టింది గుడిసె. పెరిగింది దారిద్ర్యంలో.... విజమే! అంతమాత్రానికి వాడిని మనం అసహ్యించుకోవటం న్యాయమేనా!

సుమతి: న్యాయమో, అన్యాయమో నా కెందుకీ ఘోష. వాడెక్కడ

నుంచి వచ్చాడో అక్కడికే పోనీండి. నా రాజా వస్తువుల్ని మాత్రం వాడు తాకటానికి వీలులేదు.

భాస్కర్: [కొంచెం చిరాకుగా] సరే, నీ యిష్టప్రకారమే కానీ. స్నానం చేసివచ్చాక నాలుగు మెతుకులు పడేయించు. తీపికెళ్ళి మళ్ళీ ఆ ఆస్పత్రి దగ్గరే విడిచిపెట్టి వస్తాను! [విసురుగా లోపలికి వెళ్ళిపోతాడు. సుమతి అచేతనంగా చూస్తూ వుంటుంది. రామయ్య గోపీని తీసుకువస్తాడు. అపుడే స్నానం చేసిన గోపీ ఒంటికి టవల్ చుట్టుకుని వుంటాడు....]

రామయ్య: అమ్మా....బాబుకి బట్టలు.

సుమతి: [ఉలిక్కిపడి] అదేమిటి రామయ్యా? పిల్లవాడికి స్నానం చేయించేముందే బట్టలు తీసుకెళ్ళాలని ఎన్నిసార్లు చెప్పాలి? తడిమీద చలిగాలి తగిలితే మంచిది కాదు. ఉండు, ఇప్పుడే తెస్తా. [కొందరగా లోపలికివెళ్ళి బట్టలు తీసుకు వస్తుంది. గోపీ హాలు మధ్యకి వస్తాడు.]

సుమతి: ఇదుగో [బట్టలు ఇవ్వబోయి గతుక్కుమంటుంది.]నువ్వా?

గోపి: నేనే నమ్మా! ఎవరనుకుంటున్నారేంటి?

సుమతి: [అచేతనంగా] రామయ్యా యీ బట్టలు తొడుగు.

[రామయ్య గోపీని లోపలికి తీసుకు వెళతాడు. లోపలినుంచి భాస్కర్ వస్తాడు.]

భాస్కర్: సుమతీ, గోపీ స్నానం ఇంకా కాలేదా?

సుమతి: [వినిపించుకోకుండా కిటికీ దగ్గరకు వెళ్ళి చూస్తూ వుండిపోతుంది.]

భాస్కర్: సుమతీ, ఆనుకోకుండా గోపీని తీసుకువచ్చి నీ మనసుకి కష్టం కలిగించినట్టున్నాను. హాస్పిటల్ వరండాలో అన్నంకోసం పడిగాపులు పడి ఒక్కడూ దిగాలుగా కూర్చుని వుంటే నాకు ఏదో చెప్పలేని జాలీ, బాధ కలిగాయి. ఒకపూట యిక్కడ వుంటాడు కదా అని నాతో రమ్మన్నాను. వాడిది భీంపేట. అక్కడ బ్రతుకుతున్నది మనుషులో, జంతువులో కూడా పోల్చుకోలేం. అందులో పుట్టి పెరిగిన వాడికి భవిష్యత్తంటూ ఒకటి ఉంటుందా అనిపిస్తుంది.

సుమతి: ఎవరి కర్మ వాళ్ళది. మనం ప్రపంచాన్నంతా ఉద్ధరించ గలమా, ఏమిటిఃా

భాస్కర్ అందరూ అలా అనుకుంటే ప్రపంచం ఎప్పటికి మారు తుందిఃా ఒకడికి సకలైశ్వర్యాలు; ఇంకొకడికి పుట్టు దరిద్రం. ఇది ఏ న్యాయమో నాకు అర్థం కావటం లేదు.

సుమతి: భూమిమీద పుట్టిన తరువాత ప్రతి మనిషికీ ఏదో ఒక బాధ లేకుండా వుంటుందాఃా మన దుఃఖం ఎవరు తీరుస్తారుఃా

[రామయ్య, గోపీ వస్తారు. గోపీ బట్టలు వేసుకుని తల దువ్వుకుని ముద్దుగా కనబడతాడు.]

భాస్కర్: [ఆశ్చర్యంగా] అరేఃా గోపీయేనాఃా

గోపి: అవును, అయ్యగోరూ.

భాస్కర్: ఈ బట్టలెవరిచ్చారు నీకుఃా

గోపి: [తృప్తిగా] అమ్మా. [రామయ్యని చూపిస్తూ] ఈయన ఏమంటుండో విన్నారాఃా నేను అచ్చం రాజాలాగనే వున్నానంట. ఎవరండీ రాజాఃా....

సుమతి: [కోపంతో] ఏమిటా మాటలుఃా రాజా సంగతి నీకెందుకుఃా ఉన్న కాసేపూ ఏదో ఒకటి వాగుతూ వుండవలసిందేనాఃా

గోపి: [భాస్కర్ దగ్గరకి వెళ్ళి] నేనేమైనా తప్పు మాటన్నానాఃా అయ్యగారూఃా ఆ ముసలాడు అన్నదే అన్నాను.

భాస్కర్: లేదు గోపీ. ఇందులో ఎవరి తప్పూ లేదు.... [రామయ్యతో] రామయ్యా, గోపీకి భోజనం తీసుకురా. పైమువుతోంది.

రామయ్య: అలాగేనయ్యా. [లోపలికి వెళ్ళి చిన్నపిల్లలు కూర్చునే కుర్చీ తీసుకు వచ్చి టేబిల్ దగ్గర వేస్తాడు.]

సుమతి: [కోపంగా] రామయ్యా, నీకేమైనా మతి పోయిందాఃా ఆ కుర్చీ ఎవరికిఃా

భాస్కర్: గోపీకి—

సుమతి: అంటే మీ ఉద్దేశం, వీడు మనతోపాటు కూర్చుని భోం చేయాలనా? ఇదేమి విపరీతమండీ? రాజాకి ఊహ తెలిసినప్పటినుండీ మనం ఎప్పుడు భోజనం చేసినా వాడి కుర్చీ వాడికి వేసేవాళ్ళం. ఈ యింట్లో ఏ వస్తువు చూసినా రాజాయే జ్ఞాపకం వస్తున్నాడు. వాడు లేకుండా నేనెలా బ్రతుకుతున్నానో నాకే తెలియటం లేదు. [ఏడుస్తుంది.]

భాస్కర్: [దగ్గరకు వెళ్ళి ఓదారుస్తూ] కొంచెం నిగ్రహించుకో సుమతీ. నీ బాధ నాకు తెలుసు. వాడున్న యీ కాసేపూ ఎలాగో ఓర్చుకో. తిండి తిన్నాక వాణ్ణి మళ్ళీ తీసుకెళ్ళి పోతాను. రా, నీ చేతితో ఆ పిల్లవాడికి అన్నం పెట్టి ఆకలి తీర్చు....గోపీ, కూర్చో.

[రామయ్య బల్లమీదకి భోజనం తీసుకువి వస్తాడు. ముగ్గురూ కూర్చుంటారు. గోపీ ఆత్రంగా తినటానికి ఉపక్రమిస్తాడు.]

రామయ్య: కొంచెం తమాయించు, బాబూ. ఎందుకలా కొందర పడతావు?

సుమతి: [అనాలోచితంగా] పాపం, ఎంత ఆకలిగా వున్నాడో....

గోపి: [ముద్ద నోటిలో వుండగానే మాట్లాడటానికి ప్రయత్నిస్తూ] ఇదంతా నాకే. [రామయ్యతో] ఏయ్ ముసిలోడా. ఆ పూరీలు నాకంద కున్నాయ్....కొంచెం దగ్గరగా పెడితే నీదేం పోయిందీ? [చెయ్యి చాచి తీసుకోబోతాడు. మంచినీళ్ళ గ్లాసు క్రింద పడి బ్రద్దలై పోతుంది.] అరెరే! [కొంచెం దిగాలు పడిపోతాడు.]

సుమతి: చూశారా, చూశారా నా రాజా గ్లాసు కాస్తా పగల కొట్టేశాడు. ఏక్కడో ఒక ప్రక్కగా వాడికి నాలుగు ముద్దలు పడేస్తే సరిపోయే దానికి, తుక్కును అందలం ఎక్కించినట్లు వాణ్ణి ఆ కుర్చీమీద కూర్చో పెట్టారు. అది చాలక వాడికి రాజా గ్లాసులో నీళ్ళు అందించి యిచ్చారు....

భాస్కర్: గ్లాసు పగిలినంత మాత్రానికే ఎన్ని మాటలన్నావు!.... ఇందులో గోపీ తప్పు మాత్రం ఏముంది. అందుకోబోయాడు. చేయి తగిలి కింద పడిపోయింది. పొరపాటనేది ఎవరికన్నా వస్తుంది.

సుమతి: పొరబాటు కాదు. మీరిదంతా కావాలనే చేయించారు.... నేను వద్దంటున్నా వాడికీ స్నానాలు పానాలూ ఎందుకు? ముష్టి వెధవని తెచ్చి మురికి వదిలిస్తే వాడి బుద్ధి ఎక్కడికి పోతుంది?

భాస్కర్: ముష్టి వెధవ, ముష్టి వెధవ అని వాడున్న కాసేపూ మాటి మాటికీ వాడి పేదరికం వాడికి జ్ఞాపకం చేస్తే మనకి ఒరిగేదేమిటి? వాడు పుట్టింది పూరి గుడిసెలో అయినంత మాత్రాన వాడికి మనలాగే జీవించే హక్కు లేదంటావా?

గోపి: నాది తప్పైపోయింది. ఇంక వద్దమ్మా—[దిగిపోబోతాడు. గాజు ముక్క కాలికి గుచ్చుకుంటుంది.] అమ్మా!

సుమతి: [బిత్తర పడిపోయి చాలా ఆదుర్దాగా] అదేమిట్రా—చూసుకోకుండా దిగితే కిందున్నవి గాజుముక్కలా మరేమన్నానా? ఎన్నిసార్లు చెప్పాలి బాబూ—గాజు వస్తువులతో జాగ్రత్తగా వుండాలని? ఆనాడు జ్ఞాపకం లేదూ - వేలు తెగ గొట్టుకున్నావు.

గోపి: నేనా? [ఆశ్చర్యం] వేలు కోసుకున్నానా?

[కెలిఫోను. భాస్కర్ వెళ్ళి తీసుకుంటాడు.]

భాస్కర్: హల్లో....డాక్టరు భాస్కర్ మాట్లాడుతున్నది..... అరెరే....పాపం....అలాగే....యిప్పుడే వస్తాను. [రామయ్యతో] గోపిని లోపలికి తీసుకెళ్ళి కొంచెం కట్టు కట్టించు. [రామయ్య, గోపి లోపలికి వెళ్ళిపోతారు.] సుమతీ....ఇలా రా. నరసింహులు పోయాడు. ఈసంగతి గోపికి ఎలా చెప్పడం?

సుమతి: [జాలిగా] ఎంత దారుణం! ఆ పసివాడి లేత మనస్సుకెంత దెబ్బ తగులుతుంది? [ఉద్వేగంతో] వద్దు, భాస్కర్, వద్దు!....వాడికేమీ చెప్పవద్దు. చెప్పిమాత్రం ఏమి ప్రయోజనం?

భాస్కర్: నువ్వు కొంచెం గోపీని చూచుకుంటావు కదూ. నేను వెళ్ళి వాడి తండ్రికి కబురు చేస్తాను. అవసరమైతే నేనే అతణ్ణి ఆస్పత్రికి తీసుకు వెళ్తాను.

సుమతి. గోపీ తండ్రి మీకు తెలుసా?

భాస్కర్: లింగయ్య, భీం పేటలో వుంటాడు. కొంచెం రౌడీ తరహా....అంతే.

సుమతి: ఏమో, నాకు భయం వేస్తోంది. గోపీ తండ్రి సరైన మనిషిలా తోచడం లేదు. లేకపోతే చావు బ్రతుకుల మధ్యవున్న కొడుకుని హాస్పిటల్లో పడవేసి, ఈ పసివాడికి అప్పజెపుతాడా? ఎక్కడో తప్పతాగి పడివుంటాడు. ఈ సమయంలో మీరు వెళ్ళి ఈ దుర్వార్త చెప్పితే ఏ అఘాయిత్యం చేస్తాడో....

భాస్కర్: ఏమీ పరవా లేదులే. [వెళ్ళి పోబోతాడు.]

సుమతి: ఎంత ఆలస్యం అవుతుందో ఏమో! కొంచెం భోజనంచేసి వెళ్ళండి....నా మాట వినరూ!

భాస్కర్: [ఆగి] నా ఆకలి చచ్చిపోయింది సుమతీ! మెడికల్ కాలేజీలో చదువుకునేటప్పుడు ఎన్ని శవాల్ని చూశానో లెక్కలేదు. ఒక్కొక్క కళేబరం చుట్టూ మూగిన విద్యార్థుల రొద-మధ్య ప్రొఫెసర్ నరనరాలు తరిచి తరిచి చెప్పుతుంటే, మొద్దుబారిపోయిన ఆ శరీరం కూడా ఒకప్పుడు జీవయాత్ర చేసిందనీ, మనలాగే కష్టసుఖాలూ ఆకలి దప్పులూ అనుభవించిందనీ, నాకు తట్టనేలేదు. కాని హాస్పిటల్లో మొదటిసారిగా నాచేతిలో ఒక మనిషి పోయినప్పుడు ప్రక్కనే వున్న భార్య కెవ్వుమని కేకవేసి అతని గుండెమీద పడి హృదయ విదారకంగా ఏడుస్తూవుంటే అక్కడ వుండలేకపోయాను. మృత్యువంటే ఏమిటో తెలియకుండా తల్లితో పాటు ఏడుస్తున్న పిల్లల్ని చూస్తుంటే నా గుండెలు తరుక్కుపోయాయి. ఒక్క మనిషితో ఎన్ని జీవితాలు లంకెలు వేసుకుంటాయో! ప్రప్రథమంగా ఆనాడు గ్రహించాను. డాక్టర్లకి ప్రతిరోజూ ప్రళయమేగా. క్రమేపీ మామూలు మనిషినయ్యాను. అప్పట్నుంచీ చావులూ బాధలూ నా జీవితంలో ఒక భాగమైపోయాయి. మనస్సు రాయిలా గట్టిపడిపోయింది....కాని ఇన్నాళ్ళకి ఈవేళ మళ్ళీ అది చివుక్కుమంది. దానికి కారణం అక్కడ చచ్చిపోయిన అన్నో, యిక్కడ బ్రతికివున్న తమ్ముడో తెలియటంలేదు.

సుమతి: [అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ] గోపీని మీతో తీసుకువెళ్తే ఇల్లు కనుక్కోవడం తేలికగా ఉంటుందేమో....కాని ఈపరిస్థితిల్లో వాడికి తెలియనియ్యడం కూడా బాగోలేదు. [జాలిగా] కొంచెం సేపన్నా వాడా నరక కూపంలోంచి బయటపడాడు.

భాస్కర్: మరి నేను వస్తాను.

[బయటకి వెళ్ళిపోతాడు. ఒక్క క్షణం అతడు వెళ్ళినవైపే చూస్తూ వుంటుంది సుమతి. ఉబుకుతున్న దుఃఖాన్ని ఆపుకుని డైనింగ్ టేబిల్ దగ్గరకు వెళ్ళి కూలబడిపోతుంది. కొంచెం కుంటుకుంటూ గోపి వస్తాడు.]

గోపీ; అమ్మా—

సుమతి: [ఉలిక్కిపడి. అనాలోచితంగా] అమ్మా—[గోపీని దగ్గరకు తీసుకుని ఒక్క క్షణం భ్రమిస్తుంది.] ఆ మధురమైన పిలుపువిని ఎన్నో రోజులైందిరా! మళ్ళీ అను.... [తెప్పరిల్లి] గోపీ....నువ్వు బడికి వెళ్తున్నావా?

గోపీ: బడా! మాలాంటి బీదోళ్ళకి బడి ఎలా గమ్మగోరూ?మా అయ్య గుడుంబా కొస్తాడు. రాత్రిపూట చేరేస్తే నాలుగు పైసలు దొరుకుతాయి. ఆటితో పతంగులు సందేలాడతాం....మొన్న పండగకదమ్మా! నాకు ఒక్క పతంగు కూడా లేకపోతే అయ్యని పదిపైసలడిగాను. మాంచి నిషాలో ఉన్నాడు. ఓరి లఫూట్, నీకు పతంగులు కావాలిరా అని కొట్టి తోలేశాడు.

సుమతి! [జాలిగా] మరి మీ అమ్మ?

గోపీ: మా అమ్మ లేదమ్మా సచ్చిపోయింది. [కొంచెం వెక్కివెక్కి ఏడుస్తూ] సచ్చిపోయింది.

సుమతి: [దిగులుగా, దుఃఖం భరించలేక] అయ్యో పాపం! నువ్వు తల్లి లేని వాడవా బాబూ!

గోపీ: మా అమ్మ కిందటేడు, దీపావళి పండుగనాడు చచ్చిపోయిందమ్మా—

సుమతి: దీపావళి పండుగనాడా! సరిగ్గా అదేరోజు....[ఉద్వృతమైన ఆవేదనతో] అదేరోజు నాయిల్లు కూడా చీకటైపోయింది.

గోపీ: అదేందమ్మగారూ! అలా బాధపడుతున్నారు! మా అమ్మ దేముడి దగ్గర కెళ్ళిపోయింది. దేముడి దగ్గరకెళ్ళి నోళ్ళకోసం ఏడపకూడ దంటారు! నిజమేనా అమ్మగోరూ!

సుమతి: ఔనుబాబూ, చచ్చిపోయిన వాళ్ళంతా దేవుడి దగ్గరకి వెళ్తారు. మరి ఇప్పుడు నీకు అన్నం ఎవరు పెడ్తున్నారు!

గోపీ: [కొంచెం విసుగ్గా] మా చిన్నమ్మకి అన్నం పెట్టాలంటేనే చిరాకు. మా అయ్య దాన్ని పెట్టుకున్నాడంట. నన్నూ నరపిమ్మల్నీ ఎప్పుడూ కొడ్తూవుంటుంది.

సుమతి: చాల్లే నాయినా, వినడానికే బాధగా వుంది. పడుకుంటావా!

గోపీ: [లేచి లోపలికి వెడుతూ ఆగి] మరి నేను దవాఖానాకి వెళ్ళద్దూ అన్న కెలా గుందో! ఆడు ఎన్ని ఖరాజు పన్లుచేసినా ఇంకోళ్ళ నామీద చెయ్యి చేసుకుంటే వూరుకోడు. అవసరమైతే నా ప్రాణాలు నీకిస్తానురా అనేవోడు.

సుమతి: [కలవరంగా] నీ అన్నసంగతి డాక్టరుగారు చూసుకుంటారులే. అయినా డాక్టర్లు మందులు పోస్తారుగాని ప్రాణాలు—[ఆగిపోతుంది. గోపీ లోపలికి వెళ్తాడు.]

రామయ్య: [లోపలినుంచి వచ్చి బల్ల కేపి చూసి నిర్ఘాంతపోయి] ఇవాళ బలేరోజు! అయ్యగారు ఆస్పిటల్‌కి ఇంటికీ మధ్య పరుగులుపెడుతూ ముద్ద ఎత్తలేదు. మీరు భోజనం దగ్గిర కూర్చునికూడా ఒక మెతుకు ముట్టలేదు. ఇలా అయితే నా కెందుకి వంట పని!

సుమతి: సరేలే, నా మనస్సు మనస్సులో లేదు. [సూన్యంగాచూస్తూ] దీపావళి!....దీపావళినాడే నన్నమాట....

రామయ్య: [అర్థం చేసుకోలేక] దీపావళి ఏమిటమ్మా? ఈ పిల్ల గాడు యే వేళ ఇంట్లో కాలుపెట్టాడో అంతా గందరగోళంగా తయారైంది. మన కెందుకమ్మా ఈ భీంపేటోళ్ళ గొడవలు! ఆర్చగలమా, తీర్చగలమా!

సుమతి: [రామయ్యా. నీక్కూడా మతిపోతున్నట్లుంది. దీపావళినాడే గోపి తల్లికి పోయిందట. తల్లిలేని బిడ్డగా వాళ్ళు, బిడ్డలేని తల్లిగా నన్ను చేసినరోజు. దేశానికంతటికీ పర్వదినం. మా యిద్దరికి మాత్రం ఎంత దుర్దినం!

రామయ్య: [గద్గదికంగా] ఊరుకోండమ్మా, ఊరుకోండి....గోపి వస్తున్నాడు.

సుమతి: [కళ్ళు తుడుచుకుని బల్ల దగ్గిరనుండి లేచి సోఫాలో కూర్చుంటుంది. ముఖంలో తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో, గోపి కుంటుకుంటూ వస్తాడు.] గోపీ రా, ఇక్కడ కూర్చో. కాస్సేపు పండుకోకపోయావా?

గోపి: నిద్ర రావటంలేదమ్మా. [క్రింద కూర్చోబోతాడు.]

సుమతి: [ఆప్యాయంగా] అదేమిటిరా, క్రింద కూర్చుంటున్నావు? రా, నా ప్రక్కనే కూర్చో బాబూ!

[దగ్గిరకి తీసుకుంటుంది.]

సుమతి: పాపం చాలా అలసిపోయావు కదూ?

గోపి: అవును అమ్మగారూ! వళ్ళంతా హూనమైపోయింది. [ఆలోచిస్తూ] అన్నగారెట్టున్నారో! పాపం, మధ్యాహ్నం వాడికి సూదిమీద సూది పొడిచింద్రు. దవాఖానాలో వుండకుండా ఇక్కడికి వచ్చానని తెలిస్తే మా అయ్య చంపేస్తాడు. [అబ్బా]

సుమతి: అయ్యో వేలు నొప్పిపెడుతూందా? నువ్విలా కాస్త పడుకో, డాక్టరుగారు వచ్చింతర్వాత కనుక్కుందాం. [నెమ్మదిగా పీపుమీద తడుతూ వుంటే గోపి అలాగే కూర్చుని కునికిపాట్లుపడుతూ వుంటాడు.]

గోపి: [అకస్మాత్తుగా] అమ్మా!

సుమతి: [ఉలిక్కిపడి] అమ్మా! ఎన్నాళ్ళయింది బాబూ నన్ను అమ్మా అని పిలిచి! ఇన్నాళ్లూ ఎక్కడ దాక్కున్నావు రాజా? పడుకో, నీ ప్రక్కనే వున్నానుగా—లాలి పాడమంటావా?

గోపి: [సగం నిద్రలో] ఊ!....

సుమతి: [నెమ్మదిగా జోల పాడుతూ వుంటుంది.]

రామయ్య: [లోపలినుంచి వచ్చి ఒక నిమిషం చూస్తాడు] అమ్మ గారూ—

సుమతి: [పాట ఆపి] ఏమిటి రామయ్యా?

రామయ్య: గోపీ నిద్ర పోయినట్లున్నాడు, లోపలికి తీసుకెళ్ళి పడుకో బెట్టనా?

సుమతి: [అనాలోచితంగా] నిద్రవచ్చినప్పుడు బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి పడుకోవాలంటే వింటాడా? ప్రతిరోజూ సోఫాలో నిద్రపోవడం. మనం తీసుకెళ్ళి పడుకోపెట్టడం అలవాటైపోయింది....సరే తీసుకెళ్ళు. నేను వస్తాను.

[రామయ్య పిల్లవాడిని ఎత్తుకుని లోపలికి వెళ్ళిపోతాడు. అతని వెనకే సుమతి....కొంచెం వ్యవధి. తలుపు దబదబా కొట్టిన శబ్దం]

రామయ్య: [లోపలినుంచి వస్తూ] ఎవరండీ!

[తలుపు తీసీ తియ్యడంతోనే లింగయ్య తోసుకొంటూ వస్తాడు. కళ్ళు జేవురించి వున్నాయి. బుంగమీసాలు. మాసిపోయిన లుంగీ, చొక్కా తప్పత్రాగిన వాలకం.]

లింగయ్య: డాక్టర్‌సాబ్!

రామయ్య: డాక్టర్‌గారు లేరు. ఆసుపత్రికి వెళ్ళారు.

లింగయ్య: దవాఖానానికి పోతే ఇంటికి పోయారు అన్నారు. ఇంటికి వస్తే నీవు దవాఖానాకి పోయా డంటున్నావు. తమాషగా ఉందే?

రామయ్య [కొంచెం భయపడుతూనే బింకంగా] పెద్దోళ్ళింటికి వచ్చి ఏమిటయ్యా నీ గోల? డాక్టరుగారు లేరని చెప్తున్నాగా!

లింగయ్య: పోనీలే మా గోపీగాడు ఇక్కడికి వచ్చాడంటగా? పోకిరి నాయాలా అన్నని చూడమని పంపిస్తే పరారై పోయాడు.

రామయ: ఇంతకీ నీవు గోపీ ...

లింగయ్య: అవునయ్యా, గోపీ నా కొడుకు. ఇక్కడ వున్నాడా లేడా? ఏం? మాట్లాడకున్నావు? బద్మాష్!

రామయ్య [భయపడుతూ] సరిగా మాటలు రానీ.

లింగయ్య: పిల్లోడిని తీసుకొచ్చి దాటేశావా? అలా చూస్తావేం? లింగయ్యంటే ఎవరనుకుంటున్నావు? [జేబులోంచి కత్తితీసి చూపిస్తూ] ఊ! చెప్పు. తొందరగా చెప్పు....లేకపోతేనా? [లోపలినుంచి సుమతి వస్తుంది, ఆమెను చూసి లింగయ్య వెనక్కి తగ్గి కత్తి కంగారుగా జేబులో పెట్టేస్తాడు.]

సుమతి: ఎవరు నువ్వు?

లింగయ్య: మా గోపీ కోసం వస్తే ఈ ముసిలోడు లేనిపోని మాట లంటుండు. ఊరికే తమాషాకి భయపెడుతున్నా, అంతే. మీరేమీ భయపడ కండి. నేను ఖూనీకోరువికాను.

సుమతి: నువ్వా! గోపీ తండ్రివా! అంటే....లింగయ్య.

లింగయ్య: అవును తల్లీ, మా బుల్లోడు అంతా చెప్పాశాడన్న మాట.

సుమతి: [గాబరాగా] నువ్వు ఆసుపత్రికి వెళ్ళలేదూ?

లింగయ్య: పొద్దుమికి అయిదింటికే ఎల్లానమ్మా నరిసింహల్ని డాక్టర్‌సాబ్ మంచిగ చూస్తుండ్రని ఆయన గోపిని తీసుకొచ్చిండ్రని నరసమ్మ చెప్పింది. సరాసరి ఇక్కడికే బయలుదేరి వస్తుండ. దారిలో దోస్తు కనిపించాడు. ఒక నిమిషం రారా రామయ్యవుండే హోటలుకెళ్ళా. ఆమాట, ఈమాట ఆలస్యమయింది.

సుమతి: [చీదరగా] కొడుకు చావు బ్రతుకుల్లో వుంటే నీవు తాగి తందనాలు తొక్కుతున్నావన్నమాట.

రామయ్య: [ఆదుర్దాగా] వాడు మంచి మవిషికాదు. మనకెందుకమ్మా.

లింగయ్య: నరిసింవులు బాగుండాడు గదమ్మా, నరసమ్మ ఇంకేం పరవాలేదంది....లేకుంటే వదిలిపెట్టి వస్తానా?

సుమతి: లింగయ్యా! [భారంగా] నీకు చెప్పటానికి నోరు రావటం లేదు. నరిసింవులు అరగంట క్రిందే పోయాడట.

లింగయ్య: [కూలబడిపోయి] ఎంతమాట చెప్పావు తల్లీ. నా వరిసింవులు చచ్చిపోయిండా. అయ్యోదేముడా [తెప్పరిల్లి] అంతే నాకు కాస్తి కావలసిందే....అంతే....

సుమతి: [జాలిగా] డాక్టరుగారు కాయశక్తులా ప్రయత్నించారుగాని లాభం లేకపోయింది. నిన్ను వెతుక్కుంటూ వెళ్ళారు.

లింగయ్య: అంతా నా తలరాత....గోపీనిఁ

సుమతి: గోపీ ఇవాళ ఇక్కడే వుంటాడులే. డాక్టరు నీకోసం భీంపేట వెళ్ళాడు. నువ్వు ఆసుపత్రికి వెళ్ళి పిల్ల వాడిని తీసుకో. ఈలోపల ఆయన కూడా అక్కడికే వస్తారనుకుంటాను. పాపం, ఎంత కష్టం వచ్చిందిఁ నీతో మా రామయ్యని పంపించ మంటావాఁ

లింగయ్య: [అపరమితమైన బాధతో] వద్దమ్మా ఎవ్వరూ వద్దు [వెళ్ళిపోతాడు.]

రెండో అంకం

[మర్నాడు మధ్యాహ్నం. డాక్టర్ భాస్కర్ యిల్లు. మొదటి అంకలో లాగానే వుంటుంది. అలమారు మాత్రం తీసివుంటుంది. అందులోనుండి తీసిన బొమ్మలు కొన్ని సోఫాలో చెల్లా చెదురుగా పడి వుంటాయి. సుమతి, ఆమె వెనకాతలే గోపీ ప్రవేశిస్తారు. సుమతి నిన్నటి సుమతి కాదు. క్రొత్త చీర కట్టుకొని కళకళ లాడుతూ వుంది. ముఖంలో ఆనంద రేఖలూ, నవో త్సాహమూ కనబడుతున్నాయి.]

సుమతి: గోపీ, నీ కిక్కడ బాగా వుందాఁ

గోపీ: ఓ; మంచిగుందమ్మా. ఈ బొమ్మలన్నీ నాకేనాఁ మరో పోరగాడు గుంజుకుపోడు గదాఁ

సుమతి: నీకేలే, ఎవరూ లాక్కుపోరు. అయితే, మీ అయ్య నిన్నక్కడ ఉండనిస్తాడాఁ అసలే—[ఏదో అనబోయి నాలిక కొరుక్కుం

టుంది] ఇక్కడ వుంటే నీ ఇష్టం వచ్చినట్లు అల్లరి చిల్లరగా తిరగడానికి వీలులేదు. రోజూ బడికివెళ్ళి చక్కగా చదువుకోవాలి.

గోపీ: [కొంచెం నిస్పృహతో] భలేగుందు! ఎప్పుడూ సదువు తుంటే, సాపతిగార్లతో పతంగు లెగరేసేదెప్పుడు?

సుమతి: [ఉలిక్కిపడి] పతంగులా!

గోపీ: అవునమ్మా. అవే గాలిపటాలు. ఎన్నెన్ని రంగు రంగుల పటాలున్నాయి. పచ్చాస్‌దార్, టోపీ లంగోట్. డొప్పన్, గిల్లోరా డొప్పన్....

సుమతి: [కోపంగా] ఆగు, ఆ పతంగుల సంగతి మాత్రం ఇక్కడ ఎత్తొద్దు....[విపరీతమైన ఆవేదనతో] వద్దు బాబూ....వద్దు....అవి పటాలు కావు. పడగలు పాముపడగలు....

[బయటనుంచి పిల్లల కేరింతలూ, పరుగు లెత్తుతున్న అడుగుల శబ్దం వినిపిస్తుంది.]

గోపీ: [కిటికీ దగ్గరికి పరుగెత్తి] అరే! అరే!! భలే మంచిగా కొడు తుండయే.

సుమతి: [దగ్గిరకు వెళ్ళి గోపీని లాక్కొని వస్తుంది.] పతంగుల సంగతి ఏ త్తవద్దని ఇప్పుడేగా చెప్పాను! [జేవురించిన ముఖంతో] వాటి జోలికి పోయావా!....

గోపీ: [దీనంగా] ఒక్క పటం కొనిపెట్టమ్మా.

సుమతి: ఛీ! నోరుముయ్! [ఆవేశంలో చెంపమీద చేయివేస్తుంది. గోపీ కొంచెం కొంచెం ఏడుస్తుంటే దగ్గరకు తీసుకొని] వద్దు నాయనా.... అవి మంచివి కావు....నా మాట వింటావాలేదా? నీకు వేరే మంచి బొమ్మలు కొనిస్తాను—సరేనా!.... [కొంచెం ఆగి] అరే. నాలుగౌతావుంది. లోపలికి వెళ్ళి కాస్త ఆర్లిక్కు తాగిరా....

[గోపీ వెళ్ళిపోతాడు....సుమతి ఒక్క క్షణం ఆలోచిస్తూ వుండి

పోతుంది. ఏదో చటుక్కున జ్ఞాపకంరాగా, గబగబా టెలిఫోను దగ్గరకు వెళ్ళిఫోను తీస్తుంది.]

సుమతి: హల్లో...వెంకన్న చెట్టిగారి పిటీ ఎంపోరియమేనా? నేను డాక్టర్ భాస్కర్‌గారి ఇంట్లో నుంచి మాట్లాడుతున్నాను....నమస్కారం అర్జెంటుగా రెడీమేడ్ దుస్తులు కావాలి....తొమ్మిదేళ్ళ పిల్లవాడికి. చొక్కాలు లాగులూ....సరిక్రొత్త నమూనాలు పంపించాలి సుమండీ....ఇప్పుడే.... థ్యాంక్సు....

[సుమతి ఫోను పెట్టేస్తుంది. బయట మెల్లెక్కుతున్న శబ్దం. తలుపు తోసుకుని కూనిరాగంతో వాణి ప్రవేశిస్తుంది]

వాణి: హల్లో సుమతీ, ఇవాళ ప్రొద్దుటినుంచీ మీటింగులతోనే సరి పోయింది. సాయింత్రం మళ్ళీ కల్చరల్ ప్రోగ్రాము వుంది. నువ్వేమన్నా వస్తావేమో కనుక్కుందామని వచ్చాను. భాస్కర్‌కూడా వీలైతే వస్తా నన్నాడు [కొంచెం పరకాయించి చూచి] అరే, ఈవేళేదో కొత్తగా కని పిస్తున్నావే!

సుమతి: [చిరునవ్వుతో]నువ్వూ, నీ సభలూ! ఎప్పుడూ ఉండేవేగా! ఇంతకీ, ఇవాళ ఎవర్ని ఉద్ధరిస్తున్నా రేమిటి?....

వాణి: అంత చులాగ్గా తీసిపేయబోకు, మరి. అందరూ అలాగే అంటే నడుంకట్టుకొని పనిచేసేదెవరు? ఇవేళ్టికి ఇవాళ చూడు. మాసంఘం, పదో వార్షికోత్సవం. సాంఘిక సంక్షేమం శాఖా మంత్రిగారు అధ్యక్షులు. బొంబాయినుంచి శ్రీమతి వసంతా భండార్కర్ వచ్చింది.నువ్వెప్పుడు వినలేదు కాబోలు. ఏ సాంఘిక సమస్యమీదైనా సరే, అనర్ఘళంగా రెండుగంటల సేపు చెప్పింది చెప్పకుండా మాట్లాడగల ప్రజ్ఞావంతురాలు. ఇలాంటి సమా వేశాలు ఆర్గనైజ్ చేయ్యాలంటే మాటలా? ఇన్విటేషన్లదగ్గర నుంచి విరా రాలదాకా నేనే తంటాలు పడాలి. మధ్యాహ్నం రిట్జ్‌హోలులో లంచ్. ఇంతా చేస్తే పత్రికా ఫోటోగ్రాఫర్లు గైరాజరై పోయారు. వాళ్ళకి నరిగా కబు రందలేదట. మళ్ళీ వాళ్ళకోసం హడావుడిగా పరుగులు....అబ్బబ్బ! ఏమి చెప్పమంటావులే నా అవస్థలు?

సుమతి: వాళ్ళు రాకపోయినంత మాత్రాన ఏంపోయిందిఁ

వాణి: బాగానేవుంది. ఆసలైనవాళ్ళే రాకపోతే, మేము పడేశ్రమా, చేసేపనీ ప్రపంచాని కెట్లా తెలుస్తుందిఁ సరైన పబ్లిసిటీ లేకపోవటంవల్లనే మన సాంఘిక కార్యక్రమాలు దెబ్బతింటున్నాయని నా ఉద్దేశం.

సుమతి: పోనీలే, ఈ శ్రమంతా ఎవరికోసమో చెప్పావుకాదు....

వాణి: ఓహో! నేను చెప్పలేదా ఏమిదిఁ డెలిక్వెంట్ చిల్డ్రెన్ అంటే పతిత బాలురకోసం మా సంఘం ఒక గృహం నడుపుతోంది.

సుమతి: [తటపటాయిస్తూ] ఎందుకుఁ

వాణి: [డైవింగు టేబిల్ దగ్గరకు వెళ్ళి, దానిమీద చేతులుపెట్టి ఉప ఉపన్యాస ధోరణిలో] మనదేశం ఎన్నోవిధాల పురోగమిస్తోంది కాని, అతి ముఖ్యమైన విషయం ఒకటి మర్చిపోతున్నాం అదేమిటంటే.ఈనాటి బాలుడే రేపటిపౌరులనీ, నాయకులనీ....[కొంచెం ఆవేశంగా] రేపటి ప్యవస్థలో ప్రముఖ పాత్రలు వహించవలసిన పసికందులు కొంతమంది అతి నికృష్ట మైన వాతావరణంలో పెరుగుతూ ఎందుకూ కొరగాకుండా పోతున్నారు. చివరికి హద్దు మీరిపోయి, సంఘానికే ప్రతికూలురై ఘోరమైన నేరాలు చేయడానికి కూడా తయారవుతున్నారు. [కొంచెం ఆగి] సుమతీ, నువ్వెప్పుడన్నా జైలుకి వెళ్ళేవాఁ

సుమతి: [వెటకారంగా] జైలాఁ బాగానేవుంది. జైలుకు పోవాలిసిన గతి నాకేం పట్టిందిఁ

వాణి: అవునులే, నీ ప్రపంచానికీ, జైలుకీ చాలాదూరం. సాంఘిక కార్యక్రమాల్లో నాకు తప్పదు కాబట్టి నేను ఇప్పుడు వాటిని చూడవలసి వస్తుంది. [మళ్ళీ ఉపన్యాస ధోరణితో] ఆ జుగుప్సావూరిత వాతావరణంలో ఎందరు భగ్నజీవులు ఏళ్ళతరబడి విమోచనం లేకుండా ఎందుకు కాలం వెళ్ళబుచ్చుతున్నారో తెలుసాఁ

సుమతి: వ్యాళ్ళేదో పెద్దనేరం చేసివుంటారు. చేసిన నేరాలకి శిక్షకూడా ఉండకూడదంటావా ఏమిటిఁ

వాణి: శిక్ష! మనమే నేరం చేయించి, మనమే శిక్షించడం ఏమి న్యాయమో నాకు అంతుపట్టడం వేరు.

సుమతి: [ఆశ్చర్యంగా] మనమా? మనం నేరాలు చేయిస్తున్నామా? బాగానే వుంది!

వాణి: మనం అంటే నువ్వూ నేనూ కాదనుకో. మన చుట్టూవున్న పరిస్థితులు—అజ్ఞానం, దారిద్ర్యం. దురాశ, ఈర్ష్య—ఇవన్నీ మనం సృష్టించినవేగా! ఈ పరిస్థితుల్లో కొంతమంది నేరస్తులైతే, పోలీసులచేత పట్టించి, న్యాయస్థానాల్లో న్యాయం న్యాయం అంటూ మనమే శిక్షిస్తున్నాం. కాని వాళ్ళు నేరం చెయ్యడానికి ఎవరు నిజంగా కారకులో, దానికి మనం ఏం చేయాలో పట్టించుకోవటం లేదు.

సుమతి: బాగానే వుంది. ఏ పరమ కిరాతకుడో వచ్చి మనగొంతులు కోసి ఉన్నది కాస్తా ఊడలాక్కుని పోయినా వాణ్ణి శిక్షించొద్దంటావు అంతేనా?

వాణి: అబ్బే; అంతదాకా రానీయకూడదంటాను. అలాంటివాళ్ళని మనం మొదట్లోనే కనిపెట్టి సరైనదారిలో పెట్టించాలి. ఈ నాడు ఉరికంబం ఎక్కే హంతకుడు కూడా ఒకప్పుడు అభమూ, శుభమూ తెలియని పిసిపిల్లవాడేగా!

సుమతి: నువ్వు చెప్పేది బాగానేవుండికాని, అలాంటివాళ్ళని గుర్తించడ మెలా?

వాణి: [విజయ సూచకంగా] సరిగ్గా అడిగేవు. అదే మాపతిత బాలోద్ధారక సంఘంయొక్క లక్ష్యం. ఇప్పుడర్థమయిందా నేను చేస్తున్న పని?.... ఇవాళ చాలా ప్రశ్నలు వేశావు. నువ్వుకూడా మా సంఘంలో చేరరాదూ? కొంచెం ప్రొద్దుతుంది. నీ మనస్సులోని బరువుకూడా తగ్గుతుంది....[అటూ ఇటూ చూస్తు] దాహంవేస్తోంది. కొంచెం రామయ్యని పిలుస్తావా?

సుమతి: రామయ్య గోపీని చూస్తున్నాడు....నేను తెస్తానులే. [లోవలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి యిస్తుంది]

వాణి: గోపీ!....గోపీ ఎవరు?—

సుమతి: అదంతా పెద్దకథ....వాడిది భీంపేట. పాపం పిల్లవాడు; చాలా కష్టంలో ఉన్నాడు. వాడితండ్రి పేరు లింగయ్యట.

వాణి: గుడుంబా లింగయ్య కొడుకా? వాణ్ణిక్కడ కెందుకురానిచ్చావు, [గడియారం చూసుకుంటూ] చెప్పాలంటే చాలావుంది వాళ్ళ సంగతి. లింగయ్యంటే ఎవరనుకుంటున్నావు? ఊళ్ళోకంతా పెద్ద గూండా....అయినా నా కిప్పుడు టైములేదు. ఇంటికి వెళ్ళి బట్టలు మార్చుకొని మళ్ళీ రవీంద్ర భవనానికి వెళ్ళాలి. కల్చరల్ ప్రోగ్రాముకి ఏర్పాట్లన్నీ సరిగా ఉన్నాయో లేనో చూసుకోవాలి. కించిత్తు లోపంవచ్చినా మా రిసెప్షన్ కమిటీ చైర్మన్....మిసెస్ స్వామినాధన్—హెల్త్ సెక్రటరీగారి భార్య—ఎగిరి పడుతుంది.

సుమతి: [వినీ వినిపించుకోకుండా] నీకు గోపీ తెలుసునన్నమాట. మొదట్లో వాడి వాలకం చూస్తే నాకు పరమ అనహ్యం వేసింది....కాని, ఎందుకో తెలియదు. వాడు నాలో కొత్త భ్రమలు పుట్టించాడు. నా రాజా తిరిగివచ్చాడా అనిపిస్తోంది....ఆ చేష్టలూ, ఆ ఉత్సాహం—అంతా రాజాయే....

వాణి: గోపీగాడి పుట్టుపూర్వోత్తరాలన్నీ నాకు తెలుసు. పిల్లవాడు మంచివాడే, కాని దుస్సహవాసంపల్ల, ఇంట్లో పరిస్థితులమూలంగానూ చేడిపోతున్నాడని మా సంఘంలో చేర్పించాలని ప్రయత్నించాను. కాని, వాడి తండ్రి లింగయ్య రాక్షసుడు....[మళ్ళీ టైము చూచుకుంటూ లేచి] నీతో ఇలా తూర్చుని కబుర్లు చెవుతుంటే పుణ్యకాలం కాస్తా అయిపోతుంది. పోనీ నువ్వు కాసేపు మా యింటికి రారాదూ? అన్ని సంగతులు వివరంగా చెపుతాను. నువ్వు రాజా పోయినప్పటినుంచి ఆసలు ఇల్లు కదిలి బయటికి రావటమే మానేశావు.

సుమతి: మీ ఇంటికా?

వాణి: అవును, మా ఇంటికే. ఈ మధ్య ఒక్కసారైనా వచ్చావా? రా, కాసేపు కూర్చుని వచ్చేద్దువు గాని.

సుమతి: సరే పద. గోపి కోసరం బట్టలు పంపించమని షాప్‌కి ఫోన్ చేశాను. [కొంచెం బిగ్గరగా] రామయ్యా, వాణమ్మగారింటికి వెళ్ళి ఇప్పుడే వస్తాను. ఇల్లు జాగ్రత్త.

[ఇద్దరూ బయటికి వెళతారు. అరనిమిషం వ్యవధి. రామయ్య, గోపి లోపలనుంచి వస్తారు.]

గోపి: ఏయ్, ముసిలోడా!

రామయ్య: [చిరుకోపంగా] నన్నలా పిలవద్దని చెప్పలేదూ? నాకూ ఒక పేరుంది.

గోపి: ఓస్, కోపం కూడానేవుందే! అమ్మకి తెలియకుండా ఒక్క పతంగు ఇప్పించమంటే ఇప్పించనంటావు.

రామయ్య: అమ్మ వద్దంటే ఎలా గిప్పిస్తాను? పతంగులు ఎగరెయ్యకూడదని నీకు బుద్ధిచెప్పిందిగా!

గోపి: ఎందుకనీ అంట?

రామయ్య: పిల్లగాడివి నీ కేం తెలుస్తుందిరా? సుమతమ్మగోరి బిడ్డ రాజా ఉండేవాడు. ఆ యమ్మ కొడుకుని కళ్ళల్లో పెట్టుకుని పెంచింది. నీలాగే గాలిపటాలంటే తగని పిచ్చి. ఆ తొందరలో ఏమీ ఆలోచించేవాడు కాడు. అందుకనే గాలిపటాల జోలికీ పోవడానికి వీల్లేదని నిర్బంధం జేసింది.

గోపి: బాగుంది, అంతభయమైతే ఎట్లా?

రామయ్య: అదేనయ్యా చెప్పేది. ఒకరాత్రి ఎవరూ చూడకుండా గాలిపటం పట్టుకోబోయి మేడమీదనుంచి క్రిందపడిపోయాడు. శ్రీ రామ చంద్రు అంతా అయిపోయింది.

గోపి: పాపం! అదా సంగతి!

రామయ్య: భగవంతుడు చిన్నచూపు చూశాడు. సుమతమ్మ దుఃఖం చూస్తుంటే, కడుపు తరుక్కుపోతూంది. [కొంచెం ఆగి] అయినా నీ

కెందుకులే, ఈ సంగతులుఁ అమ్మ వచ్చేదాకా కొంచెం లోపలికి వెళ్ళి పడుకో.

గోపీ: ఎప్పుడూ పడుకో, పడుకోమని వూరికే లొల్లి పెట్టొద్దు. [ఏదో జ్ఞప్తికి రాగా] విన్నావాఁ అమ్మ నీ కీడ మంచిగుందా అని అడిగింది.

రామయ్య: [ఆశ్చర్యంగా] విన్నాఁ

గోపీ: అవును.... నేను రాజాలాగే ఉంటానంటగా.

రామయ్య: నిజమే [గోపీని రాజా ఫోటోని తరచిచూస్తూ] నేనూ అదే అన్నానుగా. కొంచెం మేమిటిఁ పోలికలు బాగానే ఉన్నాయి.

గోపీ: [రాజా ఫోటోదగ్గిరకి వెళ్ళి] ఈ రాజా నేనూ ఒకటే [ఫోటో మీద ఉన్న లాకెట్ ముట్టుకుంటూ] ఇందేందయ్యాఁ

రామయ్య: అది బంగారం గొలుసు. రాజా తాతగారు అన్న ప్రాసనాని కని ఇచ్చారు. అలాంటి వస్తువులజోలికి నువ్వు పోగూడదు.

గోపీ: ఓస్ఁ నాకు ఎవరికేలే. మొన్న మా గూడెంలో ఓ పోరగాడు ఏంజేసిందో తెలుసాఁ ఆబీద్ రోడ్డులో కారులోంచి ఓ అమ్మ పర్సు కొట్టే పిండు. అందులో ఉందంట బంగారు గొలుసు. అది షావుకారుకాడబెట్టి పాతిక పతంగులు తెచ్చిండు.

రామయ్య: అవన్నీ దొంగముండా వాళ్ళ పనులు. నువ్వుకూడా అలాంటిరకం కాదుగదాఁ

గోపీ: [కోపంగా] ముసలోడివని ఊరుకున్నాను. మాటలు సరిగా రానిఁ నా పాణంలో పాణం ఉండగా చోరీలు చేస్తానాఁ మా అమ్మ ఏమనేదో తెలుసాఁ 'ఒరే గోపీగా, ఎవ్వరినీ అడక్కుండా ఏమీ తీసుకోగూడదురా. దొంగతనం చేసి బతికేదానికంటే బిచ్చమెత్తుకొవటం మేలురా' అనేది. సరే గాని అమ్మ చెప్పినట్లు నే నిక్కడే వుంటే, ఈ బొమ్మలూ బట్టలూ అన్నీ నాయేగా.

రామయ్య: [అనాలోచితంగా] అవును. నీవేలే. నేను చెప్పింది విని కాస్సేపు పోయిపడుకో.

గోపీ: మళ్ళీ అదేమాట, పడుకోడానికి నాకు నిద్దరొస్తేగాఁ పక్కలి నొప్పి పెడుతుంచే నువ్వు పడుకో నే నిక్కడే వుంటా.

రామయ్య: నీ ఇష్టప్రకారం జరగడానికి ఇది నీ గూడెం అనుకున్నావాఁ ఈ ఇంట్లో అలా కాదు. అందరూ ఆ గడియారం నడిచినట్లు నడవాలి.

గోపీ: అంచే ఈ ఇంట్లో యజమాని ఎవరు, డాక్టరుసాబా, అమ్మాఁ లేక గడియారమాఁ గడియారమంచే నీ కంత భయమైతే దాన్ని బందు చేసెయ్.

రామయ్య: ఓరి పిడుగాఁ నీ తెలివి తెల్లవారినట్లే ఉంది. నీతో పెట్టుకుంచే ఎప్పటికి తెములుతాను, నాకు బోలెడంత పనుంది. నువ్వు ఇక్కడే కూర్చుని ఆడుకో. అమ్మ రాగానే కేకెయ్యి, సరేనాఁ

[గోపీ తల ఊపుతాడు. రామయ్య నెమ్మదిగా లోపలికి వెళ్ళిపోతాడు. గోపీ కిటికీదగ్గర కాసేపు నిలబడి బయటికి చూస్తుంచే, పిల్లల కేకలు వినపడతాయి. ఈల వేసుకుంటూ కాసేపు అటూ ఇటూ తిరుగుతూ రాజా ఫోటోదగ్గిర నిలబడిపోతాడు. అనాలోచితంగా చెయ్యి లాకెట్టుమీదకు వెళ్ళతుంది. కాని షాక్ తిన్నట్లు తీసేస్తాడు. వంటింటి తలుపుదగ్గిరకు వెళ్ళి రామయ్య ఉన్నాడేమోనని చూస్తాడు. అతను లేడని ధైర్యం చేసుకుని ఫోటోదగ్గిరకి గబగబా వెళ్ళి గబుక్కున గొలుసు తీసుకొని జేబులో పెట్టుకుంటాడు. ఫోటోకేసి చూస్తూ.]

గోపీ: ఇది నీ కెందుకుఁ మనిద్దరం ఒకచేగాఁ నేను గొలుసును తీసుకోనాఁ....తీసుకోనాఁ

[లోపల్నించి రామయ్య] గోపీ ఎవరితో మాట్లాడుతున్నావ్ఁ అమ్మ వచ్చిందాఁ

గోపీ: [గతుక్కుమని] రాలేదు. నే నిక్కడే వుంటాలే.

[కొంచెం భయంగా కాసేపు నిలబడి దిక్కులు చూస్తూ, జేబులోంచి గొలుసుతీసి తటపటాయిస్తాడు. మరుక్షణంలోనే ఒక నిర్ధారణకి వచ్చి, లాకెట్‌ని జేబులో వేసుకుని బయటకు వెళ్ళటానికి బయలుదేరతాడు.

ఇంతలో ఎవరో మెల్లిగా వస్తున్న చప్పుడు. తలుపుచాటున నక్కుతాడు. బార్లా తీసిఉన్న తలుపులోంచి సుమతి లోపలికి వచ్చి సరాసరి గదిలోకి వెళ్ళిపోతుంది. లోపలినుంచి, గోపీ, గోపీ అన్న పిలుపు, గోపీ మెల్లిగా బైటికి వెళ్ళిపోతాడు.]

సుమతి: [మళ్ళీ వచ్చి] గోపీ, గోపీ....రామయ్యా గోపీ ఎక్కడ?

రామయ్య: [లోపలనుంచి] అక్కడే ఉన్నాడు గదమ్మా.

సుమతి: [చూట్టూచూచి] అరే. ఇక్కడ లేడే! మైదానంలోకి గాని వెళ్ళాడా?

రామయ్య: [వస్తూ]నేను లోపలి కిప్పుడే వెళ్లాను.ఇంతలోకే ఎక్కడో మాయమయ్యాడు? [గుమ్మందాకా వెళ్ళి] అబ్బే, ఇక్కడాలేదు. గోపీ,గోపీ!

సుమతి: [ఆదుర్దాగా] మరి, పిల్లవా డేమైనట్లు? నరిసింహులు సంగతి తెలియలేదు గదా? [టెలిఫోను డయిల్‌చేసి] గోపీ కనబడటం లేదండీ.... అలాగే....వెతికిస్తాను....మీరు తొందరగా వచ్చేస్తారు కదూ?

రామయ్య: అమ్మ ఇప్పుడే తిరిగి వస్తుంది. హాల్లో కూర్చుని ఆడుకుంటానంటే సరే అన్నాను. పట్టుమని పదినిమిషాలు కాలేదమ్మా. ఎక్కడికి పోయుంటాడు? [అకస్మాత్తుగా అతనిదృష్టి రాజా ఫోటోమీదకు వెళుతుంది] అరే లాకెట్ ఏదీ? [ఆదుర్దాగా] అమ్మగారూ, అమ్మగారూ, చూశారా? లాకెట్ కనబడటం లేదు [నిస్పృహగా] చూడండమ్మా, దొంగ వెధవ దాన్ని కాస్తా పట్టుకుని పారిపోయాడు కాబోలు. శ్రీరామచంద్రా....

సుమతి: [షాకు తిన్నదానిలా] ఆ! ఏమంటున్నావ్? గోపీ లాకెట్ తీసుకుని పారిపోయాడా! ఛ! ఛ!! నేను నమ్మను. గోపీ దరిద్రుడే కావచ్చు కాని వాడు దొంగకాదు. వాడి మనస్సు ఎంత మంచిదో నాకు తెలుసు.... సరిగా వెతుకు. ఆ గొలుసు ఏ మూలో పడివుంటుంది.

రామయ్య: సరేనమ్మగారూ [కొంచెం వెతికి] అబ్బే ఇంకెక్కడ ఉంటుంది? పిల్లోడట్లా కనబడ్డాడేగాని పచ్చికేడీ! ఇంతకీ నామతి ఎక్కడికి పోయిందట! ఇన్నాళ్ళుగా మీ ఇంట్లో ఉన్నాను ఒక్కపూచిక పుల్లైనా పోయిందా?

సుమతి: [అచేతనంగా] గోపీ దొంగతనం చేశాడా? ఇంత దౌర్జన్యపుపని చేశాడా?

రామయ్య: భీంపేటసరుకు, అలాంటివాళ్ళని మన ఇంట్లోకి తీసుకు రావటమే తప్పయిపోయింది. మనం ఎంత తాపత్రయపడ్డావాళ్ళ నీచపు బుద్దిలు ఎక్కడికి పోతాయమ్మా.

సుమతి: ద్రోహం! ఎంత పనిచేశాడు! [కోపంతో ముఖం జేవురిస్తుంది] వాడికి నారాజా లాకెట్టే కావలసివచ్చిందా....కావాలంటే ఏది ఇవ్వనన్నాను?

రామయ్య: దేనికైనా నోచుకోవాలమ్మగారూ. వాడు వట్టి కిలాడీ.... మాటలు చెప్పుతూనే నాకు టోపీవేశాడు. వాడు పెరిగి పెద్దయితే ఆరితేరిన గజదొంగ కాకపోతే నా చెవికోసుకుంటాను. చేసిన పాపాలు ఊరికే పోతాయా చివరికి జైళ్ళల్లో బ్రతుకు వెళ్ళదిస్తారు.

సుమతి: [చాలా వేదనతో] మనరాజా ఇలాంటి పనిచేస్తాడా? నా నా గుండెలు బ్రద్దలు చెయ్యడానికే మళ్ళీ వచ్చాడా! నేను నమ్మను!

[సుమతి భరించరాని దుఃఖంతో లోపలికి వెళ్ళిపోతుంది. రామయ్య నిరుత్తరుడై నిలబడిపోతారు....కొంచెం వ్యవధి—బయటనుంచి షావుకారు గుమాస్తా బట్టలు మూటతీసుకుని ప్రవేశిస్తాడు. పొట్టిగా లావుగా వుంటాడు కొంచెం చెముడు.]

రామయ్య: [ఉలిక్కిపడి] ఎవరండీ తమరూ?

రంగనాయకలు: నేనా?

రామయ్య: నువ్వేనయ్యా! నువ్వుగాక ఇక్కడ వేరే ఎవరైనా ఉన్నారా?

రంగ: వేరే ఎవరుంటారు? నేనేగా?

రామయ్య: బాగానేవుంది వరస, తమ రెవ్వరూ, అని అడుగుతున్నాను.

రంగ: [మూట బల్లమీదపెట్టి] ఇంట్లో ఎవరూ లేరా?

రామయ్య: ప్రత్యక్షంగా నేనిక్కడ కనబడుతూవుంటే ఎవ్వరూ

లేరంటా వేమిటయ్యా? ఇంతకీ నీ వెవరో ఎందు కిక్కడికి దయచేశావో చెప్పావుగాదు.

రంగ: నేనా?

రామయ్య: [విసుగ్గా] మళ్ళీ మొదటి కొచ్చిందీ! నువ్వే! ఇప్పటి కైనా దయచేసి చెపితే రక్షించిన వాడివవుతావు. నాతల బద్దలై పోతోంది.

రంగ: నాపేరు చింతముక్కల వేంకట సత్యన్నారాయణశాయి. ఊరప్ రంగనాయకులు.

రామయ్య: పేరు చాల పొడుగ్గానేవుంది. చక్కగా బిట్టీ పట్టి తడుముకోకుండా చెప్పావు. ఇక వచ్చిన పని?

రంగ: శని? నేను శనిలాగవున్నానా? ఏమయ్యోయ్, మాటలు జాగ్రత్తగారానీ—

రామయ్య: బాబ్బాబు! నేను నిన్నేమీ అనలేదయ్యా వచ్చినపని ఏమిటని అడిగాను. [గట్టిగా] పని!

రంగ: అలాగన్నావు బాగుంది. ఇంతకి నీ వెవరూ అంట

రామయ్య: [ఆశ్చర్యంగా] నేనా?

రంగ: నువ్వేనయ్యా! అలా చెవులప్పగించి చూస్తావేం? నువ్వు కాక వేరెవరైనా ఉన్నారా యిక్కడ?

రామయ్య: నేను . [జ్ఞప్తికి తెచ్చుకొని] అరిపిడుగా!—గట్టి వాడివే, ఇహ చాలించు—తొందరగా వచ్చినపని చెప్పకపోతే బైటికి పంపించాల్సిన అవసరం వస్తుంది.

రంగ: ఏమిచేమిటీ? అర్జంటుగా గుడ్డలు తీసుకురమ్మని ఇప్పుడిలా మాట్లాడుతున్నారేమిటి?

రామయ్య: గుడ్డలా?

రంగ: అవునయ్యా, గుడ్డలే! నీకేమన్నా చెముడా ఏమిటీ? చొక్కాలు, బష్‌కోట్లు, బనియన్లు ఉన్నపళంగా పంపించమని అమ్మగారు షాపుకి ఫోనుచేశారట. ఏదో మునిగిపోతున్నట్లు మా షావుకారు నన్ను తీసికెళ్ళ మన్నాడు.

రామయ్య: ఎవరికోసం?

రంగ: [నవ్వుతూ] నీకోసం కాదులే. నువ్వేమన్నా పదేళ్ళ పాపాయివా?

రామయ్య: ఓహో! అదా సంగతి! అమ్మగారు గోపీకోసరం భోను చేశారన్నమాట.

రంగ: టోపీ? ఎవరికి టోపీ వేశానంటున్నావు! నీతో కబుర్లు చెప్తుంటే అవతల మా బేరాలు పోతాయి. కావలసిన నమూనాలన్నీ తెచ్చానని మీ అమ్మగారికి చెప్పు.

రామయ్య: [తాపీగా] తెచ్చావుగా, ఇక దయచెయ్యి.

రంగ: చెయ్యా? చెయ్యి చూపించ మంటున్నావా? నీకు చేతులు చూట్టంగూడ వచ్చా?

రామయ్య: రామచంద్రప్రభో! ఈ చెమిటోడి పాలిటపడ్డాను [కొంచెం గట్టిగా] చేతులుకాదు నీ అంతం చూస్తాను. ఇకవెళ్ళు....

రంగ; [నిర్ఘాంతపోయి] నుంచున్నా పాళంగా తెమ్మనేది మీరే పొమ్మనేది మీరే! ఇదేమీ నాకు బాగోలేదు. తెచ్చిన గుడ్డలు తిరిగి అమ్మకుండా తీసికెళితే మా షావుకారు ఊరుకుంటాడా? అసలే చండశాసనుడు నేను కాబట్టి ఆయన దగ్గిర తట్టుకొస్తున్నాను. ఇంకొకడయితే ఎప్పుడో ఉడాయించేవాడు.

రామయ్య: ఇప్పుడు నువ్వు ఇక్కడనుంచి ఉడాయించకపోతే చాల కష్టాలలో పడతావు. ఊ! పద-నీ బట్టలు వేసుకోవడానికి ఇక్కడ ఎవరూ లేరు.

రంగ: [మూట ఎత్తుకుంటూ] ఏమిటో అంతా గమ్మత్తుగా వుంది.

రామయ్య: అవును బాబూ, అంతా గమ్మత్తే! నువ్వూ నేనూ ఈ ప్రపంచం—అంతా గమత్తే, వేదాంతం చాలుగానీ, నీ మూట ముల్లే సర్దుకుని బయలుదేరు.

[రంగనాయకులు మూటతీసుకుని గొణుక్కుంటూ కోపంగా వెళ్ళిపోతాడు. డాక్టరు భాస్కర్ ప్రవేశిస్తాడు.]

భాస్కర్: రామయ్యా, ఇపుడిలా వెళ్ళింది వెంకన్న చెట్టిగారి గుమస్తాలా వున్నాడే.

రామయ్య: అవునండీ.... పేరు చాల పెద్దదే గానీ పైన [బుర్ర చూపిస్తూ] ఏమీ లేదండీ.

భాస్కర్: ఎందుకు వచ్చాడుఁ

రామయ్య: ఏవో గుడ్డలు పట్టుకువచ్చాడు అమ్మగారు తెమ్మన్నారట.

భాస్కర్: [ఆశ్చర్యంగా] ఎవరికిఁ

[సుమతి లోపలనుండి వస్తుంది ఆమె ముఖంలో బాధ ఉద్వేగం, కోపం వ్యక్తమవుతూ వున్నాయి. దుఃఖంతో కళ్ళు ఎర్రబడి పోయాయి.]

సుమతి: గోపీకోసరం నేనే తెమ్మన్నాను. వాడికేమైనా బట్టలు కొని పెడదామనుకున్నాను. కాని వాడేం చేశాడో చూచారాఁ

భాస్కర్: ఏం చేశాడేమిటిఁ

రామయ్య: ఇంకెక్కడ గోపీ బాబుగారూఁ టక్కరివాడుఁ పారి పోయాడు.

సుమతి: [ఉద్వేగంతో] అవును భాస్కర్, పారిపోవడమేగాదు, మన రాజా లాకెట్టు దొంగిలించుకొని మరీ పారిపోయాడు. [ఉబుకు తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ] నాకీ ప్రపంచంలో మిగిలిందంతా రాజా లాకెట్టు. దానితో ఎన్ని మధురస్మృతులు ముడిపెట్టుకున్నాను. భాస్కర్ మీకు జ్ఞాపకంలేదూఁ అది మా నాన్నగారు రాజా అన్న ప్రశంసానికి చేయించారు. అందులో చిన్నప్పుడు రాజా దోగాడుతున్న ఫోటో ఎంతో చక్కగా పొదిగారుఁ గోపీకి ఆ లాకెట్టే కావలసి వచ్చిందాఁ

భాస్కర్: [జుగుప్సతో] గోపీ ఇంతపని చేశాడంటే నమ్మలేకుండా వున్నాను. వాడికోసం ఇంత తాపత్రయం పడ్డాంఁ అలాంటి వాళ్ళమీద విజింగా జాలి చూపించకూడదు. పోలీసులకి రిపోర్టిస్తే—

సుమతి: [గతుక్కుమని] పోలీసులకా—పాపంఁ—[మళ్ళీ నిలదీసుకుని] అవునవును. చోరీచేసి పరారయింతర్వాతైనా పోలీసులకి చెప్పకుంటే మనవస్తువు మనకి తిరిగెలా వస్తుంది....[కోపంగా] చూశారుగా

గోపి మనకిచేసిన ఉపకారం.... ప్రపంచంలో మోసం దగా పాలుతోబాటు పోసి పెంచుతున్నారు..చెప్పాల్సిందే [ఆవేదనతో] పోలీసు రిపోర్టిచ్చేయండి.

భాస్కర్: [కొంచెం ఆలోచిస్తూ] పోనీ, గోపీ ఎక్కడికి వెళ్ళేడో కనుక్కుంటే—

సుమతి: వాడెక్కడున్నాడని మనం వెతుకుతాం, లాకెట్టెక్కడుంటే వాడూ అక్కడే వుంటాడు.

భాస్కర్: అవును. ఆమాటా నిజమే....[ఫోను తీసుకొని, డయిల్ చేసి] పోలీసు స్టేషనేనా, నేను డాక్టర్ భాస్కర్ మాట్లాడుతుంది....ఓహో, ఇనస్పెక్టర్‌గారా, మాయింటినుంచి తొమ్మిదేళ్ళ కుర్రాడు పారిపోయాడండి పేరు, గోపి. భీంపేటలో లింగయ్యలేడూ, ఆ వాడికొడుకే....ఎర్రగా బక్కపలచగా వుంటాడు....బంగారు గొలుసుతోడున్న ఒక లాకెట్టుకూడా కనిపించడం లేదండి....వాడే తీసుకెళ్ళి వుంటాడు....అది ఎవరి చేతుల్లోనూ పడకండా చూడాలి....బహుశా భీంపేటకే వెళ్ళి ఉంటాడు....అర్జెంటుగా చూస్తారు కదూ,—మాకా లాకెట్టు చాలా ముఖ్యం....థ్యాంక్సు....[ఫోను పెట్టేసి] ఇంతకీ, గోపి లాకెట్ తీసుకు పోతుంటే మీరంతా ఏమయ్యార్,

సుమతి: నేను వాణితోకలిసి ఒక్క పదినిమిషాలు వాళ్ళింటికి వెళ్ళేను.

రామయ్య: హాల్లో ఆడుకుంటానని అంటే నిజమే ననుకొని లోపల పని చేసుకుంటున్నానయ్యగారూ. వాడికింత దుర్బుద్ధి వుందనుకోలేదు.

భాస్కర్: ఇందులో ఏమైనా పొరపాటు వుందేమో! ఇల్లంతా జాగ్రత్తగా వెదికారా,

రామయ్య: పొరపాటేమీ లేదండీ. అంతా వెతికాం....పొద్దుట నుంచీ గోపీ హాల్లోనే తారట్లాడుతున్నాడండి. అసలు నాది మట్టిబుర్ర.... కించిత్తైనా అనుమానం రాలేదు. ఆళ్ళ గూడెంలో ఎవడో కుర్రాడు బంగారు గొలుసు కాజేసి గాలిపటాలు కొన్నాడంట వీడూ ఆపనే చేసివుంటాడు.

భాస్కర్: పోనీ, ఎందుకైనా మంచిది. మరొకసారి వెతికిరా.... ఎక్కడన్నా ఆడుతున్నాడేమో....

రామయ్య: అలాగేనండి [బయటకి వెళ్తాడు]

సుమతి: రామయ్య చెప్పింది నిజమే అనుకుంటా. ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది....మధ్యాహ్నం గాలిపటాలు కొనుక్కోడానికి డబ్బు లిమ్మన్నాడు.

భాస్కర్: నువ్వేమన్నావుఁ

సుమతి: ఇవ్వనన్నాను.

భాస్కర్: [కొంచెం చిరాకుగా] ఎందుకనిఁ

సుమతి: నారాజాని పొట్టన బెట్టుకొన్న గాలిపటాలని నేను గోపీకి ఎలా ఇవ్వనండీఁ

భాస్కర్: ఒక చిన్న కోరికను తిరస్కరించడం మూలాన, ఆ పసి వాడు ఎలాంటిపని చేశాడో చూశావా [కొంచెం ఆగి, కటువుగా] ఆలో చిస్తే రాజా మరణానికి ఎవరు కారణమో నాకిప్పుడు తెలుస్తూ వుంది.

సుమతి: ఎవరుఁ

భాస్కర్: ఇంకెవరుఁ నువ్వే!—

సుమతి: [నిర్ఘాంత పడిపోయి ఉద్వేగంగా] నేనాఁ నా బిడ చావుకు నేను కారణమాఁ ఎంత క్రూరమైన మాట అన్నారండీఁ [ఏడుస్తూ] ఎవ నైనా తన బిడ్డని చేతులారా చంపుకుంటుందాఁ భగవంతుడు మీ నోట అనరానిమాట అనిపించాడు....

భాస్కర్: కాలసర్పంలా చుట్టలు చుట్టుకుని బుసలు కొడుతున్న భయాన్ని ఇన్నాళ్లూ నాగుండెల్లో దాచుకు తిరిగాను. అస్తమానం ఆసుపత్రి పనిలో సతమతమై పోతూ రాజావి గురించి నేను పట్టించుకోనే లేదు. నీ ప్రేమలో వాడి మనస్సుకు ఏ బాధా వుండదనుకున్నానే కాని అ చిన్నారి మనస్సులో కోరికలు ఉంటాయి గాని, అవి తీరకపోతే తీవ్రమైన పరిణామా లకి దారి తీస్తాయని గాని నేనెప్పుడూ ఊహించలేదు. పిల్లవాడి మనస్తత్వం తెలుసుకోక పోవటం నాతప్పే. అది గ్రహించే లోపలే రాజా మనకి శాశ్వ తంగా దూరమైపోయాడు....తల్లిగా బిడ్డపై నీకెంత ప్రేమ ఉందో తండ్రిగా నాకూ అంతే ప్రేమ వుంది. నీ దుఃఖం నాకు తెలుసు, కాని నా దుఃఖాన్ని ఎవరికి చెప్పుకోనుఁ నువ్వింకా కుమిలి పోతావని ఆ బాధంతా నాలో నేనే

దిగమింగుకున్నాను....నిన్న అకస్మాత్తుగా గోపి కనబడ్డాడు. రాజా పోలిక లున్న వీడిని చూస్తే నీదుఃఖం కొంత మరిచిపోతానేమోనని ఆశపడి ఇంటికి తెచ్చాను. మొదట నువ్వు వాడిని తిరస్కరించినా క్రమేణా నీ హృదయం మారుతుందనుకున్నాను. మోసపోయింది నేనే. రాజాని పెట్టిన నిర్బంధాల్లోనే గోపీని కూడా పెంచుదామని చూచావు....రాజా తల్లిదండ్రులు తప్ప బైట ప్రపంచము ఏమిటో ఎరుగని అమాయకుడు. గోపీ స్వభావం వేరు. పుట్టటం పూరి గుడిసెలోనైనా వాడు పది మంది పిల్లలతో కలిసి తిరిగాడు. తన చుట్టూ వున్న ప్రపంచాన్ని చూచాడు. నువ్వెంత ప్రేమగా చూచినా వాడు తన స్వేచ్ఛని అరికట్టుకుని కోరికలని చంపుకుని నీ బంగారు పంజరంలో ఉండలేక పోయాడు.

సుమతి: [చాలా ఉద్రేకంతో] ఇంతకీ తప్పంతా నాదే నంటారు. ఎంత పాపాత్మురాలినిఃఃః

వాణి: [కొంచెం విసుగ్గా] సరే, అయితే వస్తా.

భాస్కర్: అంత తొందరేమిటి వాణి, కాసేపు కూర్చోగూడదూ? ఇంకా పైముందిలే. ఈమధ్య చాలా హడావిడిగా ఉంటున్నావు. ప్రతి సంఘంలోనూ నువ్వే, ప్రతి పత్రికలోనూ నీ ఫోటోయే! నువ్వు లేకుండా ఈ వూళ్ళో ఏ కార్యక్రమమైనా జరుగుతుందా అని నా సంశయం.

వాణి: [కూర్చుని] ఏదో మనస్సు ఉండబట్టక నెత్తిమీద అన్నీ వేసుకుని చాకిరీ చేసుకున్నాను కాని, ఈ దేశంలో నమ్మకంగా పనిచేసే వాళ్ళకి ఏమైనా మెప్పు వుందా? చెప్పు. మొన్నటికి మొన్న, అంతర్జాతీయ సాంఘిక పంచీమ సభ న్యూయార్క్‌లో జరిగింది. నన్ను డెలిగేట్‌గా పంపిస్తానని నాతో పేపర్లంతా వ్రాయించింది మా ప్రెసిడెంటు. రాత్రిం బగళ్లు కష్టపడి బ్రహ్మాండమైన పేపరు తయారుచేశాను. తగుదునమ్మా అని ఆ మహాతల్లి దాన్ని తీసికెళ్ళి గుక్క తిప్పుకుండా చదివేసింది. పని ఒకరిది, ఫలితం ఇంకొకరిది.

భాస్కర్: ఇది ప్రతిచోట ఉండేదే. మన దేశంలో చెప్పనక్కర లేదు....

వాణి: ఉండొచ్చు, కాని నీతులు చెప్పడమెందుకు? సంఘ సంస్కరులం, ప్రజా సేవకులమని డబ్బాలు కొట్టుకోవటమెందుకూ? మనస్సులో సంస్కారం లేనివాళ్ళు సంఘాన్ని మరమ్మత్తు చేస్తారా? [సుమతి కేసి చూసి] మళ్ళీ దిగాలుగా వున్నావేమిటి, సుమతీ? ఇందాక చాల హుషారుగా వుంటే మా సుమతి మళ్ళీ మనలోకి వచ్చిందనుకున్నాను ...

రామయ్య: [హడావుడిగా వచ్చి] లేదండి. అంతా చూశాను. గోపి ఎక్కడా కనబడలేదు.

వాణి: అవునవును....గోపి ఎక్కడ?

సుమతి: [దుఃఖంతో] గోపి లేడు, వెళ్ళిపోయాడు.

వాణి: వెళ్ళిపోయాడా? కొంచెం వీలుచూసుకొని, వాణ్ణి ఇక్కడే పెట్టి చదువు చెప్పిస్తా నన్నావుగా! ఆ రంగయ్య వచ్చి తీసుకు పోయాడేమిటి?

సుమతి: అలా తీసుకుపోయినా బాగా వుండేది. గోపీ ఎంత ఛండాలపు పని చేశాడో తెలుసా? రాజు లాకెట్టు లేదూ—ఆ ఫోటోమీద వుండేది - తీసుకొని పారిపోయాడు. పాపిష్ఠి వెధవ!

వాణి: ఆఁ, అంత పని చేశాడా! నాకు మొదట్నించి సందేహంగానే వుంది. పుట్టుకతో వచ్చిన బుద్ధులు ఎలా పోతాయి? ఒక కన్ను వేసి చూస్తుండమని చెపుదామనుకున్నాను కాని, నీ ఉత్సాహం చూసి, సంశయించాను. భీంపేట వాతావరణంలో పెరిగే పిల్లలు, ఎంతకైనా తెగిస్తారు. మనం జాలి తలచి వూరుకుంటే లాభం లేదు.

సుమతి: [కొంచెం వెటకారంగా] భాస్కర్, పోలీస్ రిపోర్టు ఇచ్చొస్తావా!

వాణి: మంచి పని చేశావ్, భాస్కర్. ఇవ్వాళ ఇది చేశాడు. పిల్లవాడని ఊరుకుంటే, రేపెవరి గొంతో కోస్తాడు. బాల నేరస్తుల మనస్తత్వం అర్థం చేసుకోవటం చాలా కష్టం. వాళ్ళకి కావల్సింది సరైన చికిత్స, కాని వాడు మనకి దొరకాలిగా! వాడి తండ్రి లింగయ్య ఎక్కడో దాచేసి వుంటాడు. ఇందులో లింగయ్య మద్దతుకూడా వుంటుంది.

[లింగయ్య తలుపు తోసుకొని గబగబా వస్తాడు.]

లింగయ్య: [ఆవేశంగా] డాక్టర్ సాబ్! గోపీగాడు ఇక్కడ చోరీ చేసిపోయిండంట. నిజమేనా బాబూ? ఏదో బంగారం గొలుసు ఎత్తుకు పోయాడంటగా?

భాస్కర్: నిజమే లింగయ్యా!

లింగయ్య: [కోపోద్రేకంతో] వెధవ సన్నాసి! ఎంత దగుల్బాజి పని చేసిండు! నా కళ్ళబడితే ఒళ్ళు చీల్చేస్తాను. ఆళమ్మ కడుపున చెడబుట్టాడు. ఎధవ....[కోపం భరించరాని దుఃఖంగా మారుతుంది.] ఈ చేతుల్తో పొద్దుగాల, ఒక కొడుకుని మట్టి చేశా! చోరీ చేసి పరారుకాకుండా, ఈడు కూడా వాడితోపాటే పోతే సంతోషించే వాణ్ణి. [మళ్ళీ ఆపరాని కోపంతో] ఎక్కడికి పోతాడో చూస్తాను. సున్నంలోకి ఎముక లేకుండా

వాణ్ణి చితక కొట్టక పోతే, నా పేరు లింగయ్య కాదు. నీకెక్కణ్ణించి వచ్చిందిరా, పాడు బుద్ధిః

వాణి: చేతులు కాలింతర్వాత, ఆకులుకి పరిగెడుతున్నావు లింగయ్యాఃతప్పంతా నీలో పెట్టుకొని గోపీని తిడితే ఏం లాభంః

లింగయ్య: [గబుక్కున వాణి కేపి తిరిగి] ఓహో, వాణమ్మగోరాఃతమరిక్కడున్నారాః [పెదసరంగా] ఇంతకీ తప్పంతా నాదే నంటావు. బతే గుందిఃనేను గోపీకి చోరీలు చెయ్యమని చెప్పానాఃనేర్పించానాఃలింగయ్యంటే ఏమనుకుంటుండ్రోఃనేను బీదవాణ్ణి కావచ్చు. కడుపు కక్కుర్తికి గుడుంబా వ్యాపారం పెయ్యొచ్చు. కాని నాకూ పరువూ ప్రతిష్ఠా వున్నాయి.

వాణి: చాల్లే, నీ శ్రీరంగ నీతులు. నువ్వు చేసే గుడుంబా వ్యాపారంలో పిల్లల ద్వారా రవాణా చేయించటం కూడా కడుపు కక్కుర్తికేఃనీ భార్య పోయినతర్వాత వాళ్ళ సంగతి ఏమైనా ఆలోచించావాఃచివరికి ఆ ముత్యాలుని సరాసరి ఇంటికే తెచ్చుకున్నావు. ఎప్పుడూ త్రాగుడు, తంద నాలు. తండ్రి అదుపులేక తల్లికి దూరమైన పిల్లలు తప్పు దారిని త్రొక్కారంటే ఆశ్చర్యమేమీ లేదు.

లింగయ్య: [కోపంతో] ఒక కొడుకు చచ్చాడనీ, ఇంకోడి కోసం పోలీసోళ్ళు పేటంతా గాలిస్తున్నారనీ కుమిలి పోతున్న నన్ను అనవలసిన మాటలేనాఃసుమతి: ఆ సంగతులన్ని ఇప్పుడెందుకులే వాణీఃనాకిదంతా ఒక పీడ కలగా వుంది.

భాస్కర్: లింగయ్యా, నీకెంత బాధగా వుందో నాకు తెలుసు.... అసలే పెద్ద విచారంలో ఉన్నావు. పులి మీద పుట్రలా గోపీ చేసిన దొంగతనం పోలీసులకి రిపోర్టు ఇవ్వటం నాకు మాత్రం ఇష్టమాఃకాని చెయ్యక తప్పలేదు.

లింగయ్య. చేయాల్సిందే బాబూ, నేను చెయ్యొద్దొన్నానాఃవాడి పాపాన వాడు పోవాల్సిందే. కాని ఖర్మం అంతా నాది. ఒక్క రోజులో

ఇద్దరు పిల్లలూ దూరమై పోయారు....దేముడా, నా కెంత కష్టం తెచ్చి పెట్టావు!

వాణి: [ఆవేశం పెరిగిపోయి] ప్రతి విషయానికి భగవంతుడిని తేవటం మనకి ఆచారం అయిపోయింది. పిల్లల్ని గుడుంబా వ్యాపారంలోకి దింపావు. చిల్లర దొంగతనాలు చేస్తూ సినిమాలకీ గాలిపటాల పండేలకీ పోతూవుంటే నీకేమీ పట్టనట్లు వదిలేశావు. రాత్రిళ్లకూడా ఇంటికి రాకుండా ఏ బస్సు స్టాపు దగ్గిరో, సినిమా హాలు వద్దనో జేబులు కొడుతుంటే అదమాయించకుండా ముత్యాలు తోటిదే లోకమనుకుని తండ్రివన్న బాధ్యత మరిచిపోయావు. ఇప్పుడు ఏడ్చి ప్రయోజనం ఏమిటి? పిల్లలు సంఘానికే ప్రతికూలురై ఇష్టం వచ్చినట్లు తిరుగుతున్నారంటే తప్పంతా తల్లిదండ్రులదే నంటాను....

లింగయ్య: [కోపంగా] ఏమమ్మో, పెద్ద-పెద్ద మాటలే స్తుండవ్! ఇది డాక్టరు గారిల్లు కాబట్టి సరిపోయింది....

వాణి: [వినిపించుకోకుండా] ఏం? భయపెడుతున్నావా? విజం చెపితే నిష్ఠూరం. ఆనాడు నీకు చిలక్కి చెప్పినట్లు చెప్పాను. జ్ఞాపకం లేదూ? చాలా చెడ్డ వాతావరణంలో నీ పిల్లలు పెరుగుతున్నారు. వాళ్ళని మా పతిత బాల జనోద్ధరణ సంఘానికి ఒప్పగిస్తే అంతా మేము చూచుకుంటామంటే విరుచుకు పడ్డావు. భీంపేటలో కాలు పెడితే చూసుకోండి అని బెదిరించడమే కాకుండా మీ రౌడీ మూకని మా మీదకి పంపించావు. సమయానికి పోలీసులు రాబట్టి గాని ఆనాడు ఏ ఆఘాయిత్యం జరిగేదో!

భాస్కర్: లింగయ్యా, ఎంత మంచి అవకాశం పోగొట్టుకున్నావు! స్వార్థచింత లేకుండా, సంఘానికి వాణెమ్మ ఎంత సేవ చేస్తూవుందో నాకు తెలుసు. ఆమె నడిపే గృహానికి గోపీని అప్పగించి వుంటే ఇలాంటి పని చేసేవాడు కాదు కదా!

లింగయ్య: ఏంటో బాబూ, బతికి చెడినోళ్ళం. మా యిల్లు గుడిసే కావచ్చు. మేము గంజినీళ్ళు తాగి బతికే వాళ్ళమే కావచ్చు. కాని చూస్తూ-చూస్తూ నా పిల్లల్ని ఈళ్ళదగ్గర పెడతానా? మీరేమన్నా అనండి—ఈఅమ్మ నడిపే సంగం కంటే నా యిల్లే నయం—

వాణి: బాగుంది! చాలా బాగుంది! నరకమే నయమన్నావు కాదు!

లింగయ్య: [కోపంతో] ఇందాకా వచ్చింది కాబట్టి చెప్తా. డాక్టర్ సాబ్, మీరేమీ అనుకోకండి....మా గోపీగాడు దొంగతనం చేసింది నిజమే! కాని సంగం, సంగం అంటూ గవర్నమెంటునీ, ప్రజల్నీ, మాయ చేసే గొప్పోళ్ళ సంగతేంటంట! తెర ఎనక ఆళ్ళాదే భాగోతాలు—

వాణి: ఆగు! నిజం చెప్పాను కదా అని, నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నావు,

లింగయ్య: నేను పెత్యేకంగా మిమ్మల్నంటం లేదమ్మా. ఇప్పుడు జరుగుతున్న సంగతులు చెప్పాను. నేను దొంగసారాయి అమ్ముతుండేది నత్యమే! కాని, ఈ వ్యాపారంలో మొత్తానికి లాభం కొచ్చేది ఎవ్వరో తెలుసో? మా నాయకుడు రాధాకిట్టయ్య....
మేము సీసాలు తాగితే భయన పీపాలే మింగుతాడు. నెల మొదట్లో ఆయన వాటా ఆయనకి ఇక్కచ్చిగా అందాల్సిందే. [వికృతంగా నవ్వుతూ] అయితే ఆయనా పాడుడబ్బు ముట్టుకోడు లెండి. కుర్చీకాడ పడేసి పొమ్మంటాడు.

భాస్కర్: రాధాకృష్ణమూర్తిగారా? ఛ! ఛ! నేను నమ్మను. ఆయన చాలా పెద్దమనిషి.

లింగయ్య: మీ కేం తెలుస్తాయి బాబు! ఈ లోతుపాతులు! పెద్దమనిషే పెద్దమనిషి కానో డెవ్వడు? పోయిన ఎలెక్షన్‌లలో ఆయన్ని ఎన్నుకొన్నాం. సంఘం, దేశం అంటూనే మింగేస్తున్నాడు. ఆయ నొక్కడే కాదు. ఆయన భార్య, బావమరిది కూడా రెండు చేతులా లాగేస్తున్నాడు. ఏవన్నా అంటే, మాలాంటి బీదోళ్ళకి, చాంతాళ్ళంత ఉపన్యాసాలు దంచుతారు.

వాణి: మా సంఘం వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణమూర్తి గార్ని అన వలసిన మాటలేనా? ఛీ! ఈ దేశంలోవున్న కుళ్ళు ఎక్కడా వుండదు. ఒకళ్ళు పనిచేయరు. చేసేవాళ్ళమీద, నానా అభాండాలు వేస్తారు. ఇక దేశం బాగుపడమంటే ఏలా?

లింగయ్య: అదేతల్లీ! నేను అడుగుతూంట! దేశం బాగుపడాలని, ఎవరికుందీ? అంతా పచ్చి అబద్ధం. ఎవడికి దొరికింది అడు జేబులో నింపు

కుంటుండు. పెద్దపెద్ద ఆఫీసర్లు, కంట్రాక్టర్లు, నాయకులా—అందరికీ పట్టింది దబ్బుదాహం. అది ఘరానా దొంగతవం కాబట్టి ఏమీ ఫరవాలేదు, కాని మా గోపీలాటోడు కక్కుర్తిపడ్తే, బందిఖానాలోకి తోసేస్తారు.

భాస్కర్: నువ్వు చెప్పేదాన్లో కొంత నిజం లేకపోలేదులే. కాని, పిల్లవాడు చెడిపోతున్నాడు గదా అని గోపిని సంఘంలో చేర్పించమన్న ప్పుడు, నువ్వు ఒప్పుకోకపోవడం, ఏమీ బాగోలేదు. వాణిమాట వినుంటే, గోపి ఇంత నీచానికి దిగజారిఉండేవాడు కదా?

లింగయ్య: మీరేమీ అనుకోకుంటే, ఒకసంగతి చెప్తా వాణమ్మ నడిపే సంఘంలో ఎంత కుళ్ళు—

వాణి: [అడ్డంవచ్చి] నీతి, జాతి లేని లింగయ్యలాంటి వాళ్ళు చెప్పే దంతా వింటూ కూర్చుంటే, అయినట్లే. సాంఘిక సంక్షేమ కార్యకలాపాల్లో వున్న తంటా అంతా ఇదే! మెప్పులేదు కాని, చేసిన కృషికి, చెప్పుదెబ్బలు, చెప్పుడు మాటలు.

సుమతి: [ప్రప్రథమంగా ఇంటరెస్టు చూపిస్తూ,] పోనీలే వాణీ, లింగయ్య చెప్పేది కూడా వినసీ ఏ లోపమూ లేకుండా, సంగతులు వడుస్తాయా ఆంతమాత్రానికే మనం భయపడట మెందుకు? [లింగయ్యతో] ఏమీ ఫరవాలేదు చెప్పు.

లింగయ్య: పదిమంది పిల్లలుంటే, యాభై మంది పేర్లు చూపించి గవర్నమెంటు గ్రాంటు తీసుకొంటున్నారు. అందరికీ వాటాలే! చివరికి, ఈళ్ళు వూరికే ఇచ్చే పాలపొడికూడా, బ్లాకులో అమ్ముకొంటారు. దీనికంతా రాఘాకిట్టయ్య మద్దతు. ఈ వాణమ్మకేం తెలుసు? వారానికో మాటు సీతాకోక చిలుకలా వచ్చి నాలుగునీతులు చెప్తే సరిపోద్దా? తోటోళ్ళు, కిందోళ్ళు ఏ దగుల్బాజీ పని చేసుకున్నారో, చూసుకోపద్దూ! అంత మోసం! ఈళ్ళంతా దేశాన్ని మరమ్మత్తు చేస్తరట! చెయ్యండి. నా గోపీని కూడా మరమ్మత్తు చెయ్యండి. నే నెలాగూ నాశనమైపోయాను. ఆడన్నా బాగుపడ్తాడో!

[బయట కొంచెం హడావిడి, తలుపుకొట్టి, డాక్టర్ భాస్కర్ ఉన్నారా అంటూ, ఇన్‌స్పెక్టర్ వస్తాడు. అతని వెనకాతలే, గాలిపటాలు,

చత్రి, పట్టుకొని గోపీ. గోపీ ముఖంలో భయం, నిస్సహాయత గోచరిస్తున్నాయి.]

భాస్కర్: ఇన్‌స్పెక్టర్‌గారా, రండి. కూర్చోండి. [గోపీని చూపిస్తూ] దొంగ దొరికాడే.

లింగయ్య: [గోపీతో కోపంగా] నా కడుపున చెడబుట్టావు కదరా, నిన్నేం చేసినా పాపంలేదు. ఆ నరపిల్లుగాడితో పాటూ నువ్వుకూడా చావక పోయావా?

గోపీ: ఏమంటున్నావు నాయనా, నరిపిల్లు సచ్చిపోయిండా [తటాలున గాలిపటాలు క్రింద పడేసి, ఏడుస్తూ] సచ్చిపోయిండా, అమ్మలాగే దేవుడిదగ్గిరకి పోయిండా, అన్నా, అన్నా!, [తండ్రిదగ్గరకు వెళ్ళిపోతాడు]

లింగయ్య: [కోపంగా] ఛీ-ఎదవ నా యాలా, సిగ్గునేదూ, వళ్ళు హూనంచేత్తాను....ఇనస్పెక్టరు గారూ, ఇంకా చూస్తారేంటీ, తీసుకుపోయి వా కాకులకీ గద్దలకీ పడేయండి....పీడా వదలిపోద్ది....

గోపీ: [హృదయ విదారకంగా ఏడుస్తూ] నరిపిములన్నా...నువ్వు కూడా అమ్మదగ్గర కెళ్ళిపోయావా, నన్నొకణ్ణీ చేసి వెళ్ళిపోయావా, ...వీకు మళ్ళీ అమ్మ దొరికింది కదూ, ...నా కెవరున్నారు, అయ్య నన్ను సంపేత్తాడు....

లింగయ్య: చేపిన దొంగపని చాలక ఏడుత్తుండావా, నోర్ముయ్.

ఇనస్పెక్టర్: ఉండవయ్యా...ఉండు.నీ గోలేమిటి మధ్య. [భాస్కర్ కేపి తిరిగి, జేబులోంచి లాకెట్ తీసి చూపిస్తూ] ఇదేనా మీ లాకెట్?

భాస్కర్: అవునండీ, ఇదే [విజయపూర్వకంగా, సుమతితో] మన రాజా లాకెట్టు మనకి మళ్ళీ తప్పకుండా దొరుకుతుందని నేను చెప్పలేదూ? నీ హృదయంలో బరువు తగ్గిందికదా? [సుమతి మాట్లాడదు, ఏదో అనబోతుంది కాని ఉద్వేగభారంతో తలవంచుకుంటుంది. భాస్కర్ ఇనస్పెక్టర్‌తో] చాలా ధ్యాంక్సు, ఇనస్పెక్టర్‌గారూ. మా ఆవిడకీ లాకెట్టంటే పంచప్రాణాలు అందుకనే మిమ్మల్ని తొందరచేశాను, ఏమీ అనుకోకండి.

ఇన్స్‌పెక్టరు: దానికేమిటి లెండి-మా విధి! ఎలాగయినా నిర్వర్తించాల్సిందే గదా.

[రంగనాయకులు హడావిడిగా ప్రవేశిస్తాడు]

రంగ: [ఒగురుస్తూ గాబరాగా] ఇన్‌స్పెక్టర్‌గారూ, ఇన్‌స్పెక్టర్‌గారూ! మీ రిక్కడికి పచ్చారని విని సరాసరి పరిగెత్తుకొచ్చా. చాలా ముఖ్యమైన విషయం సార్.

ఇన్స్: ఎవరయ్యా నువ్వు?

రంగ: నేనా?

రామయ్య: శ్రీరామచంద్రా! ఈ చెవిటోడు మళ్ళీ దాపురించాడు. ఇన్స్‌పెక్టరుగారూ, పేరడిగితే ఈయన ఒక పట్టాన తెమలడు లెండి. మీ కెందు కా బాధ? ఈయనపేరు చింతముక్కల వేంకట సత్యన్నారాయణ శాయి. ఉరఫ్ ఏదో నాయకుడు.

రంగ: బొంద నాయకులంటా వేమిటి? రంగనాయకులయ్యా రంగనాయకులు.

ఇన్స్: [చిరాగ్గా] నీ బొంద! ఇంతకీ ఏదో కొంప లంటుకున్నట్లు వచ్చావేం? మీ ఇంట్లో ఏమైనా చోరీగాని అయిందా ఏమిటి?

రంగ: [నీళ్ళు నములుతూ] భీంపేటనుంచి మా బావమరిదిని పట్టు కొచ్చారట గదండీ? వాడికేమీ తెలియదండీ. ఈ జులాయి వెధవ గోపీగాడు వచ్చి గాలిపటాలు కావాలని గొంతుమీద కూర్చుంటే గొలుసు తాకట్టు పెట్టి కుని ఇచ్చాడంట.

ఇన్స్: [రౌద్రంగా] ఓరి, దొంగ గాడిదకొడకా! నువ్వేనట్రా!; నీ బావమరిదిని వెనకాల పెట్టుకొని పిల్లలచేత దొంగతనాలు చేయించి సంపాయిస్తున్నావు గదూ!

రంగ: అయ్య బాబోయ్! నా కేమీ తెలియదండీ. ఏదో 'కృష్ణా రామా' అనుకుంటూ చేతనైనంతవరకూ పిల్లలకోసరం పాటుపడుతున్నానండీ, కావాలంటే వాణమ్మ నడగండి. ఆమె స్థాపించిన పిల్లల సంఘానికి

కోశాధికారిగా ఊరికే పనిచేస్తున్నానండీ. ఒక్క పైసాగూడ ముట్టిఎరగను. మానవసేవే మాధవసేవ—

ఇన్స్: నోర్ముయ్....పిల్లల్ని నేరాలు చెయ్యడానికి ప్రేరేపించి వాళ్ళని దోచుకుతింటూ ఏమీ తెలియనట్లు నటిస్తున్నావా? రాస్కెల్, పద, స్టేషన్‌కి పద. ఇక్కడగాదు. నీ భరతం అక్కడే పట్టాలి.

రంగ: ఇన్స్‌పెక్టరుగారూ, తొందరపడుతున్నారు-అల్లాటప్పా వాళ్ళ మనుకుంటారేమో! రాధాకృష్ణయ్యగారికి కబురుచేస్తే బయలుదేరానండీ! ఆయన మీకు ఫోన్ చేస్తామన్నారు. అవసరమయితే మంత్రిగారితో గూడ ఒక మాట.

ఇన్స్: ఏం బాబూ! భయపెడుతున్నావా! పెట్టు—నీలాంటివాళ్ళని చాలమందిని చూశాను....ఏయ్ త్రీనాట్‌ఫోర్. వీణ్ణి తీసుకెళ్ళి స్టేషన్ లాకప్‌లో పెట్టు! నేను నెమ్మదిగా వస్తా. [కానిస్టేబిల్ రంగనాయిల్ని నెట్టుకుంటూ వెళ్ళిపోతాడు.]

రామయ్య: శ్రీరామచంద్రా! రామాయణంలో పిడకల వేటలాగా వుంది!

ఇన్స్: డాక్టర్ భాస్కర్! అసలు సంగతి వింటే మీరు చాలా ఆశ్చర్యపోతారు. ఈ గోపి లాకెట్ ఎందుకు దొంగతనం చేశాడో ఊహించారా! [క్రింద పడిపోయిన గాలిపటాలకేసి చూపిస్తూ] వాటికోసం.

భాస్కర్: నేననుకున్నది నిజమేనన్నమాట. గోపి, ఈ దౌర్భాగ్యపు గాలిపటాలకోసం దొంగతనం చేశావా! అడిగితే ఇవ్వకపోయానా! ఒకటి గాదు వంద కొనిపెడుదును గదా!

గోపి: నేను దొంగతనం చెయ్య లేదయ్యగారూ. ఒక్క గాలిపటం కొనియ్యమని అమ్మని అడిగానండీ. కొట్టింది. ముసలాయన్ని అడిగితే ఆయన కేకలేశాడు. అప్పుడు రాజా నడిగానండి. నా గొలుసుతీసుకుని కొను క్కోరా అన్నట్లు అనిపించిందండీ!

ఇన్స్: ఆ లాకెట్లు ఇలా ఇచ్చెయ్యండమ్మా.

సుమతి: ఆదేమిటీ మాకు ఇవ్వరా!

ఇన్స్: అప్పుడే కాదమ్మా. పిల్లలకోసం ప్రత్యేకంగా కోర్టుంది. అందులో మేము కేసు పెట్టాలి, విచారణ పూర్తి కాగానే మీ లాకెట్టు మీకిచ్చివేస్తారు. డాక్టరుగారూ' మీరుమాత్రం లిఖితపూర్వకంగా ఒక రిపోర్టు ఇవ్వాలండీ.

భాస్కర్: అలాగే. రామయ్యా, లోపలికి వెళ్ళి ఒక కాగితము తీసుకురా.

సుమతి: [ఏదో నిద్రలోంచి లేచిన వ్యక్తిలా] కొంచెం ఉండండి. మరి గోపీ పంగతి ఏమిటి?

వాణి: గోపీ సంగతా? అది చాలా స్వల్ప విషయం. విచారణ అయిపోగానే వాణీ జైలుకి పంపరులే. మా సంఘానికి పంపిస్తారు. [ఇన్స్పెక్టరుతో] గోపీని మేజిస్ట్రేట్ దగ్గిర హాజరుపరిచి .ఆర్డరు తీసుకుంటారుగా. మా రిసెక్షన్‌హోమ్ ప్రొద్దుటే ఎనిమిది గంటలకి తెరుస్తాం. సరాసరి అక్కడికే పంపించండి.

ఇన్స్: సరేనమ్మా [గోపీతో] పదరా, వెధవా.

గోపీ: [గోపీ ఏడుస్తూ లింగయ్య దగ్గిరకి వెళ్ళి చెయ్యి పట్టుకుని] అయ్యా నన్ను తీసుకుపోతరంట....వద్దని సెప్పయ్యా.

లింగయ్య [కటువుగా] పోరా, దొంగనాయాలా.

గోపీ: [యింకా ఏడుస్తూ] నేను దొంగని కాను. నమ్మయ్యా....నా మాట నమ్మవూ.

[లింగయ్య ఒక్క క్షణం కొడుకుకేసి చూస్తాడు. కళ్ళు చెమ్మగిల్లుతాయి. కొంచెం సంకోచిస్తాడు. కాని మరుక్షణంలోనే మనస్సు గట్టి చేసుకుని చెయ్యి విదిలించేస్తాడు.]

ఇన్స్: [గోపీ చెయ్యిపట్టుకొని] ఇక చాల్లే, పద.

గోపీ: [హఠాత్తుగా చెయ్యి వదిలించుకుని భాస్కర్ దగ్గిరికి పరిగెత్తుకుపోతాడు] అయ్యా, అయ్యా! ఇంకెప్పుడూ గాలిపటాల జోలికి పోనండీ! మీరు చెప్పినట్టే వింటానండీ. నా అన్నగూడ సచ్చిపోయిండు. నా కింకెవ్వరూ లేరయ్యా. అమ్మ సెప్పినట్టే ఇంటాను.

భాస్కర్: వద్దు గోపీ, వద్దు. ఈ ఇంట్లో వీలాంటి వాడికి స్థానం లేదు. దీనికన్నా ఆ జైలే నయం. వెళ్ళు. అక్కడికే వెళ్ళు. ఇన్స్పెక్టరు గారూ, వీడిని తీసుకెళ్ళండి. నా మనస్సు బాగోలేదు. రిపోర్టురాసి తర్వాత పంపిస్తాను.

వాణి: గోపీ, వీకేం పరవాలేదు. ఇన్స్పెక్టరుగారితో వెళ్ళు. నేను వీ కన్ని ఏర్పాట్లూ జాగ్రత్తగా చేయిస్తానులే.

గోపీ: [వెక్కి వెక్కి ఏడుస్తూ సుమతి దగ్గరికి పరుగెత్తుకుంటూ వెళ్ళి] అమ్మా, అమ్మా. [సుమతి ఒకటి రెండు క్షణాలు శూన్యంగా చూస్తుంది. ఏదో దివ్యమైన అనుభూతి పొందినట్లు కళ్ళు మెరుస్తాయి.]

సుమతి: [దృఢంగా] ఆగండి. గోపీని తీసుకు వెళ్ళడానికి వీల్లేదు.

వాణి: అదేమిటి సుమతీ, వాడు దొంగ. వాడి కెటువంటి శిక్ష కావాలో కోర్టు నిర్ణయించాలి.

సుమతి: [కోపంగా] వీల్లేదు. మా రాజా, మా బంగారు రాజాకి దొంగతనం చేయవలసిన గతి ఏం పట్టింది? ఆ లాకెట్టు నేనే వాడికిచ్చాను. వాడి వస్తువు వాడేమైనా చేసుకుంటాడు. మధ్యలో మీరంతా ఎవరు?

భాస్కర్: కొంచెం నిదానించు సుమతీ.

సుమతి: మీరు వూరుకుందురూ. నేను చెప్తున్నాగా! ఆ లాకెట్ వాడిదే. ఈ వస్తువులన్నీ వీవేరా అని నేనే చెప్పాను.

ఇన్స్: ఏమిటో, అంతా అయోమయంగా వుంది. డాక్టరుగారూ, గోపీ దొంగతనం చేశాడని మీరేగా రిపోర్టు చేశారు. మరిప్పుడు కథ ఇలా అడ్డం తిరిగిందే: ముందా పిల్లవాడిని మా కప్పగించండి.

రామయ్య: ఇన్స్పెక్టరుగారూ—

ఇన్స్: ఏమిటయ్యా? ప్లానకంలో పుల్ల లాగు నువ్వొకడివి.

రామయ్య: కాస్త అటు చూస్తారా?

ఇన్స్: అటంటే?....

రామయ్య: అదేనండీ, ఆ ఫొటోకేసి చూడండి....బాగా చూశారా, మరి గోపీని చూడండి. ఇద్దరూ ఒకటి కాదూ.

ఇన్స్: [ఆశ్చర్యంగా] అరే ఒకటిగానే వున్నారే! డాక్టరుగారూ, ఈ ఫొటోలో అబ్బాయి—

భాస్కర్: మా అబ్బాయండీ.

ఇన్స్: మరి ఈ అబ్బాయి?

సుమతి: [తొందరగా అందుకుని] మా అబ్బాయేనండీ, మా రాజా.

ఇన్స్: అంతా గందరగోళంగా వుంది. ఇంతకీ ఈ అబ్బాయి మీ వాడని రాసిస్తారా!

సుమతి: [భాస్కర్‌తో] ఏమండీ....

భాస్కర్: ఇన్స్‌పెక్టరుగారు అడిగేది ముందు తేల్చిచెప్పు. పోలీసులతో వ్యవహారం. తర్వాత లేనిపోని చిక్కులు వస్తాయి.

సుమతి: [అపూర్వమైన ఆనందంతో] ఇన్స్‌పెక్టరుగారూ, ఈ అబ్బాయి మా అబ్బాయేనండీ. కావాలంటే కాగితంమీద రాసి యిస్తాము. అది చాలుకదా? [గోపీని దగ్గరకు తీసుకొని] రా, బాబూ....నీకే భయమూ లేదులే....నేనున్నానుగా....నిన్నెవరూ తీసికెళ్ళరులే....

భాస్కర్: క్షమించండి ఇన్స్‌పెక్టరుగారూ, మీకు చాలా శ్రమ యిచ్చాం. కాని మీ ఉపకారం ఎన్నటికీ మరవలేం. [సుమతికేసి ఆనందంగా చూస్తూ] మీకు తెలియకపోవచ్చు—ఇంకెన్నటికీ దొరకదనుకున్నది మా కివాళ మళ్ళీ దొరికింది....అదే చాలు....

ఇన్స్: ఏమి పోయిందీ? ఏమి దొరికిందీ? లాకెట్టేగా....[భాస్కర్ కాదన్నట్లు తల ఊపుతాడు.]....ఏమో....నాకేమీ తెలియడంలేదు....మరి వెళ్తాను. స్టేషనులో బోలెడు పనులున్నాయి [పరధ్యాన్నంగా వంటింటివేపు పోతాడు]

రామయ్య: [కొంచెం చిలిపిగా] ఇన్స్‌పెక్టర్‌గారూ, ఇటుకాదండి....అటు....

ఇన్స్: అరే! అంతా అయోమయంగా వుంది. [బయటికి వెళ్ళిపోతాడు.]

లింగయ్య: [సుమతితో] అమ్మగారూ, నాకు బాగా బుద్ధిచెప్పారు.

ఇన్నాళ్ళకి నా కళ్ళు తెరిపించారు. పిల్లల్ని కన్నానేగాని వాళ్ళకి తండ్రిని కాలేకపోయా....గోపీ మీ బిడ్డే....[కళ్ళు తుడుచుకుంటూ గిరుక్కున వెళ్ళిపోతాడు.]

వాణి: నేనూ వెళ్తాను భాస్కర్.

సుమతి: ఈపూట ఇక్కడే భోంచేసి వెళ్ళకూడదూ....

వాణి: ఈ గొడవలో పడిపోయాను. మా కల్చెరల్ ప్రోగ్రాం సగం అయిపోయి వుంటుంది....అసలే కనబడకపోతే గొడవచేస్తారు....ఇప్పుడు బయలుదేరితే 'జనగణమణ' కన్నా చేరుకోవచ్చు....వస్తా. [వెళ్ళిపోతుంది.]

సుమతి: [గోపీని దగ్గరకు తీసుకుని] గోపీ—ఎన్ని గాలిపటాలు కొన్నావురా....మనం అందరమూ కలసి ఎగరేద్దామా....ఇంకా పూర్తిగా చీకటి పడలేదు....

గోపీ: [ఎగిరి గంతేసి] ఓ! అంతకంటేనా! నేను పతంగులేస్తే జాక్రీ ఎవరు పట్టుకుంటారు?

[భాస్కర్, రామయ్యా నవ్వుతారు]

సుమతి: వాళ్ళూ వస్తారులే....లేకపోతే, నేను పట్టుకుంటానుగా. సరేనా? పద. [భాస్కర్‌తో] రండీ....పిల్లవాడు సరదా పడుతున్నాడు.

[గోపీ, భాస్కర్, సుమతీ నెమ్మదిగా బయటికి వెళ్తారు. టెలిఫోను మోగుతుంది.]

రామయ్య: [టెలిఫోను తీసుకుని] డాక్టరుగారాండీ! ఇప్పుడే బయటి వెళ్ళారండి. అమ్మగారుకూడా....[నవ్వుతూ] గాలిపటా లెగురేయటానికండి....]టెలిఫోను పెట్టేసి] శ్రీరామచంద్రా! యీ ఇంట్లో మళ్ళీ దీపం వెలిగించావు తండ్రీ!...

[నెమ్మదిగా తెరపడుతుంటే నేపధ్యంలో సంగీతం]

గాలిపటం, గాలిపటం
జీవితమే ఒక గాలిపటం.
గాలీ దారం ఉన్ననాడు అది
గగన సీమనే ఏలునురా

లేనినాడు ఒక గమ్యంలేక ముళ్ళ పొదలలో కూలునురా.
గాలిపటం, గాలిపటం....
నేటి బాలురే రేపటి పౌరులు
చూపండి వారికి పరై న ద్రోవలు
ప్రతిపాపడిలో పరంధామునే చూచిననాడే పర్వదినం!....
గాలిపటం, గాలిపటం
జీవితమే ఒక గాలిపటం.

[పూర్తిగా తెర]

ముచ్చటైన మూడంకాల

నవీన హాస్య నాటకం

డైవోర్స్ - '70

సూరత్తు వేణుగోపాలరావు

ఈ పరిమితి చట్టాన్ని తప్పించుకోడానికి (దొంగ) విడాకులు తీసుకొమ్మని ఆ దంపతులకి 'తికమక' లాయరు సలహా. "విడాకులు. విడాకులు-ఏమిటా ఆకులు?" అని వారి చిన్నమ్మాయి అరుణ ప్రశ్నిస్తుంది. (అపర) సావిత్రమ్మా, (కిం) పురుషోత్తమూ అవస్థపడి విడాకులు సంపాదిస్తారు. అమ్మాయి అందాకా తండ్రి అధీనంలో ఉంటుందన్నారు జడ్జి. ఇంట్లో హాలులో అడ్డిగోడ లేచింది. సావిత్రమ్మ మేనమామ కొడుకు-సోషలిస్టు విశ్వాని కది నచ్చలేదు. కట్నంతెచ్చే పిల్లను కాదని, క్లాసు మేటు మాలతిని చేసుకుంటా నన్నాడని విశ్వాన్ని ఇల్లు వెడలగొడతాడు తండ్రి. సావిత్రమ్మ పంచన విశ్వమూ. అరుణకి టీచరుగా మాలతీ అక్కడ చేరడంతో అడ్డుగోడ అపోహలకి దారితీసి, విడాకులు చిక్కులు కలిగిస్తాయి. ఆలుమగలు నిజంగానే విడిపోవాలనుకునే పరిస్థితివచ్చి, కథ రసకందాయంలో పడుతుంది....

MSCO

యం. కేషావలం అండ్ కో

మచిలీపట్టణం. మద్రాసు. సికింద్రాబాద్

Printed at Orr Jay Process, Madras 600002

MSCO 158

డైవోర్స్-'70

రూ. 3-50